
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 44



'నా అక్కలూ.. చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

#ShowTheWay
brides of india
MALABAR
GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE





10 మలబార్ వాగ్దానాలు

సంపూర్ణ పారదర్శకత
హామీతో కూడిన జీవిత కాలపు నిర్వహణ
బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు
100% HUID చేయబడిన బంగారం
పరీక్షించబడిన & ధృవీకరించబడిన వజ్రాలు
తిరిగికొనుగోలు హామీ
అదనంగా బీమా సదుపాయం
ఫెయిర్ ప్రైస్ పాలసీ
బాధ్యతాయుతమైన మూలాల నుండి సేకరించిన ఉత్పత్తులు
న్యాయమైన కార్మిక విధానాలు

హైదరాబాద్: సోమాజిగూడ | కె.పి.హెచ్.బి కాలనీ | దిల్‌సుఖ్‌నగర్ | ఎ.ఎస్. రావు నగర్ | మెహిదిపట్నం | చందానగర్ | హిమాయత్ నగర్ | కొండాపూర్ | హబ్సిగూడ | కొంపల్లి | శాలిబండ | **కూకట్‌పల్లిలో 2వ షోరూము మే 13వ తేదీన గొప్ప ప్రారంభం**

Call: 1800 572 0916
BUY ONLINE AT: malabargoldanddiamonds.com
ఇండియా | యు.ఎస్.ఎ | సింగపూర్ | మలేషియా | యు.ఎ.ఇ | ఖతర్ | కె.ఎస్.ఎ | ఒమన్ | కువైట్ | బహ్రెయిన్

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 6-5-2023

జంతు చెలిమి

స్కూల్‌కు ఏనుగొచ్చింది

**ఏనుగు స్కూల్‌కి వస్తే?
పిల్లలు దానిని భయం లేకుండా
తాకి, నిమిరి ఆనందిస్తే?
ఆ ఏనుగు కళ్లార్పుతూ, చెవులు కదిలిస్తూ
మాట్లాడుతూ తన గురించి చెప్పకుంటే?
'ఎలీ' అనే యానిమెట్రానిక్ ఏనుగు
ఇకపై దేశంలోని స్కూళ్లకు తిరుగుతూ
పిల్లలకు ఏనుగుల జీవనంలో ఏది
ఇష్టమో, ఏది కష్టమో చెప్పనుంది.
'పెటా' ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా
'ఎలీ'కి గొంతు ఇచ్చిన నటి దియా మిర్జా
ఏనుగులపై జరుగుతున్న దాష్టీకాలపై
పిల్లలకు అవగాహన కల్పించడానికి నడుం కట్టింది.
ముంబైలో శుక్రవారం మొదలైన ఈ కార్యక్రమం
పిల్లలు, తల్లిదండ్రులు, జంతు ప్రేమికులు
తప్పక ఆహ్వానించదగ్గది.**


'ఎలీ'తో పిల్లలు

సుప్రసిద్ధ తమిళ రచయిత జయమోహన్ 'ఏనుగు డాక్టర్' అనే కథ రాశారు. మదుమలై అడవుల్లో ఏనుగుల డాక్టర్‌గా పని చేసిన ఒక వ్యక్తి అనుభవాలే ఆ కథ. అందులో ఆ డాక్టర్ అడవుల్లో పిక్నిక్‌ల పేరుతో తిరుగుతూ బీరు తాగి ఖాళీ సీసాలను రోడ్ల మీద ఎక్కడ పడితే అక్కడ విసిరేసే వాళ్ల మీద చాలా ఆగ్రహం వ్యక్తం చేస్తాడు. దానికి కారణం బీరు సీసా మీద ఏనుగు కాలు పెట్టగానే అది పగులుతుంది. ఏనుగు పాదంలో దిగబడి పోతుంది. ఇక ఏనుగుకు నడవడం కష్టమైపోతుంది. అది తిరగలేదు. కూచోలేదు. లేవలేదు. ఒక చెట్టును ఆసరా చేసుకుని నిలబడి పోతుంది. అలాగే వారం పదిరోజులు నిలబడి తిండి లేక కృశించి మరణిస్తుంది. ఇది ఎవరు జనానికి చెప్పాలి? ఎవరు ప్రచారం చేయాలి? ఎవరో ఒకరు లేదా అందరూ ఏదో ఒక మేరకు పూనుకోవాలి కదా. 'పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్' (పెటా) నిన్న (శుక్రవారం) ఏనుగులతో జనం మైత్రి కోసం ముఖ్యంగా పిల్లల్లో అవగాహన కోసం ఒక ప్రచార కార్యక్రమం మొదలుపెట్టింది. అచ్చు నిజం ఏనుగులా కనిపించే యానిమెట్రానిక్ ఏనుగును తయారు చేయించి దాని ద్వారానే పిల్లల్లో చైతన్యం కలిగించనుంది. ఆ ఏనుగుకు 'ఎలీ' అనే పేరు పెట్టారు. ఈ కార్యక్రమానికి 'వైల్డ్‌లైఫ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా'లో అంబాసిడర్‌గా ఉన్న దియా మిర్జా తోడు నిలిచింది. ఆమె ఏనుగుకు తన కంఠం ఇచ్చింది.

నేను... ఎలీని...

నిజం ఏనుగులా అనిపించే ఎలీ ఇకపై ఊరూరా తిరుగుతూ స్కూల్‌కి వస్తుంది. అందులో రికార్డెడ్‌గా ఉన్న దియా మిర్జా కంఠంతో మాట్లాడుతుంది. ఇది యానిమెట్రానిక్ బొమ్మ కనుక కళ్లు కదల్చడం, చెవులు కదల్చడం లాంటి చిన్న చిన్న కదలికలతో నిజం ఏనుగునే భావన కలిగిస్తుంది. అది తన చుట్టూ మూగిన పిల్లలతో ఇలా చెబుతుంది. 'నేను ఎలీని. నా వయసు 12 సంవత్సరాలు. నేను ఇంతకు ముందు ఒక సర్కస్‌లో పని చేసే దాన్ని. జనం నన్ను సర్కస్‌లో చూసి ఆనందించేవారు. కాని అలా ఉండటం నాకు ఆనందం కాదు. అడవిలో తిరిగే నన్ను కొందరు బంధించి సర్కస్‌కు అప్పజెప్పారు. సర్కస్ ఫీట్లు చేయడానికి నన్ను బాగా కొట్టేవారు. నన్ను గట్టి నేల మీద ఎప్పుడూ నిలబెట్టేవారు. అలా నిలబడితే నాకు కష్టంగా ఉంటుంది. అసలు జనం మధ్య తిరగడం, గోల వినడం ఇవన్నీ నాకు భయం. సర్కస్ లేనప్పుడు నన్ను గొలుసులతో కట్టేస్తారు. ఏనుగుల గుంపు నుంచి ఏనుగును విడదీస్తే అది ఎంతో బాధ పడుతుంది. కాని ఇప్పుడు నేను విముక్తమయ్యాను. నన్ను ఒక సంస్థ విడిపించి బాగా చూసుకుంటోంది. నేను హాయిగా ఉన్నాను' అని తన కథను ముగిస్తుంది.


దియా మీర్జా

కొనసాగుతున్న హింస

'ఏనుగులు ప్రకృతిలో ఉండాలి. జనావాసాల్లో కాదు. ఒక తల్లిగా పిల్లలకు కొన్ని విషయాలు తెలియాలని కోరుకుంటాను. పెటాతో కలిసి బాలబాలికల్లో చైతన్యం కోసం పని చేయడం మూగజీవులకు, పిల్లలకు బంధం వేయడంగా భావిస్తాను' అని దియా మిర్జా అంది. ఏనుగులను ఇవాళ్టికీ ఉత్సవాల్లో, పర్యాటక కేంద్రాల్లో, బరువుల మోతకు, వినోదానికి ఉపయోగిస్తున్నారు. మనుషుల ఆధీనంలో ఉన్న ఏనుగుకు ఎప్పుడూ కడుపు నిండా తిండి, నీరు దొరకవు. వాటిని గొలుసులతో బంధించి ఉంచడం వల్ల ఒక్కోసారి అవి అసహనానికి గురై మనుషుల మీద దాడి చేస్తాయి. ఎలిఫెంట్ సఫారీల వల్ల ఏనుగు వెన్ను సమస్యలతో బాధ పడుతుంది. ఇవన్నీ మన తోటి పర్యావరణ జీవులతో ఎలా మెలగాలో తెలియకపోవడం వల్ల జరుగుతున్న పనులేనని 'పెటా' వంటి సంస్థల ప్రతినిధులు, జంతు ప్రేమికులు తెలియచేస్తున్నారు.

'ఎలీ' వంటి ఏనుగులు ప్రతి ఊరు వచ్చి పిల్లలతో, పెద్దలతో సంభాషిస్తే లేదా ఇలాంటి సంభాషణను ప్రతి స్కూల్లో వీడియోల ద్వారా అయినా ప్రదర్శిస్తే మార్పు తథ్యం.

స్పందన

**ఆగినప్పుడు అడుగు ముందుకు పడటానికి తోడు కావాలి. నడిపించే సాయం కావాలి.
లోకం మనల్ని కూడా నడిపిస్తుందన్న నమ్మకం కలిగించాలి.
అహ్మదాబాద్‌కు చెందిన శ్రద్ధా సోపార్కర్ నడవలేని వారికి తోడు నిలుస్తుంది.
వారికి ప్రోస్థెటిక్ కాళ్లు అమర్చి జీవితాల్లో మళ్లీ కదలిక తెస్తోంది.
సెరిబ్రల్ పాల్సీతో బాధ పడుతున్న సొంత కూతురిని చూశాక సాటి వారి బాధ ఆమెకు అర్థమైంది.
ఆమె స్పందన ఇవాళ ఎందరికో వెలుగు.**


సాయం పొందిన బాలికతో శ్రద్ధా సోపార్కర్



తోడుంటే నడుస్తారు

శ్రద్ధా సోపార్కర్ లా చదివింది. కాని ఎప్పుడూ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం రాలేదు. ఆమెకు హైజీన్ ప్రాడక్ట్స్ తయారు చేసే ఫ్యాక్టరీ ఉంది. భర్త కూడా వ్యాపారస్తుడు. మొదట కొడుకు పుట్టాడు. అంతా హ్యాపీగా ఉండగా 2016లో కుమార్తె పుట్టినప్పుడు కుదుపు వచ్చింది.

'నా కుమార్తెకు సెరిబ్రల్ పాల్సీ అని డాక్టర్లు చెప్పారు. నా కాళ్ల కింద భూమి కదిలిపోయింది. ఆ డిజార్డర్ ఉన్న పిల్లలకు వెంటనే నయం కాదు. జీవితంలో వారు పూర్తిగా నార్మల్ కాలేరు. వారికి కావలసిన థెరపీలు, సర్జరీలు చేయించాలంటే చాలా ఖర్చు కూడా. డబ్బుకు నాకు ఇబ్బంది లేదు కాబట్టి నా కుమార్తెకు కావలసిన థెరపీలు మొదలుపెట్టాను. కాని నా కుమార్తె వల్లే నాకు చుట్టూ ఉన్న ప్రపంచంలో ఎంత మంది ఇబ్బంది పడుతున్నారో అర్థమైంది' అంటుంది శ్రద్ధ.

■ మలుపు తిప్పిన ఘటన

'2018లో అహ్మదాబాద్‌లోని ఒక థెరపీ సెంటర్‌కు పాపను తీసుకుని వెళ్లాను. సెరిబ్రల్ పాల్సీతో బాధ పడుతున్న నాలాంటి పిల్లల తల్లులు కూడా చాలామంది వచ్చారు. అందరం భోజనానికి కూచున్నప్పుడు ఒకామె ఉత్త మజ్జిగ తాగుతూ కనిపించింది. ఎందుకు బాక్స్ తెచ్చుకోలేదు అని అడిగాను. ''నేను ఇళ్లల్లో పని చేస్తాను. మా ఆయన ఆటో నడుపుతాడు. మా సంపాదన కొడుకు థెరపీలకు చాలడం లేదు. అందుకే అన్నం కూడా వండుకోలేకపోతున్నాం'' అంది. నాకు మనసు చేదుగా అయిపోయింది. ఆమెకు కావాల్సిన సాయం చేయడం మొదలుపెట్టాను. అలాంటి తల్లులు మరికొంత మంది వచ్చారు. వారికీ చేయడం మొదలుపెట్టాను. సాయం పొందుతున్న వారు 10 మంది అయ్యేసరికి నా భర్త ఒక చారిటబుల్ ట్రస్ట్ పెట్టి సేవ చేయి అన్నాడు. అలా మధురం చారిటబుల్ ట్రస్ట్ పెట్టి నా సేవను మొదలు పెట్టాను' అంది శ్రద్ధ.

■ చిన్నారులకు సేవ

మెదడు సంబంధమైన రుగ్మతల వల్ల కదలికలు పరిమితమైన చిన్నారులకు, టీకాలు సరిగా వాడకపోవడం వల్ల అనారోగ్యం పాలైన చిన్నారులకు కావలసిన థెరపీలు, మందులు, వైద్య సహాయం ఇవన్నీ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా ఇవ్వడం మొదలుపెట్టింది శ్రద్ధ. ఆమె తన సొంత డబ్బుల నుంచి ఇవన్నీ చేయడం మొదలుపెట్టింది. ఆ తర్వాత ఆమెకు మెల్లగా సాయం అందసాగింది. 'పేదవర్గాల తల్లిదండ్రులు తమ పిల్లలకు సెరిబ్రల్ పాల్సీ వస్తే నిస్సహాయంగా వదిలేస్తారు. అది పిల్లల స్థితిని మరింత దిగజారుస్తుంది. వారికి ప్రభుత్వం నుంచి కూడా పెద్దగా సాయం అందడం లేదు. మనలాంటి వాళ్లం స్పందించకపోతే ఎలా?' అంటుంది శ్రద్ధ.

■ ప్రోస్థెటిక్ కాళ్లు

ఈ థెరపీలతో పాటు ప్రమాదవశాత్తు లేదా జన్మతః కాళ్లు కోల్పోయిన పిల్లలకు, పెద్దలకు ప్రోస్థెటిక్ కాళ్లు అమర్చాలని నిశ్చయించుకుంది శ్రద్ధ. అయితే ఇవి నాసిరకంవి కాదు. ఓట్టోబాక్ అనే జర్మన్ కంపెనీ సాయంతో నాణ్యంగా తయారైన కృత్రిమ కాళ్లు. ''ఇప్పటికి 100 మందికి కృత్రిమ కాళ్లు ఇచ్చాం. నడవడం మానేసిన ఆ దురదృష్టవంతులు మేము అమర్చిన ప్రోస్థెటిక్ కాళ్లతో నడిచినప్పుడు వాళ్ల కళ్లల్లో కనిపించిన ఆనందం అంతా ఇంతా కాదు. ఈ కాళ్లు అమర్చాక వాహనాలు నడపొచ్చు. సైకిల్ కూడా తొక్కొచ్చు. స్నానం చేయడంలో కూడా ఇబ్బంది లేదు'' అంది శ్రద్ధ. ఈమె ద్వారా కాళ్లు అమర్చుకున్న చిన్నారులు ఆటలు ఆడుతూ గెంతుతూ సంతోషంగా ఉండటం కూడా చూడొచ్చు.

డబ్బు చాలామంది దగ్గర ఉంటుంది. కాని స్పందించే గుణమే కావాలి. సేవకు అడుగు ముందుకేస్తే నాలుగు చేతులు తోడవుతాయి. నాలుగు కాళ్లు నడుస్తాయి. తాము నడుస్తూ నలుగురినీ నడిపించే వారే గొప్పవారు.

బ్యూటిప్స్

టర్మరిక్ క్యూబ్స్‌తో.. మచ్చలేని అందం

ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ వేసవి ఎండల్లో ముఖ చర్మం జిడ్డుగా, మొటిమలు, బ్లాక్, వైట్ హెడ్స్ వల్ల వడలిపోయినట్లుగా కనిపిస్తుంది. ఈ సమస్యలన్నింటికీ పసుపు ఐస్‌క్యూబ్‌లతో మంచి పరిష్కారం లభిస్తుంది.



- టీస్పూను పసుపు, టీస్పూను ముల్తానీ మట్టి, టీస్పూను ఆరెంజ్ పొడి, కప్పు రోజ్‌వాటర్, టీస్పూను కొబ్బరి పాలు, ఆరు చుక్కల నిమ్మనూనెను తీసుకుని ఒక గిన్నెలో వేసి చక్కగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఐస్ క్యూబ్స్ ట్రేలో పోసి గడ్డకట్టేంత వరకు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ఈ క్యూబ్‌లు మూడు వారాల వరకు తాజాగా ఉంటాయి.
- ముఖాన్ని శుభ్రంగా కడిగి ఈ ఐస్‌క్యూబ్స్‌తో ఇరవై నిమిషాల పాటు మర్దన చేయాలి
- ఇరవై నిమిషాల తరువాత నీటితో కడిగి తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్‌ను రాసుకోవాలి.
- ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల ముఖంపై పేరుకుపోయిన మొటిమల తాలూకు మచ్చలు, వైట్, బ్లాక్‌హెడ్స్, ట్యాన్ పోయి ముఖం తాజాగా, కాంతివంతంగా కనిపిస్తుంది.
- చర్మం జిడ్డు కారడం నియంత్రణలో ఉండడమే గాక, దీర్ఘకాలంగా వేధిస్తోన్న మొటిమలు కూడా తగ్గుముఖం పడతాయి.
- పసుపు, కొబ్బరి పాలు వృద్ధాప్య ఛాయలను నియంత్రించి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

అరవైలో అల్లికలు

● లక్షల్లో ఆదాయం


క్రోచెట్ వర్క్‌తో తయారు చేసిన బొమ్మలు చూపుతున్న కంచన్

**అభిరుచి ఏ వయసులోనైనా మనకు ఆదాయ వనరుగా మారవచ్చు.
గుర్తింపును తీసుకురావచ్చు.
ఈ మాటను 'లక్ష'రాల నిజం చేసి చూపుతోంది
అరు పదుల వయసులో ఉన్న కంచన్ భదానీ అనే గృహిణి.
జార్ఖండ్ రాష్ట్రంలో ఉండే కంచన్ ఏడాది క్రితం వరకు గృహిణి.
ఇప్పుడు వ్యాపారవేత్తగా మారింది.
అదీ తనకు బాగా నచ్చిన అల్లికల బొమ్మలతో.
యేడాదిలోనే రూ.14 లక్షల రూపాయలు సంపాదించడమే కాకుండా,
యాభై మంది గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తూ తన సత్తా ఏంటో నిరూపించింది.
ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్న కంచన్‌కు వచ్చిన
ఈ ఆలోచన గురించి ఎవరైనా అడిగితే ఎన్నో విషయాలు వెలిబుచ్చుతుంది.**

''వస్త్ర పరిశ్రమ ఎంతో వేగవంతంగా మారిపోతోంది. అయినా ఇప్పటికీ ఇళ్లలో చేతితో కుట్టే ఎంబ్రాయిడరీకి, అల్లిన వస్తువులకు ఎనలేనంత డిమాండ్ ఉంది. ఒకప్పుడు తల్లులు, అమ్మమ్మలు చాలా సాధారణంగా రోజువారీ ఇంటి పనులు పూర్తి చేసిన తర్వాత టేబుల్ క్లాత్‌లు, సోఫా కవర్లు, బొమ్మల వరకు అనేక అలంకార వస్తువులను తయారుచేసేవారు. అలాంటి వస్తువులు కాలక్రమంలో తగ్గిపోతున్నాయి. ఇది గమనించే 2021లో 'లూప్‌హూప్' పేరుతో క్రోచెట్ బొమ్మల యూనిట్‌ను స్టార్ట్ చేశాను. దీనికి ముందు 50 మంది గిరిజన మహిళలకు క్రోచెట్ కళలో శిక్షణ ఇచ్చి, వారికి వర్క్ ఇస్తుండేదాన్ని. కోల్‌కతాలో పుట్టిన పెరిగిన నేను మా అమ్మమ్మ, అత్తలు తయారుచేసే క్రోచెట్ బొమ్మలు, టేబుల్ క్లాత్ తయారు చేయడం చూసి నేర్చుకున్నాను. ఆ రోజుల్లో ప్రతి ఆడపిల్లకు కుట్లు, అల్లికలు నేర్పేవారు.

■ స్కూల్లోనూ నైపుణ్యం..

ఇంట్లోనే కాదు, స్కూల్లోనూ క్రోచెట్ వస్తువుల తయారీలో శిక్షణ ఉండేది. దీంతో ప్రాక్టీస్ బాగా అయ్యింది. పెళ్లయ్యాక పట్టణప్రాంతానికి వెళ్లాల్సి రావడం, బాధ్యతలు పెరగడంతో పై చదువులకు వెళ్లలేకపోయాను. కానీ, వచ్చిన క్రోచెట్ కళను ఇష్టంగా చేస్తుండేదాన్ని. మా వారి ఉద్యోగరీత్యా మేం జార్ఖండ్‌లోని ఝుమ్రీ తెలయాకు మారినప్పుడు అక్కడ గిరిజన స్త్రీలను చూశాను. వారు గనులలో పనులు చేసేవారు. రోజువారి కూలీ ఏ మాత్రం వారికి సరిపోదు. వారి బాధలను చూసి, ఏదైనా మార్పు తీసుకురాగలిగితే బాగుంటుందని ఆలోచించేదాన్ని. ఏదైనా చేస్తాను అనుకుంటాను, కానీ, ఏం చేయాలో కచ్చితంగా తెలిసేది కాదు.

■ కుటుంబ బాధ్యతలలో..

ముగ్గురు పిల్లల తల్లిగా నాకు ఇంటి బాధ్యతలు ఎక్కువే ఉండేవి. ఎప్పుడూ తీరికలేకుండా ఉండేదాన్ని. దీంతో నా సామాజిక ఆకాంక్షలపై దృష్టి పెట్టలేకపోయేదాన్ని. పిల్లలు పెద్దయ్యి, వారి జీవితాల్లో స్థిరపడ్డాక నా అభిరుచిని కొనసాగించాలనే ఆలోచన పెరిగింది. క్రోచెట్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న మహిళలకు అప్పుడప్పుడు క్లాసులు తీసుకునేదాన్ని. 2021లో మా పిల్లలతో కూర్చొని చర్చిస్తున్నప్పుడు ఈ క్రోచెట్ బొమ్మల తయారీ పెద్ద ఎత్తున చేసి, అమ్మకాలు జరిపితే బాగుంటుందనే ఆలోచన వచ్చింది.

■ సోషల్ మీడియాలో..

క్రోచెట్ బొమ్మల అమ్మకాలను ఆన్‌లైన్ ద్వారా చేయాలనే ఆలోచనతో వెబ్‌సైట్, సోషల్ మీడియా సెటప్స్‌కి మా పిల్లలు సాయం చేశారు. నేను గిరిజన మహిళలకు క్రౌచెట్ వర్క్ నేర్పిస్తూ, వారితో ఈ బొమ్మలను తయారుచేయిస్తుంటాను. యాభై మంది గిరిజన మహిళలు తమ ఇళ్ల వద్దే ఉంటూ సౌకర్యంగా ఈ పనులు చేస్తుంటారు. నా దగ్గర కావల్సిన మెటీరియల్ తీసుకెళ్లి, బొమ్మలతో వస్తారు. ఒక్కొక్కరు రోజుకు 2–3 గంటల క్రోచెట్ అల్లిక చేస్తే నెలకు ఐదు వేల రూపాయలు వస్తాయి. మా జట్టులో ఉండే కొందరు నెలలో 30 బొమ్మలకు పైగా చేస్తారు. దీంతో ఇంకొంత ఆదాయం పెరుగుతుంది. ఆ విధంగా ఏడాది కాలంలో మూడు వేల బొమ్మలను అమ్మగలిగాను. పద్నాలుగు లక్షల రూపాయలు సంపాదించగలిగాను. చదువుకునే పిల్లలు, తీరిక ఉండే గృహిణుల్ని ఈ పనిని ఎంచుకుంటున్నారు.


తన టీమ్ సభ్యులతో కంచన్ భదానీ

■ మృదువైన బొమ్మలు

తాబేళ్లు, కుందేళ్లు, ఆక్టోపస్‌లు, ఏనుగులు, మనుషుల బొమ్మలు వీటిలో ప్రధానంగా ఉంటాయి. వెబ్‌సైట్, సోషల్‌మీడియా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలోనూ ఈ బొమ్మలు అందుబాటులో ఉన్నాయి. ఏ పదార్థాలనూ వృథా చేయకుండా ఉన్నితో వీటిని తయారుచేస్తాం. పసిపిల్లలు వీటితో ఆడుకోవడం చాలా ఇష్టపడతారు. ఆదివాసీ సమాజం కోసం ఏదైనా చేయాలన్న నా కల ఇలా తీరడం సంతోషంగా ఉంది. ఏదైనా పనిని ప్రారంభించడానికి అభిరుచి ఉండాలి కానీ, వయసుపైబడటం ముఖ్యం కాదని నమ్ముతున్నాను'' అని వివరిస్తుంది కంచన్.

వినూత్నం



డ్రామా క్వీన్

**'జీవితమే నాటకరంగం'
అంటాంగానీ...
కాల్పనిక ప్రపంచంతో
పోల్చితే నిజజీవితం నుంచి
రంగస్థలం మీదికి వచ్చిన
పాత్రలు తక్కువే.
బెంగళూరుకు చెందిన
అనూజ ఘోసల్కర్
తన థియేటర్ కంపెనీ 'డ్రామా క్వీన్'
ద్వారా నిజజీవిత కథలను
రంగస్థలం మీదికి తీసుకువస్తుంది.
డాక్యుమెంటరీ స్టైల్‌తో నాటకరంగానికి
కొత్త మెరుపు ఇచ్చింది...**

'డాక్యుమెంటరీ థియేటర్' అనగానే గుర్తుకు వచ్చే పేరు అనూజ ఘోసల్కర్. తాతముత్తాతలు నాటకరంగంలో ఉన్నారు. ఆ నోట ఈ నోటా విన్న విలువైన జ్ఞాపకాలు తనకు నాటకరంగంపై ఆసక్తి పెరగడానికి ఆ రంగంలోకి రావడానికి కారణం అయ్యాయి.


అనూజ ఘోసల్కర్

ఇండియా ఫౌండేషన్ ఫర్ ది ఆర్ట్స్ (ఐఎఫ్‌ఎ), ఫిల్మ్ రీసెర్చ్ విభాగంలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పని చేసిన అనూజ 34వ యేట నాటకాలకే పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకుంది. కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగాన్ని వదిలి నాటకాలనే కెరీర్‌గా చేసుకోవడం అంతతేలికైన విషయం కాదు.

అయితే నాటకరంగం మీద అపారమైన ప్రేమ ఉన్న అనూజ లాభనష్టాల లెక్కలు వేసుకోలేదు. 'డ్రామా క్వీన్' డాక్యుమెంటరీ డ్రామా కంపెనీ ద్వారా రంగస్థలానికి కొత్త మెరుపు తీసుకువచ్చింది.

డాక్యుమెంటరీ డ్రామా ఏమిటి?

డాక్యుమెంటరీ చిత్రాలలో వాస్తవ ఘటనలు, జీవితాలే ఉంటాయి. ఆ నిజజీవిత వాస్తవికత ప్రతిఫలించేలా 'డ్రామా క్వీన్'కు 'డాక్యుమెంటరీ'ని చేర్చింది అనూజ.

దాక్యుమెంటరీ స్టైల్‌లో భాగంగా...

నాటకప్రదర్శనలో ఫొటోగ్రాఫ్‌లు, ఆర్కైవ్ మెటీరియల్స్, పాత న్యూస్‌పేపర్లు, కేస్‌స్టడీలు, ఉత్తరాలు, జర్నల్స్... మొదలైన వాటిని నేపథ్యంలో సందర్భాన్ని బట్టి వాడుతుంటారు.

బెంగళూరు, ముంబైలో వర్క్‌షాప్‌లు జరుగుతున్నప్పుడు ఎంతో మంది వచ్చి ఆ నాటకానికి ఉపయోగపడే పుస్తకాలు, ఫోటోలు, చిత్రాలు... మొదలైనవి ఇచ్చేవారు.

'లేడీ ఆనంది' 'ది రీడింగ్ రూమ్' నాటకాలు 'డ్రామా క్వీన్' వినూత్నశైలిని ప్రేక్షకలోకానికి పరిచయం చేశాయి.

తన నాటకాల్లో నాటకరంగ ప్రేమికులను మాత్రమే కాకుండా విద్యావేత్తలు, ఉద్యమకారులు, జర్నలిస్ట్‌లు, పరిశోధకులు... మొదలైన వారిని భాగం చేస్తుంది అనూజ. వారి నుంచి సూచనలు తీసుకుంటుంది. నాటకం ప్రారంభం కావడానికి ముందు కూడా స్క్రిప్ట్‌ను మార్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

అనూజ ముత్తాత, తాతలు రంగస్థలంపై మహిళల పాత్రలు పోషించేవారు. ఇప్పుడు తాను నాటకాల్లో మగవాళ్ల పాత్రలు కూడా పోషిస్తుంది.

తన ముత్తాత, మరాఠీ నాటకరంగ కళాకారుడు మాధవరావు టిప్నీస్ మగపాత్రలతో పాటు ఆడపాత్రలు కూడా వేసేవాడు. అతడి నాటకరంగ జీవితం ఆధారంగా 'లేడీ ఆనంది' నాటకాన్ని రాసింది అనూజ. ఈ వన్- ఉమెన్ షోలో తానే నటించింది. నాటకంలోని సందర్భాలను బట్టి పిల్లల గొంతు, వృద్ధుల గొంతు, యువకుల గొంతుతో ఆమె చేసే స్వర విన్యాసాన్ని విని తీరాల్సిందే.

> తన నాటకాల్లో నాటకరంగ ప్రేమికులను మాత్రమే కాకుండా విద్యావేత్తలు, ఉద్యమకారులు, జర్నలిస్ట్‌లు, పరిశోధకులు... మొదలైన వారిని భాగం చేస్తుంది అనూజ. వారి నుంచి సూచనలు తీసుకుంటుంది. నాటకం ప్రారంభం కావడానికి ముందు కూడా స్క్రిప్ట్‌ను మార్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

మరోవైపు...

నటన, రచన, దర్శకత్వ విభాగాలలో బహుముఖ ప్రజ్ఞ చాటుతున్న అనూజ ఈ తరానికి నాటకరంగాన్ని దగ్గర చేయడానికి వారికి నటనలో మెళకువలు నేర్పుతుంది. స్కూల్ పిల్లల్లో కమ్యూనికేషన్, క్రియేటివ్ రైటింగ్, టీమ్‌వర్క్ స్కిల్స్‌ను పెంపొందించడానికి దేశవ్యాప్తంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 44

శనివారం 6-5-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సాక్షి స్పోర్ట్స్
శనివారం
6-5-2023



దోహా డైమండ్ లీగ్ మీట్: నీరజ్ చోప్రాకు అగ్రస్థానం... పారిస్ ఒలింపిక్స్‌కూ అర్హత

ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ మీట్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం రాత్రి దోహా వేదికగా జరిగిన తొలి సిరీస్‌లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మెరిశాడు. ఎనిమిది మంది మేటి జావెలిన్ త్రోయర్లు పోటీపడిన ఈ మీట్‌లో నీరజ్ చోప్రా బల్లెంను 88.67 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని సంపాదించాడు. ఈ ప్రదర్శనతో నీరజ్ వచ్చే ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడలకు కూడా అర్హత సాధించాడు. జావెలిన్ ఈవెంట్‌లో పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణం 85.50 మీటర్లు. నీరజ్ ఈ దూరాన్ని తొలి ప్రయత్నంలోనే నమోదు చేశాడు. ఆ తర్వాత నీరజ్ 86.04 మీటర్లు, 85.47 మీటర్లు, 84.47 మీటర్లు, 86.52 మీటర్లు నమోదు చేశాడు. ఐదో ప్రయత్నంలో నీరజ్ ఫౌల్ చేశాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ పీటర్స్ అండర్సన్ (గ్రెనెడా: 85.88 మీటర్లు) రెండో స్థానంలో... జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్; 88.63 మీటర్లు) మూడో స్థానంలో నిలిచారు. ఇదే మీట్‌లో పురుషుల ట్రిపుల్ జంప్‌లో పోటీపడిన భారత అథ్లెట్ ఎల్డోజ్ పాల్ 15.84 మీటర్ల దూరం దూకి పదో స్థానంలో నిలిచాడు. డైమండ్ లీగ్‌లో మొత్తం 14 సిరీస్‌లు జరుగుతాయి. అనంతరం సెప్టెంబర్‌లో గ్రాండ్ ఫైనల్‌ను నిర్వహిస్తారు.

తిరుగులేని టైటాన్స్

- రాజస్తాన్‌పై ఏకపక్ష విజయం
- 9 వికెట్లతో చిత్తుగా ఓడిన రాయల్స్
- రాణించిన రషీద్, హార్దిక్ పాండ్యా



రషీద్, పాండ్యా

ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో గురువారం వరకు జరిగిన 47 మ్యాచ్‌లలో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఏ జట్టూ కూడా 18 ఓవర్లలోపు ఆలౌట్ కాలేదు. కానీ శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ పేలవ ఆటతో మరో 13 బంతులు మిగిలి ఉండగానే కుప్పకూలింది. గుజరాత్ టైటాన్స్ కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు సొంతగడ్డపై నిలవలేకపోయిన రాయల్స్ భారీ ఓటమిని ఎదుర్కొంది. 119 పరుగుల సులువైన లక్ష్యాన్ని ఏకంగా 37 బంతులు మిగిలి ఉండగానే ఛేదించిన గుజరాత్... గత మ్యాచ్‌లో తమ వేదికపై రాజస్తాన్ చేతిలో ఎదురైన ఓటమికి ఈ గెలుపుతో లెక్క సరి చేసింది.

జైపూర్: డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్‌లో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్టపర్చుకుంది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ 9 వికెట్ల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 17.5 ఓవర్లలో 118 పరుగులకే ఆలౌటైంది. సంజూ సామ్సన్ (20 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రషీద్ ఖాన్ (3/14) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. అనంతరం గుజరాత్ 13.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 119 పరుగులు సాధించి గెలిచింది. వృద్ధిమాన్ సాహా (34 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుబ్‌మన్ గిల్ (35 బంతుల్లో 36; 6 ఫోర్లు) గెలిపించారు.

సమష్టి వైఫల్యం...

పాండ్యా తొలి ఓవర్లోనే బట్లర్ (8) వెనుదిరగ్గా... షమీ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో జోరు ప్రదర్శించిన గత మ్యాచ్ హీరో యశస్వి జైస్వాల్ (14) దురదృష్టవశాత్తూ రనౌట్ కావడంతో జట్టు పతనం మొదలైంది. సామ్సన్ బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ఆడిన షాట్‌ను అభినవ్ చక్కటి ఫీల్డింగ్‌తో ఆపగా, బంతిని అందుకున్న మోహిత్ నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌వైపు విసిరాడు. సింగిల్ కోసం ప్రయత్నించి జైస్వాల్ దూసుకురాగా, సామ్సన్ స్పందించలేదు. ఇద్దరూ ఒకేవైపు ఉండిపోగా, జైస్వాల్ వెనక్కి వెళ్లటంలో విఫలమయ్యాడు. టీమ్‌ను ఆదుకోవాల్సిన సామ్సన్ కూడా తర్వాతి ఓవర్లోనే అవుట్ కావడం రాయల్స్‌ను దెబ్బ తీసింది. ఆ తర్వాత ఏ ఒక్కరూ పట్టుదల ప్రదర్శించకపోవడంతో జట్టు కోలుకోలేకపోయింది.

అలవోకగా...

స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్ ఆడుతూ పాడుతూ అందుకుంది. ఓపెనర్లు సాహా, గిల్ చకచకా పరుగులు సాధించడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 9 ఫోర్లతో 49 పరుగులకు చేరింది. తొలి వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం తర్వాత ఎట్టకేలకు గిల్‌ను అవుట్ చేసి రాయల్స్ ఈ జోడీని విడదీసింది. జంపా ఓవర్లో పాండ్యా వరుస బంతుల్లో 6, 4, 6, 6 బాదడం ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచింది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (రనౌట్) 14; బట్లర్ (సి) మోహిత్ (బి) పాండ్యా 8; సామ్సన్ (సి) పాండ్యా (బి) లిటిల్ 30; పడిక్కల్ (బి) నూర్ 12; అశ్విన్ (బి) రషీద్ 2; పరాగ్ (ఎల్బీ) (బి) రషీద్ 4; హెట్‌మైర్ (ఎల్బీ) (బి) రషీద్ 7; జురేల్ (ఎల్బీ) (బి) నూర్ 9; బౌల్ట్ (బి) షమీ 15; జంపా (రనౌట్) 7; సందీప్ శర్మ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (17.5 ఓవర్లలో ఆలౌట్) 118. వికెట్ల పతనం** : 1-11, 2-47, 3-60, 4-63, 5-69, 6-77, 7-87, 8-96, 9-112, 10-118. **బౌలింగ్:** షమీ 4-0-27-1, పాండ్యా 2-0-22-1, రషీద్ 4-0-14-3, లిటిల్ 4-0-24-1, నూర్ 3-0-25-2, మోహిత్ 0.5-0-5-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (నాటౌట్) 41; గిల్ (స్టంప్డ్) సామ్సన్ (బి) చహల్ 36; పాండ్యా (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (13.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 119. వికెట్ల పతనం:** 1-71. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-28-0, సందీప్ శర్మ 3-0-19-0, జంపా 3-0-40-0, చహల్ 3.5-0-22-1, అశ్విన్ 1-0-8-0.



ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	10	7	3	0	14	0.752
లక్నో	10	5	4	1	11	0.639
చెన్నై	10	5	4	1	11	0.329
రాజస్తాన్	10	5	5	0	10	0.448
బెంగళూరు	9	5	4	0	10	-0.030
ముంబై	9	5	4	0	10	-0.373
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	10	4	6	0	8	-0.103
హైదరాబాద్	9	3	6	0	6	-0.540
ఢిల్లీ	9	3	6	0	6	-0.768

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × ముంబై (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
ఢిల్లీ × బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్, నవీన్



తాష్కెంట్: ప్రపంచ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57 కేజీలు) వరుసగా రెండో విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. భారత్‌కే చెందిన నవీన్ కుమార్ (92 కేజీలు) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోగా... ఆశిష్ చౌధరీ (80 కేజీలు) రెండో రౌండ్‌లో నిష్క్రమించాడు. శుక్రవారం జరిగిన రెండో రౌండ్ బౌట్‌లలో హుసాముద్దీన్ 5-0తో లియు పింగ్ (చైనా)పై, నవీన్ 5-0తో జియోంగ్ జెమిన్ (దక్షిణ కొరియా)పై ఏకపక్ష విజయాలు సాధించారు. ఆశిష్ 2-5తో రెండుసార్లు ఒలింపిక్ చాంపియన్ అర్లెన్ లోపెజ్ (క్యూబా) చేతిలో ఓడిపోయాడు.

అర్జున్ పరాజయం





గుకేశ్

మాల్మో (స్వీడన్): టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ తొలి ఓటమి చవిచూశాడు. శుక్రవారం జరిగిన రెండో రౌండ్‌లో వరంగల్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల అర్జున్ తెల్ల పావులతో ఆడుతూ 57 ఎత్తుల్లో స్వీడన్ గ్రాండ్‌మాస్టర్ నిల్స్ గ్రాండెలియస్ చేతిలో పరాజయం పాలయ్యాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ వరుసగా రెండో విజయంతో రెండు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. రెండో రౌండ్‌లో తమిళనాడుకు చెందిన గుకేశ్ 35 ఎత్తుల్లో విన్సెంట్ కీమెర్ (జర్మనీ)పై గెలుపొందాడు. భారత సంతతికి చెందిన అమెరికా గ్రాండ్‌మాస్టర్ అభిమన్యు మిశ్రా రెండో రౌండ్‌లో 43 ఎత్తుల్లో జోర్డెన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్)పై విజయం సాధించాడు.

మీరాబాయి చాను విఫలం



జింజూ (దక్షిణ కొరియా): ఆసియా సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను నిరాశపరిచింది. టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకం నెగ్గిన ఈ మణిపూర్ లిఫ్టర్ శుక్రవారం జరిగిన 49 కేజీల విభాగంలో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. మీరాబాయి మొత్తం 194 కేజీలు బరువెత్తింది. ఆమె స్నాచ్‌లో 85 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కేజీలు బరువెత్తింది. క్లీన్ అండ్ జెర్క్‌లో మీరాబాయి చివరి రెండు ప్రయత్నాల నుంచి వైదొలిగింది. మీరాబాయి వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన 207 కేజీలుకాగా, ఆసియా చాంపియన్‌షిప్‌లో ఆమె 13 కేజీలు తక్కువ ఎత్తింది. జియాంగ్ హుయిహువా (చైనా; 207 కేజీలు) స్వర్ణం... హు జిహుయ్ (చైనా; 204 కేజీలు) రజతం... సెరోద్ చనా (థాయ్‌లాండ్; 200 కేజీలు) కాంస్య పతకం సాధించారు.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు కూడా...

గాయంతో కేఎల్ రాహుల్ దూరం



న్యూఢిల్లీ: భారత క్రికెటర్, ఐపీఎల్ టీమ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ తొడ కండరాల గాయం కారణంగా రాబోయే కొన్ని నెలల పాటు క్రికెట్‌కు దూరం కానున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌తో పాటు వచ్చే నెలలో లండన్‌లో ఆస్ట్రేలియాతో జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ నుంచి కూడా రాహుల్ తప్పుకున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా అతనే నిర్ధారించాడు. సోమవారం లక్నోలో బెంగళూరు జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ రాహుల్ గాయపడ్డాడు. 'భారత జట్టుకు అందుబాటులో లేకపోవడం చాలా నిరాశగా ఉంది. దేశం తరఫున ఆడటమే నా మొదటి ప్రాధాన్యత. నా గాయానికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు చెప్పారు. వీలైనంత త్వరగా కోలుకునేందుకు ప్రయత్నిస్తా. బాధగా ఉన్నా ఆటకు దూరం కావడం తప్పడం లేదు' అని రాహుల్ పేర్కొన్నాడు. **ఐపీఎల్‌కు దూరమైన రాహుల్ స్థానంలో లక్నో సూపర్ జెయింట్స్ కర్నాటక బ్యాటర్ కరుణ్ నాయర్‌ను జట్టులోకి తీసుకుంది. గతంలో ఐదు వేర్వేరు జట్ల తరఫున ఐపీఎల్ ఆడిన నాయర్ 1496 పరుగులు చేశాడు.**

సౌరవ్ శుభారంభం



షికాగో: ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో భారత ప్లేయర్ సౌరవ్ ఘోషాల్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన తొలి రౌండ్‌లో సౌరవ్ 5-11, 11-6, 11-13, 11-6, 11-3తో యాయా ఎల్నావాస్నీ (ఈజిప్ట్)పై గెలిచాడు.

న్యాయ నిపుణులతో రెజ్లర్ల చర్చలు

కొనసాగుతున్న నిరసన



న్యూఢిల్లీ: పోలీసుల నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురవుతున్నప్పటికీ భారత స్టార్ రెజ్లర్లు తమ నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కావడం, సుప్రీంకోర్టులో కేసు విచారణ ముగియడం... ఢిల్లీ న్యాయపరిధిలో తేల్చుకోవాలన్న కోర్టు సూచనపై రెజ్లర్లు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నారు. 'శుక్రవారం రెండు కమిటీలు ఏర్పాటు చేశాం. ఖాప్ పంచాయత్, రైతులు, మహిళా సంఘాలకు చెందిన 31 మంది సభ్యులున్న ఒక కమిటీ, తొమ్మిది మంది సభ్యులుగా ఉన్న మరో కమిటీని ఏర్పాటు చేశాం. కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ నిజం వైపు నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ముగ్గురు రెజ్లర్లకే ఈ పోరాటం పరిమితం కాదు. హైకోర్టుకు వెళ్లి మళ్లీ మా పోరాటం మొదలుపెట్టే అవకాశాలున్నాయి' అని రెజ్లర్ బజరంగ్ పూనియా తెలిపాడు.

దర్యాప్తుతోనే వాస్తవాలు: క్రీడల మంత్రి ఠాకూర్

'రెజ్లర్ల డిమాండ్లన్నీ తీరుతాయి. ముందయితే ఢిల్లీ పోలీసుల దర్యాప్తు జరగనివ్వండి. దీనిపై సుప్రీం కోర్టు కూడా అదే చెప్పింది. విచారణలో పోలీసులు పాలకు పాలు, నీళ్లకు నీళ్లు తేటతెల్లం చేస్తే... న్యాయబద్ధంగా గట్టి చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది' అని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు.

గంగూలీ ఏమన్నాడంటే...

భారత జట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ 'రెజ్లర్లు దేశానికెంతో చేశారు. అంతర్జాతీయ వేదికలపై పతకాలతో కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. వారి పోరాటం వాళ్లని చేసుకోనివ్వండి. ఈ వ్యవహారంపై నాకు పూర్తి వివరాలు తెలియదు. పత్రికల్లో చదివిందే! ఏదేమైనా ఈ వివాదం త్వరలోనే పరిష్కారం కావాలని ఆశిస్తున్నా' అని అన్నాడు.

సినిమా


నిజం కచ్చితంగా గెలుస్తుంది



నాగచైతన్య, కృతీ శెట్టి

'**నిన్ను సీఎం సెక్యూరిటీకి అని పంపిస్తే.. నువ్వు ఆవిడ బండినే ఆపేస్తావా?' అనే డైలాగ్‌తో 'కస్టడీ' సినిమా ట్రైలర్ విడుదలైంది. నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన చిత్రం 'కస్టడీ'. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'నిన్ను కోర్టుకి తీసుకెళ్లి అప్పగిస్తాను.. లేకపోతే ట్రై చేస్తూ చస్తాను', 'ఒక్కసారి న్యాయం పక్క నిలబడి చూడు.. నీ లైఫే మారిపోతుంది', 'నిజం గెలవడానికి లేట్ అవుతుంది.. కానీ కచ్చితంగా గెలుస్తుంది' (నాగచైతన్య), 'నువ్వు ఏం చేస్తావో నాకు తెలీదు కానీ ఎలాగైనా నన్ను తీసుకెళ్లు.. లేకపోతే నా చావు నేను చస్తా' (కృతీ శెట్టి) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రంలో ప్రియమణి ముఖ్యమంత్రిగా, అరవింద్ స్వామి విలన్‌గా, శరత్ కుమార్ పోలీసాఫీసర్‌గా నటించారని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, యువన్ శంకర్ రాజా, కెమెరా: ఎస్ఆర్ కతీర్, సమర్పణ: పవన్ కుమార్.


ముప్పై కోట్ల ఫైట్



సల్మాన్‌ఖాన్

'ఏక్తా టైగర్', 'టైగర్ జిందా హై' చిత్రాల తర్వాత 'టైగర్' ఫ్రాంచైజీలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'టైగర్ 3'. 'ఏక్తా టైగర్', 'టైగర్ జిందా హై' చిత్రాల్లో హీరో, హీరోయిన్లుగా నటించిన సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్‌లు 'టైగర్ 3'లోనూ జంటగా నటిస్తున్నారు. యాక్షన్ స్పై థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు మనీష్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్ రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్యా చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం కోసం ఈ నెల 8 నుంచి ముంబైలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేసింది యూనిట్. ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో షారుక్ ఖాన్ గెస్ట్‌గా కనిపిస్తారు. ఈ ఒక్క ఫైట్ కోసమే నిర్మాత ఆదిత్యా చోప్రా దాదాపు రూ. 30 కోట్లు కేటాయించారని, జైలు బ్యాక్‌డ్రాప్‌లో ఈ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుందని బాలీవుడ్ టాక్. 'టైగర్ 3' సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

దేశం గర్వించే వీరుల కథ



శివ కార్తికేయన్, కమల్‌హాసన్

శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా కొత్త సినిమా షురూ అయింది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ఎస్‌కే 21' (శివకార్తికేయన్) అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని చెన్నైలో జరిగిన ఓ వేడుకలో ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ-''దేశభక్తి కథాంశంతో రూపొందుతున్న చిత్రం ఇది. 'మేజర్'లాంటి విజయవంతమైన చిత్రంతో తెలుగులోకి అడుగుపెట్టిన సోనీ పిక్చర్స్ మరోసారి దేశం గర్వించే వీరుల కథతో 'ఎస్‌కే 21'ని నిర్మిస్తోంది. ఈ సినిమా షూటింగ్ కాశ్మీర్‌లోని అద్భుతమైన లొకేషన్లలో శుక్రవారం ప్రారంభమైంది'' అన్నారు.

జూలైలో మహావీరుడు... శివ కార్తికేయన్ అదితీ శంకర్ జంటగా నటించిన తాజా చిత్రం 'మహావీరుడు'. తమిళంలో 'మహావీరన్' పేరుతో రూపొందింది. మడోన్ అశ్విన్ దర్శకత్వం వహించారు. శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని జూలై 14న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

బిచ్చగాడు బంధాలను గుర్తు చేసింది


– ఆర్. నారాయణమూర్తి



విజయ్ కుమార్, ఫాతిమా, విజయ్ ఆంటోని, కావ్య, నారాయణమూర్తి, శ్రీనివాసరావు

''**వి**జయ్ ఆంటోని నటించిన 'బిచ్చగాడు' చిత్రం అన్ని బంధాలను బాగా గుర్తుచేసింది. ఆ సినిమాకి సీక్వెల్‌గా ఇప్పుడు 'బిచ్చగాడు 2' కూడా అలాంటి సెంటిమెంట్‌తోనే వస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ సినిమాని ప్రేక్షకులు పెద్ద హిట్ చేయాలి'' అని ప్రముఖ నటుడు, దర్శక-నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. విజయ్ ఆంటోని హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'బిచ్చగాడు 2'. కావ్య థాపర్ హీరోయిన్. ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ- ''మొదటి భాగంలో మదర్ సెంటిమెంట్ చూశారు.. రెండో భాగంలో సిస్టర్ సెంటిమెంట్ చూడబోతున్నారు'' అన్నారు. 'బిచ్చగాడు 2'ని తెలుగులో విడుదల చేస్తున్న ఉషా పిక్చర్స్ విజయ్ కుమార్ మాట్లాడుతూ- ''ఏపీ, తెలంగాణలో తొలిసారి డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం'' అన్నారు. ''బిచ్చగాడు'ని తెలుగువారు ఎంతో ఆదరించారు. 'బిచ్చగాడు 2' అంతకంటే ఎక్కువగా మీకు నచ్చుతుంది'' అన్నారు ఫాతిమా. ''బిచ్చగాడు'ని తెలుగులో నేనే విడుదల చేశాను. ఆ సినిమా కంటే 'బిచ్చగాడు 2' ఇంకా పెద్ద హిట్ కావాలి'' అన్నారు నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు. నటుడు జాన్ విజయ్, తెలుగు అనువాద రచయిత భాష్య శ్రీ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, కెమెరా: విజయ్ మిల్టన్, ఓం ప్రకాష్.

అంజనాద్రి కోసం సాహసాలు



తేజ సజ్జా

అంజనాద్రి కోసం అహర్నిశలు కష్టపడ్డారు తేజ సజ్జా. అంజనాద్రి రక్షణకు ఈ యువ హీరో ఎలాంటి సాహసాలు చేశాడు అనేది 'హను-మాన్' సినిమాలో చూడాలి. తేజ సజ్జా, అమృతా అయ్యర్ హీరో హీరోయిన్లుగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 12న రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. 'అంజనాద్రి' అనే ఊహాత్మక ప్రదేశం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'హను-మాన్'. హనుమంతుని శక్తులను పొంది అంజనాద్రి కోసం కథానాయకుడు ఎలా పోరాడాడనేది చిత్రకథాంశం. ''హను-మాన్' టీజర్‌పై ప్రేక్షకులు చూపించిన ప్రేమ మా బాధ్యతను బాగా పెంచింది. గ్రాఫిక్స్ వర్క్స్ పెండింగ్ ఉండటం వల్ల ఈ సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నాం. త్వరలో కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషలలో పాన్ వరల్డ్‌గా హను-మాన్ చిత్రం రిలీజ్ కానుంది. వినయ్ రాయ్, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: గౌరహరి, అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్, కెమెరా: శివేంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అస్రిన్ రెడ్డి.

దేశభక్తి నేపథ్యంలో...



డి.సురేశ్ బాబు, ధీన్ రాజ్

నీరోజ్ పుచ్చా, సోనమ్ టిండప్, సుభారంజన్, సమైరా సందు, రాజేశ్వరి చక్రవర్తి, పెడెన్ నాంగ్యాల్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భారతీయన్స్'. భారత్ అమెరికన్ క్రియేషన్స్ పతాకంపై ప్రవాస భారతీయుడు డాక్టర్ శంకర్ నాయుడు అడుసుమిల్లి నిర్మించిన చిత్రం ఇది. 'ప్రేమించుకుందాం రా, కలిసుందాం రా' ఫేమ్ రచయిత ధీన్ రాజ్ ఈ దేశభక్తి చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను నిర్మాత డి. సురేష్‌బాబు రిలీజ్ చేసి, ఆల్ ది బెస్ట్ చెప్పారు. ''ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించే చిత్రమిది'' అన్నారు ధీన్ రాజ్. ఈ సినిమాకు సంగీతం: సత్య కశ్యప్, కపిల్‌కుమార్, కెమెరా: జయపాల్ రెడ్డి నిమ్మల.

కాన్స్ కాలింగ్



అనుష్కా శర్మ

బాలీవుడ్ నటి – నిర్మాత అనుష్కా శర్మకు కాన్స్ నుంచి కాల్ వచ్చిందని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది.76వ కాన్స్ చలన చిత్రోత్సవాలు ఈ నెల 16 నుంచి 27 వరకు జరగనున్నాయి. ఈ చిత్రోత్సవాల్లో పాల్గొనవలసిందిగా జ్యూరీ నుంచి అనుష్కా శర్మకు ఆహ్వానం అందిందట. ఈ వేడుకల్లో 'టైటానిక్' ఫేమ్ హాలీవుడ్ నటి కేట్ విన్స్‌లెట్‌తో కలిసి కొందరు మహిళా విజేతలకు అవార్డులు అందిస్తారట అనుష్కా శర్మ. ఇక గతంలో ఐశ్వర్యా రాయ్, దీపికా పదుకోన్, సోనమ్ కపూర్, ఆలియా భట్ వంటి తారలు కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది తమన్నా, పూజా హెగ్డే వంటి తారలు కాన్స్ చిత్రోత్సవాల్లో మెరిశారు. ఈసారీ పలువురు నాయికలు అక్కడ సందడి చేసే చాన్స్ ఉంది.

వినోదాల పరేషాన్



తిరువీర్, పావని

'**మ**సూద' ఫేమ్ తిరువీర్ హీరోగా నటించిన చిత్రం 'పరేషాన్'. రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వం వహించారు. హీరో రానా దగ్గుబాటి సమర్పణలో వాల్తేర్ ప్రొడక్షన్స్‌పై సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ సినిమాని జూన్ 2న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''తెలంగాణలోని ఒక పల్లెటూరి నేపథ్యంలో సాగే చిత్రం 'పరేషాన్'. పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన మా సినిమా టీజర్‌కు మంచి స్పందన వచ్చింది'' అని దర్శక-నిర్మాతలు అన్నారు. పావని కరణం, బన్నీ అభిరన్, సాయి ప్రసన్న, అర్జున్ కృష్ణ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: వాసు పెండమ్, సంగీతం: యశ్వంత్ నాగ్, లైన్ ప్రొడ్యూసర్: ప్రవీణ్ విస్సెంట్, అసోసియేట్ ప్రొడ్యూసర్స్: విశ్వదేవ్ రాచకొండ, హేమ రాళ్లపల్లి.

కయ్యాలే...కయ్యాలే



దివ్యాంశ కౌశిక్

సిద్ధార్థ్, దివ్యాంశ కౌశిక్ జంటగా నటించిన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టక్కర్'. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 26న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి 'కయ్యాలే... కయ్యాలే' అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్‌ను ఇటీవల చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. నివాస్ కె. ప్రసన్న సంగీత సారథ్యంలో కృష్ణకాంత్ లిరిక్స్ అందించిన ఈ పాటను నిరంజన్ రామనన్ ఆలపించారు. ఈ సినిమాకు సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మయాంక్.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 44

శనివారం 6-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



నేడు చార్లెస్-3 పట్టాభిషేకం

రాజు, రాణికి కిరీటధారణ చేయనున్న మత పెద్దలు - 6లో



మనీలాండరింగ్ పరిధిలోకి..

పీఎంఎల్‌ఏ చట్టం కిందికి సీఏలు, కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు - 13లో



గర్భస్థ శిశువు మెదడుకు శస్త్రచికిత్స

తల్లిగర్భంలో ఉన్న 34 వారాల పిండం మెదడుకు అమెరికా వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు.


- వివరాలు 6లో



ఐదుగురు జవాన్లు మృతి

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు జవాన్లు మృతిచెందారు.

- వివరాలు 6లో



తగ్గిన మద్యం ధరలు

రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గాయి. బీరు, రెడీ టు డ్రింక్ మినహా అన్ని రకాల మద్యం ధరలను ప్రభుత్వం తగ్గించింది.

- వివరాలు 11లో



ఉగ్రవాదానికి కాంగ్రెస్ వెన్నుదన్ను

ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ సాగిలపడుతోందని, 'ద కేరళ స్టోరీ'ని నిషేధించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాని మండిపడ్డారు.

- వివరాలు 6లో

విదేశీ నిల్వల కంటే వేగంగా... పాక్ విశ్వసనీయత పతనం

నేటికీ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతోంది

విదేశాంగ మంత్రి జై శంకర్ మండిపాటు

- పీఓకేను ఎప్పుడు ఖాళీ చేస్తారో చెప్పండి
- ఎస్‌సీవో భేటీలో బిలావల్ భుట్టో తీరుపై నిప్పులు
- ఆర్టికల్ 370 ముగిసిన చరిత్ర అని వ్యాఖ్యలు

6 లో

"పాకిస్తాన్ ఇప్పటికీ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతోంది. ఉగ్రవాద బాధితులు ఎప్పుడూ ఉగ్రవాదానికి పాల్పడిన వారితో కలసి ఉగ్రవాదంపై చర్చించడానికి కూర్చోరు. మేమేదో పాక్‌పై దౌత్యపరంగా పైచేయి సాధించేందుకు ప్రయత్నించడం లేదు. ఆ దేశం అసలు రంగును రాజకీయంగా, దౌత్యపరంగా ఎప్పటికప్పుడు ప్రపంచం ముందుంచుతున్నాం. - జై శంకర్



నిరుపేదకు న్యాయ 'పట్టం'



50,000 పేద కుటుంబాల ఇళ్ల స్థలాలకు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

స్థలాలివ్వకుండా ప్రభుత్వాన్ని నిరోధించేందుకు నిరాకరణ

ఏపీ ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని రైతుల పేరిట టీడీపీ దాఖలు చేసిన పిటిషన్ల తిరస్కృతి

5 లో

- ఈ మేరకు అనుబంధ పిటిషన్లు అన్నింటినీ కొట్టివేసిన ధర్మాసనం.. జీవో 45, స్థలాల కేటాయింపులు తుది తీర్పునకు లోబడి ఉంటాయి
- పేదల అభివృద్ధి రాజధాని అభివృద్ధిలో భాగమే
- రైతులు కోరినట్లు ఉత్తర్వులిస్తే న్యాయ ఔచిత్యాన్ని ఉల్లంఘించినట్లే.. ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతంపై పిటిషనర్లకు హక్కులు లేవని వ్యాఖ్య

నర్రెడ్డి సోదరులు చెప్పినట్టే చేశా



ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు

- లెటర్, ఫోన్ దాచిపెట్టమని రాజశేఖర్‌రెడ్డి చెప్పారు
- ఆ విషయాలన్నీ ఎవరికీ చెప్పొద్దన్నారు
- నుదుటిపై దెబ్బ, బెడ్ రూమ్.. బాత్ రూంలో రక్తం ఉందని చెప్పాను
- వాళ్లవన్నీ ఏమీ పట్టించుకోలేదు.. మేం చూసుకుంటామన్నారు

10 లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb Chicken

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate ₹ 57 per dozen	Ex Farm Live Bird	118 kg	Dressed with Skin	203 kg
	Retail Live Bird	140 kg	Skin Less	231 kg

Issued in the interest of consumers

మక్కకు 'రంగు' దెబ్బ!

తడిసి రంగు మారిన మొక్కజొన్న కొనబోమన్న మార్క్‌ఫెడ్

- ఇటీవలి వర్షాలకు తడిసిన మక్క 4 లక్షల టన్నులపైనే..
- వాటిని మార్కెట్లో అమ్ముకోలేని పరిస్థితి
- మొక్కజొన్న మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1,962
- వ్యాపారులు రూ.1,200 కూడా ఇవ్వడం లేదని రైతుల ఆవేదన
- వరిలాగే మొక్కజొన్న కొనాలని రాష్ట్ర సర్కారుకు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లకు రంగు దెబ్బ పడింది. తడిసిపోయి రంగు మారిన మొక్కజొన్నను కొనుగోలు చేయబోమంటూ మార్క్‌ఫెడ్ చేతులెత్తేసింది. దెబ్బతిన్న, రంగుమారిన మొక్కజొన్న కొంటే తమకు నష్టం వస్తుందని అధికారులు అంటున్నారు. దీంతో రైతులు ఆందోళనలో పడ్డారు. ఇటీవలి అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని.. అదే తరహాలో మొక్కజొన్నను కూడా కొనాలని కోరుతున్నారు. తడిసి రంగుమారిన మక్కలను మార్క్‌ఫెడ్ కొనకపోవడంతో.. వ్యాపారులు అతి తక్కువ ధర ఇస్తున్నారని, తాము నిండా మునుగుతున్నామని వాపోతున్నారు.

తడిసిన 4 లక్షల టన్నులు

రెండేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు మంచి డిమాండ్ ఉండటంతో ఈసారి యాసంగిలో సాగు పెరిగింది. రాష్ట్రంలో యాసంగిలో 6.84 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. మొత్తంగా 17.37 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ గత నెలన్నర రోజుల్లో పలుమార్లు కురిసిన వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా మొక్కజొన్నకు

మిగతా 2వ పేజీలో ▶



వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలో అకాల వర్షాలకు మొలకెత్తిన మొక్కజొన్న కంకులు

ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే కొంటాం..!

అకాల వర్షాలు, వడగళ్లతో దెబ్బతిన్న, రంగుమారిన మొక్కజొన్నను కొనడం సాధ్యం కాదని.. అలా కొనుగోలు చేస్తే తమకు నష్టం వస్తుందని మార్క్‌ఫెడ్ వర్గాలు చెప్తున్నాయి. పైగా ఆ మొక్కజొన్న దేనికీ పనికి రాదని, ఒకవేళ కొని నిల్వ చేసినా ఫంగస్ వస్తుందని అంటున్నాయి. అయినా ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకుంటే కట్టుబడి ఉంటామని చెప్తున్నాయి.

లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలి

ఎమ్మెల్యే సతీష్, ఎంపీగా వినోద్‌ను ప్రజలు దీవించాలి

12 లో

- ఇక్కడ సంజయ్ ఎంపీ అంటే ఇజ్జత్ తక్కువనిపిస్తోంది
- హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాదసభలో మంత్రి కేటీఆర్



హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా గిరిజన మహిళలతో సరదాగా నృత్యం చేస్తున్న మంత్రి కేటీఆర్



పరపతి పెంచుకునేందుకు కిరాయి మనుషులు!

సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజం

12 లో

- బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర వ్యక్తిని సీఎం ప్రైవేటు కార్యదర్శిగా నియమించారు..



ఎల్లుండి నుంచి మళ్లీ మంటలే!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ రెండ్రోజులు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వారం రోజులు సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కాగా... మారిన వాతావరణ పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు పెరిగి సాధారణ స్థాయికి చేరుకుంటాయని వివరించింది. ఈనెల 8వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 6న ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో 7వ తేదీన అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనావేసింది. ఇది ఈనెల 8న వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. శుక్రవారం రాష్ట్రంలో.. గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 35.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 21.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యింది.

తెలంగాణలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
భద్రాచలం	35.5	25.5
ఖమ్మం	35.2	26.4
నల్లగొండ	35.0	22.4
నిజామాబాద్	34.3	23.9
మెదక్	34.0	21.8
హనుమకొండ	34.0	24.5
ఆదిలాబాద్	33.8	22.0
హైదరాబాద్	33.3	24.1
దుండిగల్	33.2	23.9
హకీంపేట్	33.1	23.0
మహబూబ్‌నగర్	33.1	26.0
రామగుండం	33.0	26.8

క్లుప్తంగా...

దక్షిణ మధ్య రైల్వే రికార్డు

ఏడాదిలో 1,017 రూట్ కిలోమీటర్ల విద్యుదీకరణ

సాక్షి, హైదరాబాద్: రైల్వే లైన్ల విద్యుదీకరణలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు సృష్టించింది. ఏడాది కాలంలో వెయ్యి రూట్ కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధిలో తొలిసారి విద్యుదీకరించి రికార్డు సృష్టించింది. గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 1,017 రూట్ కిలోమీటర్ల మేర విద్యుదీకరణ పనులు పూర్తి చేసింది. ఇందులో తెలంగాణ రాష్ట్ర పరిధిలో 286 రూట్ కిలోమీటర్లు ఉండగా, ఏపీ పరిధిలో 133.7 రూట్ కిలోమీటర్లు, మహారాష్ట్ర పరిధిలో 546 రూట్ కిలోమీటర్లు, కర్ణాటక పరిధిలో 50.8 రూట్ కిలోమీటర్లు ఉన్నాయి. తెలంగాణలో కీలకమైన మనోహరాబాద్–నిజామాబాద్, మహబూబ్‌నగర్–ఆలంపూర్ రోడ్డు, భవనపాలెం–సత్తుపల్లి, కోసాయి–అంబారీ, జానకంపేట–బాసర రూట్లు ఉన్నాయి.

'వేగంగా అమరవీరుల స్మారక పనులు'



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెలలో తెలంగాణ అమరవీరుల స్మారక భవనాన్ని ప్రారంభించాల్సి ఉన్నందున, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పూర్తికి రూపొందించుకున్న వర్క్‌చార్ట్ ప్రకారం వేగం పెంచాలని సూచించారు. శుక్రవారం ఆయన భవన ప్రాంగణాన్ని పరిశీలించారు.

'చిత్రపురి' సొసైటీ నిర్ణయాలపై స్టే

సాక్షి, హైదరాబాద్: చిత్రపురి కాలనీ తెలుగు సినీ వర్కర్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ జనరల్ బాడీ తీర్మానాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. గతంలో ఇదే కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా మార్చి 24న జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి టెండర్లు ఆహ్వానించి.. ఖరారు చేస్తున్నారని దర్శకుడు మద్దినేని రమేష్‌బాబు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా టెండర్లను ఆహ్వానించి, ఖరారు చేయడాన్ని తప్పుబట్టారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 22కు వాయిదా వేశారు.

మళ్లీ ఆస్తుల వేలం.. లక్ష్యం రూ.5 వేల కోట్లు!

ప్రభుత్వ భూములు, స్వగృహ ఫ్లాట్ల అమ్మకాలకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు

- కోకాపేట, బుద్వేల్‌తోపాటు ఉప్పల్ భగాయత్‌లలో విక్రయం
- పోచారంలోని స్వగృహ టవర్లకు ఆన్‌లైన్ వేలం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సర్కారీ ఆస్తుల అమ్మకాలకు హెచ్‌ఎండీఏ మరోసారి సన్నాహాలు చేపట్టింది. సుమారు రూ.5 వేల కోట్లు సమకూర్చుకోవడమే లక్ష్యంగా వివిధ ప్రాంతాల్లోని స్థలాలు, ఫ్లాట్లను విక్రయించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఎయిర్‌పోర్టు మార్గంలో ఉన్న బుద్వేల్‌లో భారీ లేఅవుట్ పనులు వేగంగా కొనసాగుతుండగా.. కోకాపేటలో రెండో దశ, ఉప్పల్ భగాయత్‌లో మూడో దశ ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు కార్యాచరణ చేపట్టింది. మరోవైపు పోచారంలో ఏడంతస్తుల చొప్పున ఉన్న రెండు రాజీవ్ స్వగృహ టవర్లను విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రెండు టవర్లలో కలిపి 142 ఫ్లాట్లు ఉన్నాయి.

అందరిచూపు బుద్వేల్ వైపే..

ఐటీ సంస్థలు మొదలుకొని మధ్యతరగతి వరకు ఇప్పుడు అందరిచూపు బుద్వేల్ వైపు పడింది. విమానాశ్రయం మార్గంలో ఉండటంతో సంపన్న, ఎగువ మధ్యతరగతి వర్గాలు కూడా బుద్వేల్ హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇక్కడ సుమారు 182 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేసేందుకు అధికారులు రూ.200 కోట్లతో పనులు ప్రారంభించారు. ఒక్కో ప్లాట్ విస్తీర్ణం 6.13 ఎకరాల నుంచి 14.58 ఎకరాల వరకు ఉంటుందని అంచనా. తొలివిడత ఇక్కడ 50 ఎకరాల్లో విక్రయాలు చేపట్టనున్నారు. బహుళ ప్రయోజనాల జోన్‌గా ఈ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అంటే కార్యాలయ సముదాయాలు, నివాసాలు, రిటైల్, ఎంటర్‌టైన్‌మెంట్, హెల్త్‌కేర్ వంటివి అభివృద్ధి చెందడానికి ఆస్కారముంది. వేలం ద్వారా ప్లాట్లను కొనుగోలు చేసేవారికి మూడు వారాల్లో నిర్మాణ అనుమతులన్నీ మంజూరు చేయనున్నారు. ఈ భూముల విక్రయాల ద్వారా కనీసం రూ.1,300 కోట్లకు పైగా ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నారు.

కోకాపేటలో 64 ఎకరాలకు..

కోకాపేట నియో పోలీస్ లేఅవుట్‌లో రెండో దశ ప్లాట్ల విక్రయానికి అధికారులు సన్నాహాలు చేపట్టారు. 2021 జూలైలో నిర్వహించిన మొదటి దశ వేలంలో సుమారు 49 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 8 ప్లాట్లను విక్రయించారు. ఎకరానికి రూ.25 కోట్ల చొప్పున కనీస ధర నిర్ణయించినా.. అనూహ్యమైన పోటీతో ఎకరానికి కనిష్టంగా రూ.40.05 కోట్ల నుంచి గరిష్టంగా రూ.60 కోట్ల వరకు ధర పలికింది. ఇప్పుడు కోకాపేట నియో పోలీస్ ప్రాంతంలోనే 64 ఎకరాలను విక్రయించనున్నారు. రూ.2,500 కోట్లకుపైగా రావొచ్చని అంచనా వేస్తున్నారు.

ఉప్పల్ భగాయత్‌లో మూడో దశ..

ఉప్పల్ భగాయత్‌లో ఇప్పటికే రెండుసార్లు హెచ్‌ఎండీఏ ప్లాట్లను విక్రయించారు. మెట్రోస్టేషన్‌కు అందుబాటులో ఉన్న ఈ స్థలాలకు బాగా డిమాండ్ ఉంది. ఇక్కడ మొత్తం 450 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేశారు. మొదటి, రెండో దశలో ప్లాట్లను కొనుగోలు చేసినవారు పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు చేపట్టారు. 2021 డిసెంబర్‌లో జరిగిన వేలంలో చదరపు గజానికి కనిష్టంగా రూ.75 వేల నుంచి గరిష్టంగా రూ.లక్ష వరకు పలికింది. ప్రస్తుతం మూడో దశలో 40 ఎకరాలను విక్రయిస్తామని, రూ.650 కోట్లకు పైగా రావచ్చని అధికారులు చెప్తున్నారు.

మక్కకు 'రంగు' దెబ్బ!

మొక్కజొన్న కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ నిబంధనలివీ..

తేమ	14 శాతం మించకూడదు
దెబ్బతిన్న గింజలు	1.5 శాతం మించకూడదు
రంగుపోయినవి, దెబ్బతిన్నవి	3 శాతం మించకూడదు
పురుగు పట్టిన గింజలు	1 శాతం మించకూడదు
ఇతర పంట గింజలు	2 శాతం మించకూడదు
ఇతర పదార్థాలు	1 శాతం మించకూడదు

▶ మొదటి పేజీ తరువాయి

పెద్ద ఎత్తున నష్టం జరిగింది. అనేకచోట్ల గింజలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న తడిసి రంగు మారింది. గింజలు ముడుచుకుపోయాయి. మొత్తంగా 4 లక్షల టన్నుల మేర మొక్కజొన్న రంగు కోల్పోవడమో, గింజ పురుగు పట్టడమో, ముడుచుకుపోవడమో జరిగిందని వ్యవసాయశాఖ వర్గాలు చెప్తున్నాయి.

మెల్లగా ధర తగ్గించేసి..

మొదట్లో నాణ్యమైన పంటకు బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే ఎక్కువే ధర పలికింది. క్వింటాల్‌కు మద్దతు ధర రూ.1,962 కాగా.. వ్యాపారులు రూ.2,500 వరకు ధర పెట్టారు. కానీ తర్వాత క్రమంగా రూ.1,650కు ధర తగ్గించారు. వర్షాలకు తడిసి, రంగుమారిన మొక్కజొన్నకు కనీసం రూ.1,200 వరకు కూడా ధరపెట్టడం లేదని రైతులు వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా..

ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్ ద్వారా 400 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, 8.50 లక్షల టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం తీసుకొని వారం రోజులు దాటినా ఇప్పటివరకు 77 కేంద్రాలే ప్రారంభించారు. అయితే రంగుమారిన, దెబ్బతిన్న మొక్కజొన్నను ఏమాత్రం కొనుగోలు చేసేది అధికారులు చెప్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

వరిలా మక్కనూ కొనాలి..

అకాల వర్షాలతో దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. దీంతో రంగు మారిన వడ్లకు కొనుగోలు సమస్య తలెత్తడం లేదు. కానీ మొక్కజొన్న విషయంలో మార్క్‌ఫెడ్ కొర్రీలు పెడుతోందని.. తమ కష్టం దళారుల పాలవుతోందని రైతులు అంటున్నారు. వ్యాపారులు అడ్డగోలు తక్కువ ధర ఇస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకోవాలని కోరుతున్నారు. వరి తరహాలో మొక్కజొన్నను కూడా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మక్కలను కాపాడుకోలేక గోస పడుతున్నం



ఐదెకరాలు కౌలు తీసుకుని మక్క పంట సాగు చేశాను. ప్రభుత్వ కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకే కొంటున్నారు. అకాల వర్షాలకు మక్కలను కాపాడుకోలేక గోస పడుతున్నాం.

– చిద్రపు లక్ష్మన్న, కౌలు రైతు, ఖాజపూర్, బోధన్ మండలం, నిజామాబాద్ జిల్లా

రంగు మారితే కొనలేం

వర్షాలకు దెబ్బతిన్న, రంగు మారిన మొక్కజొన్నను కొనుగోలు చేయడం సాధ్యంకాదు. నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తాం. ఆ పరిధిని దాటి కొనుగోలు చేయడం కుదరదు. ఒకవేళ ప్రభుత్వం దీనిపై ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకుంటే ఆ మేరకు నడుచుకుంటాం. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇంకా అవసరమైన చోట్ల ఏర్పాటు చేసే ప్రక్రియ నడుస్తుంది.

– యాదిరెడ్డి, ఎండీ, మార్క్‌ఫెడ్

వానలు పడుతున్నాయని కొనడం లేదు

ఒకటిన్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. దాదాపు 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొన్నటివరకు మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు చేపట్టలేదు. వానలు మొదలవడంతో కొనుగోలు చేయడం లేదని చెప్తున్నారు.

– నారెండ్ల రవీందర్‌రెడ్డి, దూలూరు, కథలాపూర్ మండలం, జగిత్యాల జిల్లా

తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నారు. మా ఊరు నుంచి కేంద్రానికి తీసుకువచ్చినా వర్షాల కారణంగా తేమశాతం ఎక్కువగా వస్తున్న పరిస్థితి. తడిసిన ధాన్యమంటూ, నిబంధనల ప్రకారం లేదంటూ అధికారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది.

– సత్యనారాయణరెడ్డి, సారంగాపూర్ మండలం, జగిత్యాల జిల్లా

'పాలమూరు - రంగారెడ్డి' పనుల పరిశీలనకు సీఎం!



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని పరిశీలించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలో మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారం. కొత్త సచివాలయం ప్రారంభోత్సవం తరువాత ముఖ్యమంత్రి తొలిసమీక్షను ఈ ప్రాజెక్టుపైనే నిర్వహించారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటనకు ముందే సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ ప్రాజెక్టును సందర్శించి ఓ నివేదిక ఇవ్వనున్నట్లు నీటి పారుదల శాఖ వర్గాల వెల్లడించాయి. శనివారం స్మితా సబర్వాల్‌తో పాటు మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి.. నార్లాపూర్, వట్టెం, ఏదుల రిజర్వాయర్లు, పంపులను పరిశీలించనున్నారు. జూలైలో కరివెన రిజర్వాయర్, ఆగస్టులో ఉద్దండపూర్ రిజర్వాయర్లలో నీటిని ఎత్తిపోయాలని సమీక్షా సమావేశం సందర్భంగా సీఎం ఆదేశించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే సమయానికి కీలకమైన పనులు పూర్తి చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

అక్కడి వరకే సర్వే..

పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు వల్ల ప్రభావితం అయ్యే ఆరు గ్రామాల్లో కాకుండా కేవలం బూర్గంపహాడ్‌లోనే క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తామని ఏపీ స్పష్టం చేసినట్లు తెలిసింది. పోలవరం పూర్తిస్థాయి నీటి మట్టం సరిహద్దు రాయి అక్కడే ఉన్నందున అక్కడి వరకే సర్వే చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీకి ఏపీ తాజాగా లేఖ రాసింది.

15 నుంచి 'చీఫ్ మినిస్టర్స్ కప్ 2023' టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి నెలాఖరు వరకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో 'చీఫ్ మినిస్టర్స్ కప్ 2023' టోర్నీని నిర్వహించనున్నారు. ఈ మేరకు పీఆర్,ఆర్‌డీ, క్రీడా ప్రాధికారసంస్థ వీసీ,ఎండీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో పురుషులకు, మహిళలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడలు నిర్వహించి విజేతలకు జూన్ 2న బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ పోటీల నిర్వహణకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీల్లో మండల స్థాయిలో, ఈ నెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'నెట్'లో ఇండియా జెట్ స్పీడ్!

దేశంలో 75.9 కోట్ల మంది యాక్టివ్ ఇంటర్నెట్ యూజర్స్

- కనీస స్థాయిలో ఉపయోగిస్తున్నవారు 52 శాతం
- 39.9 కోట్లతో గ్రామీణ ప్రాంత యూజర్లదే పైచేయి..
- పట్టణ ప్రాంతాల్లో వాడుతున్నవారు 36 కోట్ల మంది
- వేగంగా పెరుగుతున్న మహిళా వినియోగదారులు

ఇంటర్నెట్, మొబైల్ అసోసియేషన్–కాంటార్ 'ఇంటర్నెట్ ఇన్ ఇండియా రిపోర్ట్–2022'లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఎవరి చేతిలో చూసినా స్మార్ట్‌ఫోన్.. ప్రతిచోటా కంప్యూటర్.. వీటికితోడు స్మార్ట్ టీవీలు, ఇతర డివైజ్‌లు.. మొత్తంగా అంతా ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయిపోయారు. నిత్యం ఇంటర్నెట్‌లో గడిపేస్తున్నారు. ఒకరిద్దరు కాదు.. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడాలేదు.. దేశవ్యాప్తంగా 75.9 కోట్ల మంది ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నారు. ఇందులో పట్టణ ప్రాంతాల వారు 36 కోట్లు అయితే.. గ్రామీణ ప్రాంతాల యూజర్లు అంతకన్నా ఎక్కువగా 39.9 కోట్ల మంది ఉండటం గమనార్హం. ఇక యూజర్లలో 52 శాతం మంది కనీస స్థాయిలోనైనా ఇంటర్నెట్‌ను వాడుతున్నారు. అంటే మనదేశంలో తొలిసారిగా మెజారిటీ ప్రజలు యాక్టివ్ ఇంటర్నెట్ యూజర్లుగా నిలవడం విశేషం. తాజాగా ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ)–కాంటార్ (మార్కెటింగ్ డేటా, అనలిటిక్స్ కంపెనీ) సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన 'ఇంటర్నెట్ ఇన్ ఇండియా రిపోర్ట్–2022'లో ఇలాంటి ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని 86 వేల కుటుంబాలపై 'ఐక్యూబ్–2022' పేరిట నిర్వహించిన అధ్యయనం ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

నివేదిక ప్రకారం.. దేశంలో యాక్టివ్ ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య ఏటా 10 శాతం పెరుగుతోంది. 2022లో 75.9 కోట్లుగా ఉన్న వినియోగదారుల సంఖ్య 2025 నాటికల్లా 90కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. ప్రధానంగా వినియోగదారులు మొబైల్‌ఫోన్ల ద్వారా ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తుండగా.. ట్యాబ్లెట్లు, స్మార్ట్ టీవీలు, ఇతర స్ట్రీమింగ్ పరికరాలు, స్మార్ట్ పరికరాల ద్వారా వినియోగం కూడా ఇటీవలికాలంలో బాగా పెరిగింది. నూతన సాంకేతికతలు, సేవలను యాక్సెస్ చేసే విషయంలో భారతీయులు ముందుంటున్నారు. ఈ–కామర్స్ సేవలను పొందడంతోపాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌కు వేగంగా మారుతున్నారు.

ఏటేటా పెరిగిపోతూ..

నివేదికలోని ముఖ్య అంశాలివీ..

- 2022లో భారత్‌లో యాక్టివ్ ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య మొత్తంగా 75.9 కోట్లు. గతేడాది పట్టణ ప్రాంతాల్లో 6% యాక్టివ్ యూజర్లు పెరిగారు.
- ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో 14 శాతానికి వినియోగదారులు పెరిగారు. 2022లో కొత్తగా చేరిన యూజర్లలో 57% మహిళలే.
- 2025 కల్లా కొత్త ఇంటర్నెట్ వినియోగదారుల్లో 56 శాతం గ్రామీణ ప్రాంతాల నుంచే ఉండే అవకాశం. ఇందులో మహిళలే 65 శాతం ఉండే చాన్స్.
- ఇంటర్నెట్ వినియోగం విషయానికొస్తే.. డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా ఉంది.
- ఇండియన్లు వేగంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వైపు మారుతున్నారు. ఈ–కామర్స్‌ను అందిపుచ్చుకుంటున్నారు. 2022లో ట్యాబ్లెట్లు, స్ట్రీమింగ్ పరికరాలను వాడేవారు 13% పెరిగారు.

తె.యూ అక్రమాలపై కఠినచర్యలు

ముగ్గురు రిజిస్ట్రార్లపై కేసులు, సమగ్ర విచారణకు తె.యూ ఈసీ తీర్మానం



హైదరాబాద్ రూసా భవనంలో తె.యూ పాలకమండలి సమావేశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వర్సిటీలో అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయ పాలకమండలి తీర్మానం చేసింది. తెయూ 57వ పాలకమండలి సమావేశం హైదరాబాద్‌లోని రూసా భవనంలో శుక్రవారం జరిగింది. వైస్ చాన్స్‌లర్ రవీందర్ గుప్తా గైర్హాజరుతో.. సభ్యుల సూచన మేరకు ఉన్నతవిద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ సమావేశానికి చైర్మన్‌గా వ్యవహరించారు. 1991 తెలంగాణ యూనివర్సిటీల చట్టంలోని సెక్షన్ 15(1) ప్రకారం రిజిస్ట్రార్ నియామకంపై ఉన్న పూర్తి అధికారంతో పాలకమండలి (ఈసీ) ప్రొఫెసర్ యాదగిరిని పునర్నియమించింది. ఈసీ 2021 అక్టోబర్ 30న యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమిస్తే, వర్సిటీల చట్టంలోని 50.6(ఏ) నిబంధనలకు విరుద్ధంగా వీసీ.. వరుసగా ముగ్గురిని రిజిస్ట్రార్లుగా నియమించడం చట్టవ్యతిరేకమని ఈసీ అభిప్రాయపడింది. ఈసీ నియమించిన రిజిస్ట్రార్ పదవీకాలం పూర్తయితే లేదా ఆ స్థానం ఖాళీగా ఉంటే మాత్రమే కొత్త రిజిస్ట్రార్‌ను నియమించాల్సి ఉంటుందని, ఈసీ ఆమోదం లేకుండా శివశంకర్, విద్యావర్ధిని, నిర్మలాదేవి బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో వాళ్లపై కేసులు పెట్టాలని నిర్ణయించింది. అక్రమ నియామకాలు, నిబంధనల ఉల్లంఘన, అడ్డగోలు చెల్లింపుల చెక్కులపై సంతకాలు పెట్టడం, నిధుల దుర్వినియోగం తదితరాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, ఏసీబీ డీజీ, నిజామాబాద్ సీపీలతో ఉన్నతస్థాయి విచారణ చేయించాలని తీర్మానించింది. ఇందులో భాగంగా 2022–23, 2023–24 బడ్జెట్‌ను సైతం విచారించాలని నిర్ణయించింది. సెక్షన్ 18(1) ప్రకారం 10 మంది సభ్యుల కోరంతో సమావేశం జరిగిందని, ఈ నెల 12న మరోసారి సమావేశం అవుతుందని ఈసీ తెలిపింది. కాగా, వర్సిటీలో అక్రమాలపై వరుస కథనాలను ప్రచురించిన 'సాక్షి'కి పాలకమండలి సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

మితిమీరిన జోక్యంతో ఇబ్బందులు: వీసీ

నవీన్‌మిట్టల్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ... వైస్ చాన్స్‌లర్ రవీందర్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిట్టల్ తనకు సన్నిహితుడైన యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించేందుకు, తన స్వార్థ ప్రయోజనాల కోసం వర్సిటీ రోజువారీ పాలనా వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ వర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రూ.20 కోట్ల రూసా నిధులను నిలిపేస్తున్నారని తెలిపారు. ఐఏఎస్ అధికారై ఉండి, రాజ్యాంగ వ్యతిరేక మార్గాలను అవలంభిస్తున్న మిట్టల్‌ను అడ్డుకుంటేనే రాష్ట్రంలోని వర్సిటీల్లో పాలన సక్రమంగా సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఇదం జగత్



ఎన్‌కౌంటర్ జరిగినప్పుడల్లా..
అలా పెట్టుకొనే తిరుగుతుంటారు!

10న కృష్ణా బోర్డు సమావేశం

- జలాలను 50:50 శాతం పంచాలంటున్న తెలంగాణ
- 'పాలమూరు–రంగారెడ్డి'పై ఏపీ అభ్యంతరాలు
- ఎజెండా ఖరారు చేసిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీజలాల్లో వాటాల పంపకాలపై ఈ నెల 10న జరిగే కృష్ణా నదీ యాజమాన్యబోర్డు సమావేశం ఎజెండా ఖరారైంది. తెలంగాణ గతేడాది నుంచి పట్టుబడుతున్న కృష్ణాజలాల్లో చెరి ఏభై శాతం చొప్పున నీటిపంపిణీ చేయాలన్న అంశాన్ని ఎజెండాలో చేర్చారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలు కూడా చర్చకు రానున్నాయి. 2022–23 వాటర్ ఇయర్‌లో నీటి పంపకాలు చేయకుండానే పూర్తికానిచ్చిన నదీ యాజమాన్య బోర్డు ఈసారి రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు సమావేశ ఎజెండాను పంపించింది. ఇప్పటివరకు ఉన్న 66:34 నీటి పంపకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. గతేడాది మే 6వ తేదీన జరిగిన సమావేశంలో తెలంగాణ అధికారులు మొదట చెరిసగం నీటి కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసినా.. చివరలో బోర్డు చైర్మన్ విచక్షణకే వదిలేశారు. దీంతో తెలంగాణ అధికారులపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ సమావేశంలో గట్టిగా పట్టుపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తాగునీటికి కేవలం 20 శాతం మాత్రమే కేటాయించాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీతోపాటు పలు ప్రాంతాల్లో సెన్సార్ ఆధారిత రియల్ టైమ్ డేటా అక్విజేషన్ సిస్టమ్ కూడా ఈసారి బోర్డు ఎజెండాలో చేర్చారు. ఆర్డీఎస్ ఆధునీకరణ, కుడికాలువ పనుల నిలిపివేత కోసం తెలంగాణ చేసిన విజ్ఞప్తిని సమావేశంలో చర్చకు పెట్టారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలనే అంశం కూడా ఈసారి సమావేశంలో ప్రధాన అంశం కానుంది.

జల విద్యుత్...

శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో అవసరం లేకున్నా తెలంగాణ జలవిద్యుత్ ఉత్పాదన చేస్తుందన్న ఏపీ అభ్యంతరాలు, రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఆర్‌ఎంసీ) సిఫారసుల అమలుపై కూడా చర్చించనున్నారు. జలవిద్యుత్ ఉత్పాదన, రూల్‌కర్వ్ మిగులు జలాల నిర్ధారణ వంటి అంశాలపై కూడా చర్చించనున్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటి కేటాయింపులు చేస్తూ తెలంగాణ సమర్పించిన డీపీఆర్‌తోపాటు హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం తెలంగాణ రూ.1,450 కోట్లతో నిర్మిస్తున్న సుంకిశాల ఇంటెక్ వెల్ ప్రాజెక్టు నిర్మాణంపై ఏపీ అభ్యంతరాలు కూడా చర్చకు రానున్నాయి.

సిటీలో సైక్లింగ్ రెవల్యూషన్

- నగరం వేదికగా అతిపెద్ద సైక్లింగ్ కార్యక్రమం
- యాక్టివ్ మొబిలిటీ కోసం సైక్లింగ్ రెవల్యూషన్ 3.0

సాక్షి, హైదరాబాద్: నగరంలో కొంతకాలంగా సైక్లిస్టుల సంఖ్య పెరిగింది. ఆఫీసులకు వాహనాలకు బదులు సైకిల్‌నే వినియోగిస్తున్నారు. ఈ అవగాహన పెంచడంలో సిటీలోని సైక్లింగ్ క్లబ్‌లు, కమ్యూనిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వం కూడా సైక్లిస్టుల సౌకర్యార్థం నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ట్రాక్‌లను ఏర్పాటు చేసింది. వాహనాలకు బదులు సైకిళ్లను వాడాలని, కాలుష్య నివారణకు ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని 'హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్' సభ్యులు నినదిస్తున్నారు. యాక్టివ్ మొబిలిటీ కోసం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా ఆదివారం 'హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్ 3.0' పేరుతో సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో 5 వేల మంది సైక్లిస్టులు పాల్గొననున్నారు.

సైక్లింగ్ కమ్యూనిటీ పెరుగుతోంది..



నగరంలో 93 లక్షల జనాభాలో దాదాపు 50 లక్షల మందిని యాక్టివ్ మొబిలిటీ వైపు మళ్లించేలా, దూరాన్ని బట్టి నడక, సైకిల్, బస్సు, మెట్రోలను వినియోగించేలా అవగాహన కల్పించేందుకు ఈ సైక్లింగ్ రివల్యూషన్ 3.0 ఈవెంట్ ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో ఈ తరహా కార్యక్రమం నిర్వహించడం మూడోసారి. నగరం వేదికగా పదివేల మందితో సైక్లింగ్ కమ్యూనిటీ ఉంది. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

– శాంతనా సెల్వన్, హైదరాబాద్ సైకిల్ మేయర్

క్లుప్తంగా...

10న బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 295 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని సొసైటీ కార్యదర్శి మల్లయ్యబట్టు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సొసైటీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ మూడు తరగతుల్లో రాష్ట్రవ్యాప్తంగా 5,175 ఖాళీలున్నాయని తెలిపారు.

టీఎస్ఎన్పీడీసీఎల్ ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు

హనుమకొండ: టీఎస్ఎన్పీడీసీఎల్‌లో ఎలాంటి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఏఈ, జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు కొంత మంది వైరల్ చేస్తున్నారని, ఆ నోటిఫికేషన్‌తో ఎన్పీడీసీఎల్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తే ఎన్పీడీసీఎల్ అధికార వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు.

జూలై 3 నుంచి అంబేడ్కర్ వర్సిటీ పీజీ పరీక్షలు


బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పీజీ పరీక్షలు జూలై 3 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ, మాస్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ అన్ని డిప్లొమాలు, సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు విశ్వవిద్యాలయ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ జూన్ 2 అని తెలిపారు. వివరాలకు అభ్యర్థులు విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నంబర్ 7382929570ను సంప్రదించవచ్చన్నారు.

ఆర్టీసీకి తక్కువ ధరకే డీజిల్ అందేలా చూడాలి

సాక్షి, హైదరాబాద్: క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర గత ఏడాది కాలంలో భారీగా తగ్గినందున ఆర్టీసీకి తక్కువ ధరకే డీజిల్ అందేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. గతేడాది మేలో బ్యారెల్ చమురు ధర 113 డాలర్లుగా ఉండగా, మే నాటికి 78 డాలర్లకు తగ్గిందని, కానీ చమురు కంపెనీలు ఆర్టీసీకి సరఫరా చేసే బల్క్ డీజిల్ ధర తగ్గించటం లేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని కనీసం 30 శాతం రాయితీతో ఆర్టీసీకి డీజిల్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈజీగా కాలేజీ ఏర్పాటు చేయాలా?

ఇదిగో సింగిల్ విండో



కొత్త ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుపై నిషేధం ఎత్తేసిన ఏఐసీటీఈ
- ప్రత్యేకంగా నేషనల్ సింగిల్ విండో సిస్టమ్
- కఠిన నిబంధనలకు స్వస్తి... తేలికగా అనుమతులు
- మల్టీపుల్ కోర్సులకూ అవకాశం

సాక్షి, హైదరాబాద్: కొత్త ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటు ఇక సులభతరం కాబోతోంది. అఖిల భారత సాంకేతిక విద్య మండలి(ఏఐసీటీఈ) నిబంధనలను సరళతరం చేసింది. 2023–24 విద్యాసంవత్సరం నుంచి ఇవి అమలులోకి వస్తాయని పేర్కొంది. గత మూడేళ్లుగా కాలేజీల ఏర్పాటుపై ఉన్న నిషేధాన్ని ఏఐసీటీఈ ఎత్తేసింది. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం సాంకేతికవిద్య కోర్సులుండే కాలేజీల ఏర్పాటుకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఏఐసీటీఈకి దరఖాస్తు చేయడం తప్పనిసరి. ఈ నిబంధనలు కొత్త కాలేజీల ఏర్పాటుకు ఇబ్బందిగా ఉన్నాయని ఏఐసీటీఈ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. దీంతో అన్నిరాష్ట్రాల అభిప్రాయం తీసుకున్న మండలి కఠిననిబంధనలను తొలగించింది. కొత్త కాలేజీల ఏర్పాటు చేయాలనుకునేవాళ్ల కోసం నేషనల్ సింగిల్ విండో సిస్టమ్ అనే పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల అనుమతి కోసం సరికొత్త విధివిధానాలు విడుదల చేసింది. బీటెక్, పాలిటెక్నిక్ కోర్సులను ఒకే కాలేజీ, ఒకే క్యాంపస్‌లో నిర్వహించే అవకాశం కల్పించారు. తేలికగా కాలేజీల నిర్వహణ, పాలనాపరమైన సౌలభ్యం ఉండేలా ప్రైవేటు వర్సిటీలు, కాలేజీలను ప్రోత్సహించేలా నిబంధనలు రూపొందించింది.

తాజా నిబంధనలు ఇవీ...

- బీటెక్ కాలేజీల్లో ప్రతీ ఆరుగురికి కంప్యూటర్ విధిగా ఉండాలనే నిబంధన ఎత్తేసి, దాని స్థానంలో ప్రతీ పది మందికి కంప్యూటర్ ఉంటే చాలని ఏఐసీటీఈ పేర్కొంది. పాలిటెక్నిక్ కాలేజీలకూ ఇదే నిబంధన వర్తిస్తుంది.
- ఇప్పటివరకూ గరిష్టంగా 300 సీట్లు ఉండాలనే నిబంధన ఉంది. దీన్ని మరో 60 సీట్లకు పెంచారు. ఎంసీఏలో 180 నుంచి 300కు పెంచారు. దీనివల్ల కొత్తగా వచ్చే సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పెరుగుతాయి.
- ఇప్పటివరకు ఫార్మసీ, ఆర్కిటెక్చర్ వంటి కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చేది. ఇక మీదట ఫార్మసీ కౌన్సిల్, ఆర్కిటెక్చర్ కౌన్సిల్ మాత్రమే అనుమతి స్తాయి.
- ఏదైనా కాలేజీ విదేశీ వర్సిటీతో ఒప్పందాలు చేసుకునేప్పుడు ఉన్న నిబంధనలను స్వల్పంగా సడలించారు. ప్రపంచంలో 500 ర్యాంకులు ఉన్న వర్సిటీల తోనే ఒప్పందం చేసుకోవాలనే నిబంధన స్థానంలో వెయ్యి ర్యాంకుల వరకూ పొడిగించారు. దీనివల్ల విదేశీ వర్సిటీల భాగస్వామ్యం మరింత పెరగనుంది.
- ప్రస్తుతమున్న కాలేజీల్లో కొత్త కోర్సులు కావాలంటే 50% సీట్లు ఉండాలనే నిబంధనలను ఏఐసీటీఈ ఎత్తేసింది. దీనివల్ల ప్రతీ కాలేజీ కొత్త కోర్సులు ప్రవేశపెట్టే వీలుంది. విదేశీసంస్థలతో ఒప్పందాలు మరింత పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

ఉన్నవే మూత... మళ్లీ కొత్తవా?

2015–16లో 288 కాలేజీలుంటే ప్రస్తుతం 145 కాలేజీలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలను రాజధాని పరిసర ప్రాంతాల్లోకి మార్చుకునేందుకు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఏటా కనీసం 45 శాతం కూడా సీట్లు భర్తీ కావడంలేదు. కంప్యూటర్ కోర్సుల వైపు విద్యార్థులు పరుగులు పెడుతుండటంతో వాటికి తగ్గట్టు వసతులు, ఫ్యాకల్టీని సమకూర్చుకోవడం కాలేజీలకు కత్తిమీద సాములా మారింది. ఈ పరిస్థితుల్లో కొత్త కాలేజీల స్థాపనకు ఎంతమంది ముందుకొస్తారన్నది సందేహమే అని నిపుణులు అంటున్నారు.

వచ్చే వారం ఇంటర్ ఫలితాలు!

- తుది దశకు చేరుకున్న కసరత్తు
- సాంకేతిక లోపాలు లేకుండా ఫలితాల విడుదల
- మంత్రి అనుమతితో ఫలితాల వెల్లడి తేదీ ఖరారు

సాక్షి, హైదరాబాద్: ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్ష ఫలితాల వెల్లడికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 13వ తేదీలోగా రిజల్ట్స్ ప్రకటించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన కసరత్తు గత రెండు రోజులుగా వేగం పుంజుకుంది. మూల్యాంకనం తర్వాత మార్కుల క్రోడీకరణ, డీ కోడింగ్ ప్రక్రియ ను త్వరగా ముగించారు. ఇప్పటికే పలు దఫా లుగా ట్రయల్ రన్ చేశారు. ఈ సందర్భంగా వచ్చిన సాంకేతిక సమస్యలను పరిష్కరించా రు. ఈ ప్రక్రియలో గత రెండు రోజులుగా ఎలాంటి సమస్యలు తలెత్తలేదని, దీన్నిబట్టి ఫలితాల వెల్లడికి ఎలాంటి ఇబ్బంది లేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఫలితాల విడుదల తేదీ ఖరారు కాకున్నా, ఈ నెల 13లోగా కచ్చితంగా వెల్లడిస్తామని ఇంటర్‌బోర్డ్ ముఖ్య అధి కారి తెలిపారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలనే.. పలు దఫాలుగా ఫలితాల విశ్లేషణ, క్రోడీకరణ, కోడింగ్ విధానాన్ని పరిశీలిస్తున్నామని ఆయన చెప్పారు.

మంత్రి అనుమతి తర్వాత తేదీ ఖరారు..

ఫలితాల వెల్లడికి సంబంధించిన కసరత్తును సోమవారం నాటికి పూర్తి చేయాలని ఉన్నతాధికారులు బోర్డు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఇంటర్ అధికారులు కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే రోజు పరీక్షల ఫలితాల వెల్లడి సమాచారాన్ని తెలియజేస్తారు. మంత్రి అనుమతి తర్వాత ఫలితాల వెల్లడి తేదీని ఖరారు చేస్తారని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 4,82,501 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 4,23,901 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ రెండో వారంలో పూర్తయింది. రెండో సంవత్సరం పరీక్ష రాసిన విద్యార్థులు ఎంసెట్‌తో పాటు, అనేక పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్ ఫలితాలు త్వరగా విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు.

మరో రెండు పరీక్షలు

రీషెడ్యూల్

పాలిటెక్నిక్ లెక్చరర్స్, ఇంటర్ పీడీల పరీక్షలు వాయిదావేసిన టీఎస్‌పీఎస్సీ



సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్, ఇంటర్మీడియట్ విద్యా విభాగంలో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అర్హత పరీక్షలను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వాయిదా వేసింది. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెలలోనే ఈ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా... వీటిని ఏకంగా నాలుగు నెలల పాటు వాయిదా వేసింది. సెప్టెంబర్‌లో ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు తేదీలతో కూడిన సబ్జెక్టుల వారీ పూర్తిస్థాయి షెడ్యూల్‌ను శుక్రవారం రాత్రి విడుదల చేసింది. ఈనెల 13న నిర్వహించాల్సిన పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ ఉద్యోగాల పరీక్షలు సీబీఆర్‌టీ(కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పద్ధతిలో సెప్టెంబర్ 4వ తేదీనుంచి 8వరకు ఉదయం, మధ్యాహ్నం జరగనున్నాయి. ఈనెల 17వ తేదీ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరగాల్సిన ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగ అర్హత పరీక్ష సెప్టెంబర్ 11వ తేదీ ఉదయం, మధ్యాహ్నం సీబీఆర్‌టీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది.

వైద్య అధ్యాపకుల బదిలీల్లో వివక్ష


బదిలీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తూ సీఎం కేసీఆర్‌కు లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలకు వైద్య, ఆరోగ్య శాఖ ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీలకు విధించిన షరతులపై అధ్యాపకులు మండిపడుతున్నారు. బదిలీల కౌన్సెలింగ్ సందర్భంగా ఉస్మానియా, గాంధీ, కాకతీయ (వరంగల్), నిజామాబాద్ వైద్య కళాశాలల్లోని ఖాళీలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రదర్శించకూడదన్న వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) కార్యాలయ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొందరు అధ్యాపకులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు, ఆ శాఖ కార్యదర్శి రిజ్వీకి శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 17 వైద్య కళాశాలల్లోని ఖాళీలను మాత్రమే బదిలీల ద్వారా భర్తీ చేస్తారు. ఒకవేళ బదిలీ కోసం పెట్టుకున్న దరఖాస్తులు 17 కాలేజీల్లోని ఖాళీల కన్నా ఎక్కువగా ఉంటే...నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ రిమ్స్ ఖాళీల్లో భర్తీ చేస్తారు. అంతేగానీ ఉస్మానియా, గాంధీ, కాకతీయ, నిజామాబాద్ మెడికల్ కాలేజీల్లో భర్తీ చేయబోమని చెప్పడాన్ని నిరసిస్తున్నారు. ఆయా 4 కాలేజీల్లోని వారిని ఎక్కడికీ బదిలీ చేయరా అని నిలదీశారు. ఇతర కాలేజీల్లో ఏళ్ల తరబడి పనిచేసినా ఇక్కడకు వచ్చే పరిస్థితి లేదని, ఇది తమ పట్ల చూపుతున్న వివక్షని విమర్శించారు. కాబట్టి తమకు న్యాయం జరిగేలా బదిలీ మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని కోరారు.







జ్ఞానులు కూడా ఏది క్రియ, ఏది నిష్క్రియ అనే దాని గురించి గందరగోళంలో ఉంటారు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 6 మే 2023

బ్రిటన్‌లో రాజుగారి ఏలుబడి!

మరికొన్ని గంటల్లో బ్రిటన్ రాజుగా ఛార్లెస్ ఫిలిప్ ఆర్థర్ జార్జి మౌంట్‌బాటన్ (చార్లెస్–3) పట్టాభిషిక్తుడు కాబోతున్నారు. ఒకప్పుడు 'రవి అస్తమించని సామ్రాజ్యం'గా ప్రపంచపటంలో ధగ ధగలాడిన బ్రిటన్ నేడు తానున్న యూరప్ ఖండంలో కూడా ఒంటరి పయనం సాగించడాన్ని ఎంచుకున్న చిన్న దేశంగా మిగిలిపోయింది. ఆ దేశంలో 18వ శతాబ్దంలోనే రాచరికం నామమాత్రంగా మిగిలి సర్వాధికారాలూ పార్లమెంటుకు బదిలీ అయ్యాయి. మరో మూడు శతాబ్దాలు గడిచినా అది తన గత వైభవానికీ, అగమ్యగోచరమైన భవిష్యత్తుకూ మధ్య ఊగిసలాడుతూనే ఫ్యూడల్ అవశేషమైన సంప్రదాయాలనూ, లాంఛనాలనూ వదులుకోవటానికి ఏమాత్రం సిద్ధపడటంలేదని శనివారంనాటి పట్టాభిషేకం రుజువుచేయబోతోంది. ఆరు గుర్రాలు పూన్చిన రథంలో ముందే నిర్దేశించిన సెంట్రల్ లండన్ వీధులగుండా వెస్ట్ మినిస్టర్ అబీగా పిలిచే సెయింట్ పీటర్ చర్చిలో ఉదయం 11 గంటలకల్లా చార్లెస్ ప్రవేశించి ఏడువందల ఏళ్లనాటి సింహాసనాన్ని అధిష్ఠిస్తారు. 'గాడ్ సేవ్ ద కింగ్ చార్లెస్' అనే ఆశీర్వచనంలాంటి నినాదం మార్మోగుతుండగా మణులు, మాణిక్యాలు, కెంపులు, గోమేధికాలు, గరుడపచ్చలు పొదిగిన దాదాపు నాలుగు వందల ఏళ్లనాటి బంగారు కిరీటం ఆయన శిరస్సును అలంకరిస్తుంది. ఈ పట్టాభిషేక తంతులో కాలం గడిచేకొద్దీ ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు మొత్తంగా చర్చి ఆఫ్ ఇంగ్లండ్ ఆధిపత్యమే ఉండే ఆ కార్యక్రమంలో ఇప్పుడు భిన్న మతవిశ్వాసాల ఆచార్యులుంటున్నారు. కేవలం సంపన్నులకూ, దేశాధినేతలకూ మాత్రమే ప్రవేశముండే ఆ కార్యక్రమంలో సాధారణ పౌరులకు కూడా చోటుదక్కుతోంది. దాంతోపాటే ఒకనాడు పట్టాభిషేక సందర్భంలో ఇంటింటా పండుగ వాతావరణం కనబడిన చోటే 'ఎందుకిదంతా?' అనే ప్రశ్నలు మొలకెత్తడం కూడా మొదలైంది. రాచ రికాన్ని వదుల్చుకుంటే తప్ప బ్రిటన్ సంపూర్ణ ఆధునికతను సంతరించుకోదన్న వాదనలు కూడా వినబడుతున్నాయి. ఫ్యూడల్ చిహ్నమైన రాచరికం స్థానంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే రాజ్యాధినేత ఉండటం వర్తమాన అవసరమని అటువంటివారు వాదిస్తున్నారు. 'రాచరికంలోకి ఒక్కసారి తొంగి చూశామా.. దాన్ని కీర్తించటం అసాధ్యం' అని బ్రిటన్ రాజ్యాంగనిపుణుడు వాల్టర్ బాజెట్ ఒకప్పుడు అననే అన్నారు. అయితే ప్రపంచంలో బ్రిటన్ రాచరికం ఏకాకి కాదు. మరో 28 దేశాల్లో కూడా ఆ వ్యవస్థలే వర్థిల్లుతున్నాయి. అందులో పూర్తి స్థాయి నియంత్రణాధికారాలుండే రాజులు మొదలుకొని సగం సగం అధికారాలతో సరిపెట్టుకొనేవారూ, పూర్తి అలంకారప్రాయంగా మిగిలిపోయినవారూ కూడా ఉన్నారు. అలాగే తిరుగులేని సంపదలతో తులతూగేవారూ, ప్రభుత్వాలు దయతో ఇచ్చే జీతభత్యాలతో సరిపుచ్చుకునే రాజులు కూడా ఉన్నారు. లాంఛనప్రాయపు హోదాయే కావొచ్చుగానీ చార్లెస్ ఒక్క బ్రిటన్‌కు మాత్రమే కాదు... మరో 14 దేశాలకు సైతం రాజ్యాధిపతిగా కొనసాగుతారు.

ప్రపంచంలోని ఇతర దేశాల మాట అటుంచి సంపన్న దేశాల క్లబ్ అయిన జీ–7లో కూడా బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ నాసిరకమైనదే. అక్కడ ప్రస్తుతం 'జీవన వ్యయ సంక్షోభం' రాజ్యమేలుతోంది. తడిసిమోపడయ్యే వడ్డీ రేట్లతో, భరింపశక్యంకాని ద్రవ్యోల్బణంతో, ఆకాశాన్నంటే ఇంధన ధరలతో అక్కడి జనం ఈసురోమంటున్నారు. గత ఇరవైయ్యేడేళ్లలో ఎన్నడూ లేనంత స్థాయిలో వడ్డీరేట్లు పెరిగిపోయాయి. ఈ ఏడాది ఆఖరువరకూ అది కోలుకునే అవకాశం లేదని ఆర్థిక నిపుణులంటున్నారు. ప్రస్తుతం నిరుద్యోగిత 3.9 శాతం. దాదాపు 13 లక్షలమంది పౌరులు ఉపాధి కోల్పోయారని జాతీయ గణాంకాల విభాగం గత నెలలో తెలిపింది. సగటున ప్రతి అయిదుగురు బ్రిటన్ పౌరుల్లోనూ ఒకరు పేదరికంలో కూరుకుపోయారని గణాంకాలు కోడై కూస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. చాలీచాలని ఆదాయాలతో అర్థాకలితో నెట్టుకొచ్చే కుటుంబాలూ.. దాతృత్వ సంస్థల సాయంతో, చర్చిల ఆధ్వర్యంలో నడిచే ఫుడ్ బ్యాంకులపై ఆధారపడుతున్న కుటుంబాలూ ఎక్కువేనని ఒక అంచనా. అందుకే కాబోలు ఈసారి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంలో అట్టహాసాలు తగ్గించాలని నిర్ణయించారు. కార్యక్రమం నిడివి బాగా తగ్గిపోగా, అతిథుల జాబితా కూడా చిన్నబోయింది. అయితే ఈ కార్యక్రమానికయ్యే మొత్తం వ్యయం ఎంతో చెప్పటం వెంటనే సాధ్యం కాకపోయినా అది ఎలా చూసినా 12.5 కోట్ల డాలర్లకు తగ్గకపోవచ్చని మీడియా లెక్కలేస్తోంది. వర్తమాన చేదు వాస్తవాలనూ, సంక్లిష్టతలనూ పరిగణనలోకి తీసుకోకుండా భూతకాలం చూరుపట్టుకుని వేళ్లాడటం ఇంకా ఎన్నాళ్లని పలువురు ప్రశ్నించటానికి ఇలాంటి కథనాలు కారణం కావొచ్చు. నెపోలియన్‌తో సాగిన వరస యుద్ధాల పరంపరలో గెల్చామన్న సంబరంతో బ్రిటన్ 1821లో నాలుగో జార్జి పట్టాభిషేకాన్ని కనీవినీ ఎరుగనంత ఘనంగా జరుపుకుంది. దానిపై విమర్శకులు విరుచుకుపడటంతో మరో పదేళ్లకు 1831లో అతని వారసుడు నాలుగో విలియం మాత్రం అతి నిరాడంబరంగా, క్లుప్తంగా పట్టాభిషేకం తంతు ముగించారు.

మొత్తానికి ఏడుపదుల కాలం తర్వాత బ్రిటన్‌లో పట్టాభిషేక మహోత్సవం జరగబోతోంది. రాచరికంపై దేశ పౌరుల్లో ఉండే వ్యతిరేకత కనుమరుగు కావటం, కనీసం అభ్యంతరాలు వ్యక్తం కాకపోవటం అనేవి చార్లెస్ వ్యవహారశైలిపై ఆధారపడివుంటాయి. ఆయన శనివారం ధరించబోయే కిరీటం బరువు 5 పౌండ్లు (సుమారు 2.27 కిలోలు). కానీ 'మూడో చార్లెస్'గా ఆయనపై ఉండబోయే బాధ్యతల బరువు అంతకన్నా అనేక రెట్లు ఎక్కువ. దాన్ని ఆయన సమర్థవంతంగా నిర్వహించగలిగితే చరిత్రలో ఆయన స్థానం పదిలంగా ఉంటుంది.

6జీ సంకల్పం నెరవేరగలదా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

రేపటితరం టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీగా చెబుతున్న 6జీపై భారత్ ఓ దార్శనిక పత్రం విడుదల చేసింది. ఇటీవలే దేశంలో ప్రవేశపెట్టిన 5జీ టెక్నాలజీతో పోల్చినా ఎన్నో రెట్లు మెరుగైందీ 6జీ. ఇది వాస్తవ రూపం దాలిస్తే సమాచారం ఏకంగా సెకనుకు ఒక టెరాబిట్ వేగంతో ప్రయాణిస్తుంది. 5జీతో పోల్చితే వందరెట్లు ఎక్కువ వేగం! దార్శనిక పత్రం లక్ష్యం చౌకైన, సర్వవ్యాప్తమైన, సుస్థిర టెక్నాలజీల అభివృద్ధి. కానీ ఈరోజుకూ దేశంలో సుమారు 35,000 గ్రామాల్లో కనీసం 2జీ ఇంటర్నెట్ కనెక్షన్ కూడా లేకపోవడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో ఈ దార్శనిక పత్రం పెద్ద ఆశయాలతో కూడి ఉన్నదని చెప్పక తప్పడం లేదు. 6జీ డాక్యుమెంట్ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా చూసుకోవాలి.

6జీ టెక్నాలజీతో అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు సమోదయ్యే అవకాశం ఉంది. అందుకే భారత్ ఈ విషయమై కేవలం దార్శనిక పత్రాన్ని జారీ చేయడంతోనే సరిపెట్టకూడదు. పరిశోధనలకు తగినన్ని నిధులు కేటాయించడంతోపాటు 6జీ టెక్నాలజీ విషయంలో అంతర్జాతీయ ప్రొటోకాల్, ప్రమాణాల నిర్ధారణ విషయంలోనూ చురుకుగా పాలు పంచుకోవాలి. ఈ పనులు చేయకపోతే 6జీ కేవలం భారత్‌కున్న ఆశల్లో ఒకటిగా మిగులుతుంది.



అనూహ్యమైన ప్రభావం...

6జీ టెక్నాలజీ పూర్తిస్థాయిలో సాకారమైతే కలిగే ప్రయోజనాలు అనూహ్యం. విద్య, ఆరోగ్యం, రవాణాలతోపాటు మానవ జీవితంలోని ప్రతి పార్శ్వాన్నీ ఇది స్పృశిస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. రక్షణ రంగ నిపుణుల అంచనాల ప్రకారం, 6జీ టెక్నాలజీని అంతరిక్ష, అణుశక్తి రంగాల మాదిరిగానే ఓ వ్యూహాత్మక రంగంగా పరిగణించి పెట్టుబడులు పెట్టాలి! ఇదే విషయాన్ని మూడేళ్ల క్రితం లెఫ్టినెంట్ జనరల్ ఎస్.ఎస్.మెహతా 'ద ట్రిబ్యూన్'లో రాసిన ఒక వ్యాసంలో విస్పష్టంగా పేర్కొన్నారు.

6జీ టెక్నాలజీతో టాక్టయిల్ ఇంటర్నెట్, హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్ వంటివి సాధ్యమవుతాయి. ఆగ్మెంటెడ్, వర్చువల్, మిక్స్‌డ్ రియాలిటీలకూ ఈ టెక్నాలజీ సాయం అందిస్తుంది. అదే సమయంలో ఆర్థిక వ్యవస్థలను సమూలంగా మార్చగలిగేంత శక్తి కూడా ఈ టెక్నాలజీలకు ఉంది. ఇవన్నీ సాధ్యం కావాలంటే కొత్త కొత్త నెట్‌వర్క్ టెక్నాలజీలు, పరికరాలు, ప్రమాణాలు అవసరమవుతాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న 5జీ టెక్నాలజీ పూర్తి సామర్థ్యాన్నే మనం అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఉండగా, తరువాతి తరం టెక్నాలజీ అభివృద్ధికి రంగం సిద్ధమవుతోందన్నమాట!

భారత్ ఇటీవలే విడుదల చేసిన 6జీ దార్శనిక పత్రంలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద టెలికామ్ మార్కెట్ అని పేర్కొన్నారు. పూర్తిస్థాయి టెక్నాలజీ సృష్టికర్తగా, తయారీదారుగా ఎదగాలని కూడా సంకల్పం చెప్పుకొంది. కాబట్టి 6జీ టెక్నాలజీ తీరుతెన్నులను నిర్ణయించే ప్రక్రియలో భారత్ కూడా భాగస్వామి కావాలి. అంతరిక్ష రంగంలో ప్రపంచం మొత్తమ్మీద అగ్రస్థానంలోకి చేరేందుకు ఏం చేయాలో ఆలోచించమని ప్రభుత్వం గతేడాదే ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. మార్చి 22న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన డాక్యుమెంట్– పారిశ్రామిక వర్గాలు, విద్యాసంస్థలు, సర్వీస్ ప్రొవైడర్లు ఏఏ అంశాలపై పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలో గుర్తించమని చెబుతోంది. ఇది రెండు దశల్లో జరిగేందుకు అవకాశముంది. తొలిదశ (2023 –25)లో ప్రాథమికమైన పరిశోధన, మేధోహక్కుల అభివృద్ధి జరిగితే, రెండో దశ (2025–30) వాణిజ్యీకరణ.

దార్శనిక పత్రం లక్ష్యం చౌకైన, సర్వవ్యాప్తమైన, సుస్థిర టెక్నాలజీల అభివృద్ధి. ఇది చాలా కష్టసాధ్యమైన పని. ఎందుకంటే ప్రస్తుతం ఉపయోగిస్తున్న 5జీ టెక్నాలజీలకు ఈ లక్షణాలేవీ లేవు. అంటే... 6జీ ద్వారా టెక్నాలజీ పరంగా భారీ పురోగమనం జరగాలన్న లక్ష్యాన్ని భారత్ నిర్దేశించుకుంది. అంతేకాదు, అవన్నీ చౌకగా చేయాలి. అన్నిచోట్ల అందుబాటులో ఉండేలా చూడాలి. (కానీ ఈరోజుకూ దేశంలో సుమారు 35,000 గ్రామాల్లో కనీసం 2జీ ఇంటర్నెట్ కనెక్షన్ కూడా లేకపోవడం గమనార్హం). సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సరేసరి. వీటికి తోడు కేవలం భారత్‌కు మాత్రమే కాకుండా... 6జీ టెక్నాలజీలన్నీ ప్రపంచం మొత్తానికి అందే ఏర్పాట్లూ చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ దార్శనిక పత్రం పెద్ద ఆశయాలతో కూడి ఉన్నదని చెప్పక తప్పడం లేదు.

6జీ టెక్నాలజీపై పట్టు సాధించడం ద్వారా పెత్తనం చలాయించవచ్చునన్న అంచనాలతో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా బోలెడన్ని కార్యక్రమాలు చకచకా నడుస్తున్నాయి. పరిశ్రమ వర్గాలతో కూడిన 'నెక్స్ట్–జీ అలయన్స్ ఆఫ్ నార్త్ అమెరికా' సుమారు 50 టెక్నాలజీల అభివృద్ధి అవసరాన్ని గుర్తించింది. రేడియో టెక్నాలజీలు, నెట్‌వర్క్ ఆర్కిటెక్చర్, సెక్యూరిటీ, ప్రైవసీ వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. మరోవైపు దక్షిణ కొరియా 2021లోనే యూనివర్సిటీల్లో 6జీ టెక్నాలజీపై పరిశోధనలు చేసేందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అలాగే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పరస్పర సహకారంతో పరిశోధనలు చేసేలా ప్రోత్సహిస్తోంది. యూరోపియన్ దేశాలు కూడా తెలివైన నెట్‌వర్క్‌ల ఏర్పాటు, మేనేజ్‌మెంట్‌లను దృష్టిలో ఉంచుకుని ప్రయత్నాలు చేస్తున్నాయి. చైనా, జపాన్ లలోనూ 6జీ టెక్నాలజీకి సంబంధించి వేర్వేరు అంశాలపై పరిశోధనలకు ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి.

మన దృక్కోణంలో...

భారతదేశపు 6జీ విజన్ డాక్యుమెంట్ ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు జరుగుతున్న రంగాలు, భారతీయ దృక్కోణంలో పరిశోధనలు చేపట్టాల్సిన అంశాలపై దృష్టి పెట్టింది. ఈ డాక్యుమెంట్‌లో పేర్కొన్న అంశాలు, వ్యూహాలు, కార్యక్రమాల రూపం సంతరించుకోవాలంటే 'ఆర్ అండ్ డీ'కి దీర్ఘకాలం పెట్టుబడులు అవసరమవుతాయి. నెక్స్ట్–జీ అలయన్స్‌లో ప్రఖ్యాత టెలికామ్ కంపెనీలు ఏటీ అండ్ టీ, బెల్, ఇంటెల్, శాంసంగ్, ఆపిల్, డెల్, సిస్కో, ఎరిక్‌సన్, గూగుల్, హెవ్లెట్ ప్యాకర్డ్, ఎల్‌జీ, మైక్రోసాఫ్ట్, నోకియా తదితర కంపెనీలు వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నాయి. కొరియా, జపాన్, యూరప్‌లలో 6జీ సంబంధిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది, చురుకుగా పాల్గొంటున్నది ఈ భారీ కంపెనీలే. అక్కడి ప్రభుత్వాలు కూడా సానుకూలంగా వాటికి మద్దతు పలుకుతున్నాయి.

మన దేశంలో పరిస్థితి పూర్తిగా భిన్నం. మొత్తం ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోంది. టెలికామ్ రంగంలోని తయారీదారులు, సేవలందించేవారు పాల్గొంటారని ఆశించవచ్చు కానీ... నేతృత్వం మాత్రం ప్రభుత్వం వద్ద ఉండే అవకాశాలే ఎక్కువ. పరిశోధనల విషయానికి వస్తే ఐఐటీల్లాంటి విద్యాసంస్థలు ఇప్పటికే కొన్ని కొత్త, వినూత్న టెక్నాలజీలపై పనిచేస్తున్నాయి. వాటికి మరింత ప్రోత్సాహం అందించాలి. 6జీ వాణిజ్యీకరణ విషయానికి వస్తే పరిశ్రమ వర్గాలు, విద్యాసంస్థల భాగస్వామ్యం తప్పనిసరి. 6జీ టెక్నాలజీలో భాగమైన సైబర్ ఫిజికల్ సిస్టమ్స్‌పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఐదేళ్ల క్రితమే ఒక కార్యక్రమాన్ని మొదలుపెట్టినా ఇప్పటివరకూ సాధించింది కొంతే.

విజన్ డాక్యుమెంట్‌లో నిధుల అంశంపై అంత స్పష్టత లేదు. భారీ మొత్తంతో ఒక నిధిని ఏర్పాటు చేస్తామని మాత్రమే ఈ డాక్యుమెంట్ చెబుతోంది. ఈ నిధి పదేళ్ల కాలానికి దాదాపుగా రూ.10,000 కోట్ల వరకూ ఉండవచ్చునని అంటోంది. ఈ నిధి ప్రభుత్వానిదా, కాదా? అన్నదాంట్లోనూ అస్పష్టతే.

టెలికామ్ రంగంలో భారతదేశం దేశీయంగా తయారు చేసిన గొప్ప టెక్నాలజీ ఏదైనా ఉందీ అంటే అది 1980ల నాటి డిజిటల్ రూరల్ స్విచ్! గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజీ ఏర్పాటు చేసేందుకు కేంద్రం అప్పట్లో 'ద సెంటర్ ఫర్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ–డాట్)ను ఏర్పాటు చేసింది. మూడేళ్ల సమయం రూ.36 కోట్ల నిధులు కేటాయించింది. ప్రాజెక్టు విజయవంతమైంది. ఈ టెక్నాలజీని ప్రైవేట్ సంస్థలకు అందించారు. తరువాతి కాలంలో చాలా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ వినియోగించారు. 6జీ విషయంలోనూ ఇదే తరహా పద్ధతిని అనుసరించడం మేలు. ఈ అత్యవసరమైన చర్యలన్నీ తీసుకోకపోతే 6జీ డాక్యుమెంట్ కేవలం కాగితాలకే పరిమితమవుతుంది!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పొరుగింటి అద్భుతం



ఒకరోజు ఒక సౌదీ తన కారుకు ప్లాస్టిక్ కవర్ తొడిగి ఉండటాన్ని గమనించాడు. పొరుగింటి వ్యక్తిని అడిగినప్పుడు తామే ఆ కవరును తొడిగామని, తమ ఇంటికి పెయింటింగ్ వేస్తున్నప్పుడు ఆ చుక్కలు కారుపై పడకుండా ఉండేందుకు అలా చేశామని చెప్పాడు. ఎంత గొప్ప మనిషి!(స్నేహితుని ద్వారా తెలిసిన విషయం).

– జహాక్ తన్వీర్, సౌదీ ఎన్నారై

అలవడుతుంది



శిక్షణలో ఉన్న ప్రతి వైద్యుడూ, కనీసం ఒక్క సారి 'పాలియేటివ్ మెడిసిన్' (ఉపశమన వైద్యం)లో రొటేషన్ చేయాలి. దీనివల్ల అలవడే పేషెంట్ కేర్ టెక్నిక్కులు, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రతి స్పెషాలిటీలో ఆచరించాలి.

– పారీ ద్వార్తే, న్యూరాలజిస్ట్

ఆమ్ ఆద్మీ



ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అతి నిరాడంబర నివాస గృహం వీడియోలను సోషల్ మీడియాలో చూసి నోరు వెళ్లబెట్టకండి. 13 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆ భవనాన్ని పునర్నిర్మాణానికి అయిన ఖర్చు రూ. 45 కోట్ల పన్ను చెల్లింపు దారుల సొమ్ము మాత్రమే.

– నూపుర్ జె. శర్మ, జర్నలిస్ట్

తోడుగా మీరుంటే..!



మేము మన దేశ ప్రతిష్ఠ కోసం ప్రత్యర్థి దేశాలతో పోరాడాం. ఈ రోజు మన మహిళా రెజ్లింగ్ ఛాంపియన్‌ల భద్రత, గౌరవాల కోసం మన దేశంతోనే పోరాడుతున్నాం. దయచేసి మాకు మద్దతు ఇవ్వండి.

– భజరంగ్ పూనియా, ఒలింపిక్ మెడలిస్ట్

గాల్లో ఉన్నట్లు...



హోటల్ గదిలో కళ్లు తెరవగానే తాము ఏ నగరంలో ఉన్నామో తెలిసేది కాదని వెటరన్ పైలెట్లు జోక్ చేసేవాళ్లు. అదెలా జరుగుతుందని నేను ఆశ్చర్యపోయేదాన్ని. అలాంటి నాకు ఈ రోజు పూర్తిగా రెండు నిమిషాలు పట్టింది, ఎక్కడున్నానో గ్రహించడానికి!

– హనా మొహిసిన్ ఖాన్, పైలెట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

అధ్యాపక శిఖరం

తెలంగాణ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా సేవలనందిస్తున్న రచయిత, కవి, విమర్శకులు, పరిశోధకాగ్రగణ్యులు ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు.

తెలంగాణ చరిత్ర లోతుల్లోకి వెళ్లి అనేకమంది సాహితీమూర్తులను, జననేతలను ఆధునిక తెలంగాణ సాహిత్య ప్రపంచానికి ఒక్కచోట కూర్చి పరిచయం చేసిన సారస్వతమూర్తి ఆయన. ఆయన భాషాగరిమ విద్యార్థులను మంత్రముగ్ధులను చేసేది. ప్రధానంగా తన హావభావాలతో జరిగే బోధన విద్యార్థులకు తరగతి గదిలో గొప్ప ప్రేరణ నిచ్చేది. ఆయన పురాణ, ఇతిహాస, ప్రబంధ తెలుగు సాహిత్య చరిత్రపై గట్టిపట్టున్న ఈ కాలం సాహిత్య విమర్శకులు. సంప్రదాయ ఆధునిక విమర్శనా రీతుల్ని అధ్యయనం చేసిన ప్రామాణిక పరిశోధకులు. తెలంగాణ అస్తిత్వానికి అద్దం పడుతూ 'తెలంగాణ పత్రికలు', 'ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ', 'వెలుతురు కొలను', 'తెలంగాణం తెలుగు మాగాణం', 'తుషార సమీరం' తదిర విలక్షణమైన గ్రంథాలను రచించి సాహిత్య లోక సమాదరణ పొందారు. 'మా ప్రసిద్ధిపేట' పేరుతో స్వస్థానాభిమానాన్ని చాటు కొని సిద్దిపేట జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆయన రాసిన విలక్షణ పీవీ నరసింహారావు జీవిత చరిత్ర దివంగత పీవీని నలుపు తెలుపుల్లో నిలబెట్టిన బయోగ్రఫీ. ప్రత్యేకంగా 'జీవనహిందోళం' లాంటి ఆత్మకథాత్మక రచనలు బాల శ్రీనివాసమూర్తికి పేరుతెచ్చాయి. 'జననేతలు', 'అక్షరమూర్తులు', 'ప్రతిభామూర్తులు' (తెలంగాణ వైతాళి కులు) పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 'తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం', 'సాహితీ సుధ', 'తెలంగాణ సాహిత్య చరిత్ర' వంటి సంకలన గ్రంథాలతో విశేష సారస్వత సేవ చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఒకటి నుండి పదవతరగతి తెలుగు పాఠ్య పుస్తకాల నిపుణుల కమిటీలో, డిగ్రీ తెలుగు పాఠ్య గ్రంథాల సంపాదక మండలిలో సమున్నత సభ్యులుగా కొనసాగారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలోనే కాదు కొంతకాలం తెలుగు విశ్వవిద్యాలయంలో కూడా సేవలందించారు.



గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి

– డా॥ ఎ. పున్నయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం

సమస్యల తెలంగాణకు బహుజన భరోసా!

సందర్భం



కె. అరుణ క్వీన్

మొన్న సెక్రెటేరియట్ దిక్కు పోయినప్పుడు నాకు కుడివైపు చేతిలో 'రాజ్యాంగాన్ని' పట్టుకొని ఉన్న నిలువెత్తు 'బాబా సాహెబ్' విగ్రహం కనబడ్డది. ఆ రాజ్యాంగమే లేకుంటే నేను ఎక్కడ ఉందునో కదా అనిపించింది. అలా చూస్తూ వెళ్లే క్రమంలో, కొంచెం ముందుకు పోగానే పింక్ ఫ్లెక్సీలు, హోర్డింగులతో అంబేడ్కర్ తర్వాత కేసీఆరే... అన్నట్లుగా నిండి ఉన్న ప్యాలెస్ లాంటి సెక్రెటేరియట్‌ను చూశా. గత కొన్ని నెలల క్రితం 'రాజ్యాంగాన్నే' మార్చాలన్న కేసీఆర్... నేడు రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ 125 అడుగుల విగ్రహాన్ని పెట్టారు! పాలన చేపట్టిన తొమ్మి దేండ్ల నుండి బహుజనులను మాటల జిమ్మిక్కులతో మోసం చేస్తూనే ఉన్నరు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కూడా దీనిలో భాగంగానే చూడాలి. దళితుల ఓట్లను కొల్లగొట్ట డానికి 'దళితబంధు' పథకాన్ని పెట్టినట్లే ఇప్పుడు అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ చేసినారనీ, సెక్రెటేరియట్‌కు ఆయన పేరు పెడుతున్నరనీ చెప్పడానికి గొప్ప పాండిత్యం ఏమీ అవసరం లేదు.

ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రం సమస్యల కుప్పలా తయారయింది. కూలీ నాలీ చేసుకుని బతికే బహుజనులూ, సామాన్య జనాన్నీ మద్యానికి బానిసలను చేసి ఖజానా నింపుకుంటున్నరు పాలకులు. నిరుద్యోగుల గోస చెప్పనలవిగాదు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అరకొర ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించింది ప్రభుత్వం. చివరికి నియామక ప్రక్రియలో అవినీతి, అక్రమాలు నిండిపోయాయని పేపర్‌లీకేజీ వ్యవహారం బయట పెట్టింది. ఆ విధంగా వందలాది నిరుద్యోగుల ప్రాణత్యాగాలతో వచ్చిన తెలంగాణలో ఇవ్వాళ నిరుద్యోగులకు భరోసానే కరువయింది. 37 వేల కోట్ల రూపాయలు ఎస్సీ సంక్షేమానికి బడ్జెట్ కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి, కనీసం 300 మందికి బువ్వ పెట్టలేరా? మూడొందల మంది స్టూడెంట్స్ బుక్స్ బయట పడేసి, రూంలకు లాక్ వేసి నడిరోడ్డుపై కూర్చోబెట్టిన్రు – నిన్నటికి నిన్న రంగారెడ్డి ఎస్సీ స్టడీ సర్కిల్‌లో. ఇదేనా సంక్షేమ ప్రభుత్వం అంటే? ఎవరిని మోసం చేయడానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరును సచివాలయానికి పెట్టినట్టు?

'సమగ్ర కుటుంబ సర్వే' నివేదికను కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదో అర్థం కాదు. బీసీలపై ప్రేమే ఉంటే బీసీ జనగణన ఎందుకు చేయడం లేదు? ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాల మాదిరి తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు వారి జనాభా దామాషా ప్రకారం ఎందుకు పెంచడం లేదు?



బీఆర్ఎస్ నాయకురాలు, కేసీఆర్ తనయ కవితకు కోట్లాది రూపాయల లిక్కర్ అక్రమ దందాతో సంబంధం వెలుగు చూసినా బీజేపీ ప్రభుత్వం ఆమెను అరెస్ట్ చేయడంలేదు. ఇందుకు కారణం బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య ఉన్న 'నువ్ కొట్టినట్లు చేయి, నేను ఏడ్చినట్లు చేస్తా' అనే ఒప్పందమే అని ఎవరికి తెలియదు?

స్వరాష్ట్రం సిద్ధించిన దగ్గర నుండి నేటికి తొమ్మిది వేల మంది కౌలు రైతులు చనిపోయారు. మన ముఖ్యమంత్రి దృష్టిలో కౌలు రైతులు మనుషులే కాదు. అందుకే వారికి 'రైతు బంధు' వర్తించకుండా చేసి ప్రభుత్వ ధనాన్ని భూస్వాములకు దోచిపెడుతున్నరు.

ఇట్లా తెలంగాణలో రోజురోజుకు పరిస్థితులు దిగజారిపోతున్న తరుణంలో... తన ఆరున్నరేండ్ల ఉన్నత 'అడిషినల్ డీజీపీ' ఉద్యోగాన్ని వదిలి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు డా॥ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. 'బహుజన రాజ్యాధికార యాత్ర'తో మహనీయులు బాబాసాహెబ్, పూలే, కాన్షీరాం వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని గత రెండు వందల రోజులుగా 25 వేల కిలోమీటర్లు ప్రయాణించి 1,500 వందల గ్రామాలను చుట్టివచ్చారు.

ప్రవీణ్ కుమార్ నేతృత్వంలోని బీఎస్పీకి తెలంగాణ సమాజమంతా ఓటు అండ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. నాడు తెలంగాణ కోసం 'చిన్న రాష్ట్రాల ద్వారానే ఈ దేశాభివృద్ధి' అని చెప్పిన భారతరత్న డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ మాటలకు అనుగుణంగా దేశంలోనే మొట్టమొదటిసారిగా తన 36 మంది ఎంపీలతో 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర' డిమాండ్‌కు మద్దతు తెలిపింది బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి. నేడు సమస్యలతో కునారిల్లుతున్న తెలంగాణకు 'భరోసా' ఇవ్వడానికి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి మే 7వ తేదీ, ఆదివారం హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో జరగబోతున్న 'తెలంగాణ భరోసా' సభకు వస్తున్నరు. ఉత్తరప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా... కేవలం ఆరు నెలల్లో ఏడు లక్షల ఎకరాల భూమిని ఒకే ఒక్క సంతకంతో పేదలకు పంచిన ధీర వనిత మాయావతి. బహుజనులకు అధికారం, రాజకీయాల్లో ఎవరివాటా వారికి ఇచ్చిన సీఎం ఆమె. అటువంటి మాయావతి హాజరవుతున్న సభను జయప్రదం చేద్దాం.

వ్యాసకర్త బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి

వేయి కథల స్వరార్చన

కథ చదవటం ఓ అనుభూతి. ఉరుకుల పరుగుల జీవనంలో మనిషికిప్పుడు అనుభూతిని ఆస్వాదించే సమయం కుంచించుకుపోతోంది. డిజిటల్ శక్తులు స్మార్టుగా పాఠకుడి పఠన సమయాన్ని హరించేస్తున్నాయి. అదే సాంకేతిక పరిజ్ఞానంతో ఆ లోటును కొంతయినా పూడిస్తే? కథ చదివే తీరిక, ఓపిక లేని తెలుగువారికి కథను రికార్డు చేసి వినిపిస్తే? ఎవరికి వీలైన సమయంలో వారు ఆ కథ వినే అవకాశం ఉంటుంది కదా!

ఈ ఆలోచన రాగానే ఆచరణకు పూనుకొన్నారు ములగాడ సురేశ్ కుమార్. తన మిత్రులైన పప్పు భోగారావు మధుర కంఠంతో రికార్డ్ చేయించి 'కథాస్రవంతి' పేరుతో ఒక వాట్సాప్ గ్రూపు ద్వారా రోజుకో కథ వినిపిస్తున్నారు. మే 3 నాటికి అలా వెయ్యి కథలను వినిపించారు. కథకు ఇంట్రో రాయటం సురేశ్ కుమార్ కర్తవ్యం. ప్రాసతో కూడిన పదాలతో, సంగీతం ధ్వనించే వాక్యాలతో ఆ విశ్లేషణ కథా శ్రోతలు అందరికీ ఆత్మీయ బంధువై పోయింది. భోగారావు కథను రికార్డ్ చేయలేనప్పుడు సాహితీ మిత్రులు మంజుల, సుధ, రవళి, శేషప్రభ, సుశీల, కీర్తి పప్పు తదితరులతో కథలు చదివించారు. 90 శాతం కథలు భోగారావు గళంలోనే జీవం పోసుకున్నాయి. చదవడంలోనూ ఆయన వైవిధ్యం ప్రదర్శించారు. కథనానికో గళం, సంభాషణకో స్వరం, మాండలికానికో లయ, ముగింపుకో ఉచ్చారణ మేళవిస్తూ కథను శ్రోతల జీవనమూలాల్లోకి ప్రవేశపెట్టే పరిణతి సాధించారు.

ప్రతిరోజూ ఉదయం సరిగ్గా 6 గంటలకు ఆడియో కథ, విశ్లేషణతో సహా పోస్టవుతుంది. గురజాడ నుంచి నేటి వర్ధమాన రచయితల వరకు ఏ కథ నచ్చితే ఆ కథకు స్వరార్చన చేశారు. వంద, 200, 300.... ఇలా వరుసగా ఇప్పటికి వెయ్యి విలువైన కథలు శ్రోతలకు చేరాయి. ఈ కథలు 'ఫార్వర్డ్ రెక్కలు' కట్టు కొని మరెన్నో గ్రూపులకు ఎగిరిపోవడం షరా మామూలే. నిజానికి, కథలు రికార్డ్ చేసి వాట్సాప్, యూట్యూబ్‌ల ద్వారా సాహితీ ప్రియులకు చేరువ చేస్తున్న వారిలో ఇప్పటికి 1400 కథలు అందించిన 'వసంత వల్లరి' వసంత లక్ష్మి, అలాగే కొప్పర్తి రాంబాబు, భండారు హరిత (కథా ప్రపంచం), దొండపాటి కృష్ణ లాంటి వారెందరో ఉన్నారు. కథాస్రవంతి మరో వెయ్యి కథలు వినిపించే దిశగా స్వరం సవరించుకోవాలి. గుంటూరు జిల్లా పెద పరిమి గ్రామంలో మే 7న 70 మందికి పైగా రచయితల సమక్షంలో 'కథాస్రవంతి' సభ్యుల్ని 'మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్' సత్కరించనుంది. – ఎమ్వీ రామిరెడ్డి, కవి – కథకుడు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.10.04 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** విశాఖ రా.9.34 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.1.32 నుండి 3.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.34 నుండి 7.18 వరకు, **అమృతఘడియలు:** ప.12.44 నుండి 2.20 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

నిరుపేదకు న్యాయ 'పట్టం'



దాదాపు 50,000 పేద కుటుంబాల ఇళ్ల స్థలాలకు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- ఇళ్ల స్థలాలివ్వకుండా ప్రభుత్వాన్ని నిరోధించేందుకు నిరాకరణ
- ఏపీ ప్రభుత్వాన్ని అడ్డుకోవాలన్న రాజధాని రైతుల అభ్యర్థన తిరస్కృతి
- జీవో 45, స్థలాల కేటాయింపులు తుది తీర్పునకు లోబడి ఉంటాయి
- రాజధాని అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది
- పేదల అభివృద్ధి రాజధాని అభివృద్ధిలో భాగమే
- రైతులు కోరినట్లు ఉత్తర్వులిస్తే న్యాయ ఔచిత్యాన్ని ఉల్లంఘించినట్లే
- ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతంపై పిటిషనర్లకు ఎలాంటి హక్కులు లేవు
- మధ్యంతర ఉత్తర్వుల్లో హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి: నిలువ నీడలేని దాదాపు 50,000 నిరుపేద కుటుంబాలకు మంచి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని అమరావతి పరిధిలో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తే సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందంటూ అసంబద్ధమైన వాదనలతో రైతుల ముసుగులో కోర్టుకెక్కిన టీడీపీ నేతలకు చెంపపెట్టు లాంటి తీర్పును వెలువరించింది. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరోధించేందుకు హైకోర్టు నిరాకరించింది. పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలివ్వకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని రైతుల పేరుతో కొందరు దాఖలు చేసిన అభ్యర్థనలను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈమేరకు దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాలను కొట్టివేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో 45, ఇళ్ల పట్టాల కేటాయింపు ప్రధాన వ్యాజ్యాలు తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది.

అన్ని వర్గాల అభివృద్ధితోనే..

రాజధానిని అభివృద్ధి చేయాలన్న హైకోర్టు విస్తృత ధర్మాసనం తీర్పు మేరకే ఆ ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేస్తున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనతో హైకోర్టు ఏకీభవించింది. రాజధాని నగర నిర్మాణం చేపట్టేందుకు, రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతినిస్తూ హైకోర్టు విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిందని ఈ సందర్భంగా హైకోర్టు గుర్తు చేసింది. అన్ని వర్గాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్), దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వర్గాల అభివృద్ధి కూడా రాజధాని అభివృద్ధిలో భాగమే అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. అందువల్ల పిటిషనర్లు కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది. రాజధాని అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో రైతులు కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులిస్తే అది న్యాయ ఔచిత్యాన్ని ఉల్లంఘించినట్లవుతుందని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వకుండా అడ్డుకోండి..

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు సీఆర్‌డీఏను అనుమతినిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 45ను సవాల్ చేస్తూ అమరావతి రైతుల పేరుతో హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. జీవో 45 అమలును నిలుపుదల చేయడంతో పాటు పేదలకు ఎలాంటి ఇళ్ల స్థలాలను కేటాయించకుండా ప్రభుత్వాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై గత నెల 21న వాదనలు విన్న సీజే ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ధర్మాసనం తన నిర్ణయాన్ని వెలువరించడానికి ముందే రాజధాని రైతుల తరఫు న్యాయవాది సంజయ్ సూరనేని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఓ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చేస్తోందని, అందువల్ల ఈ వ్యవహారంపై అత్యవసరంగా విచారణ జరపాలని ఆ లేఖలో కోరారు. దీంతో ధర్మాసనం రైతుల వ్యాజ్యాలపై తిరిగి విచారణ చేపట్టింది. రైతుల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దేవ్‌దత్ కామత్, సీనియర్ న్యాయవాది వీఎస్సార్ ఆంజనేయులు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సీఆర్‌డీఏ తరఫున కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. రైతులు దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాలపై ధర్మాసనం శుక్రవారం మధ్యాహ్నం తన నిర్ణయాన్ని వెలువరించింది.

పిటిషనర్లు ప్రభావితం కావడం లేదు..

'గత మాస్టర్ ప్లాన్‌లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈడబ్ల్యూఎస్) ఇళ్ల స్థలాల కోసం ఎలాంటి నిర్దిష్ట ప్రాంతాన్ని కేటాయించలేదు. ఎలక్ట్రానిక్ సిటీ కోసం కేటాయించిన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు పేదలకు ఇస్తోందని, ఆ భూమి ల్యాండ్ పూలింగ్ స్కీంలోని లేఔట్లలో భాగం కాదని మా దృష్టికి తెచ్చారు. పేదలకు ఇప్పుడు కేటాయిస్తున్న స్థలంతో పిటిషనర్లకు (రాజధాని రైతులు) ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం లేదు. పేదలకు ఇవ్వదలచిన స్థలం ఎలక్ట్రానిక్ సిటీ కోసం కేటాయించింది. రాజధాని అభివృద్ధిలో భాగమైన నవ నగరాలు చెక్కు చెదరకుండా ఉండటమన్న అంశం సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉంది. ఎలక్ట్రానిక్ సిటీ కోసం కేటాయించిన భూములపై పిటిషనర్లకు ఎలాంటి హక్కు లేనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు చేస్తున్న ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల ప్రత్యక్షంగా వారు ఏ విధంగానూ ప్రభావితం కారు. రాజధాని అభివృద్ధి కోసం పూలింగ్‌లో భాగంగా తమ భూములిచ్చామని పిటిషనర్లు చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ సిటీ కూడా అందులో భాగమని, ఎలక్ట్రానిక్ సిటీని దెబ్బ తియ్యడమంటే తమ హక్కులను హరించడమేనని వారు వాదిస్తున్నారు. అయితే ఈ వ్యవహారం మొత్తం సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉంది. అందువల్ల పిటిషనర్లు దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాల్లో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు మేం సుముఖంగా లేం' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

అన్నదమ్ముల గొడవలో బావ మృతి

జగిత్యాలక్రైం: తమ తల్లికి వచ్చిన ఆసరా పింఛన్ కోసం కొట్టుకుంటున్న అన్నదమ్ములను వారించేందుకు వెళ్లిన బావను తోయడంతో బండపై పడి తీవ్రగాయాలతో మృతి చెందాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని విజయపురికాలనీలో శుక్రవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన సయ్యద్ నయీం(35) కొద్దికాలంగా జగిత్యాలలోని విజయపురిలో చిన్నబావమరిది తాజ్, అత్త వజీర్ బీతో కలిసి ఉంటున్నాడు. రాయికల్‌లో నివాసం ఉండే పెద్ద బావమరిది హైదర్ ఉరఫ్ హైమద్‌కి తమ్ముడు తాజ్ మధ్య ఇప్పటికే గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తల్లి ఆసరా పింఛను తనకు ఇవ్వాలని అడిగేందుకు శుక్రవారం మధ్యాహ్నం హైదర్ నేరుగా తమ్ముడి ఇంటికి వెళ్లి తాజ్‌తో గొడవపడ్డాడు. అక్కడే ఉన్న సయ్యద్ నయీం బావమరుదులను వారించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నయీంను హైమద్ తోసివేయగా...పక్కనే ఉన్న బండపై పడి తలకు తీవ్రగాయాలై అక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య షబానా ఫిర్యాదు మేరకు హైదర్ ఉరఫ్ హైమద్‌పై కేసు నమోదు చేశారు. మృతుడికి కూతురు అనీఫా, కుమారుడు సల్మాన్ ఉన్నారు.



హకీంపేటకు జవాన్ అనిల్ భౌతికకాయం


అనిల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మేజర్ జనరల్ రాకేశ్ మనోచ

సాక్షి, హైదరాబాద్/బోయినపల్లి(చొప్పదండి): జమ్మూ కశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అమరుడైన ఆర్మీ జవాన్ పి.అనిల్ భౌతికకాయం శుక్రవారం సాయంత్రం హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకుంది. ప్రత్యేక విమానంలో తీసుకొచ్చిన అనిల్ పార్థివదేహానికి తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా హెడ్-క్వార్టర్స్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ జనరల్ రాకేశ్ మనోచ నివాళులు అర్పించారు. భౌతిక కాయాన్ని శనివారం ఉదయం.. అనిల్ స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్‌కు తరలిస్తారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన ఆర్మీ అధికారులు శుక్రవారం మల్కాపూర్‌ను సందర్శించారు. జమ్మూకశ్మీర్, హైదరాబాద్ నుంచి సైనికాధికారులు రానున్నారని, అంత్యక్రియల స్థలం విశాలంగా ఉండేలా చూడాలని కుటుంబ సభ్యులను కోరారు.

కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి కేటీఆర్

అనిల్ మృతి పట్ల రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువ జవాన్‌ను కోల్పోవడం బాధాకరమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనిల్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

షెడ్యూల్ ప్రకారం పరిహారం చెల్లించండి

- నృసింహ సాగర్ భూ సేకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నృసింహ సాగర్ (బస్వాపూర్ రిజర్వాయర్) భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నృసింహ సాగర్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2019లో 1,892 ఎకరాలను సేకరించడానికి నోటిఫికేషన్ ఇచ్చింది. భువనగిరి మండలం తిమ్మాపూర్‌లోని విఖ్యాత్ డెవలపర్స్ లిమిటెడ్‌కు సంబంధించిన సుమారు 465 లక్షల చదరపు గజాలను కూడా సేకరించింది. 2022, మే 6న పరిహారం వివరాలపై నోటిఫికేషన్ జారీ చేసింది. ఏడాది గడిచినా పరిహారం చెల్లించకపోవడంతో 'విఖ్యాత్ ఇన్‌ఫ్రా ఎండీ జి.శ్రీధర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ముమ్మినేని సుధీర్ కుమార్ ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 2022లో పరిహారం నోటిఫికేషన్ ఇచ్చినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని..నిధులను అందుబాటులో లేకుండా భూసేకరణ చేపట్టడం సరికాదన్నారు. పరిహారాన్ని ఎప్పటిలోగా చెల్లిస్తారో రాతపూర్వకంగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. అయితే ప్రభుత్వ న్యాయవాది ముజీబ్ కుమార్ వాదనలు వినిపిస్తూ..ఏప్రిల్‌లో రూ.187 కోట్లు, మేలో రూ.201 కోట్లు, జూన్‌లో 200 కోట్లు.. మొత్తంగా రూ.588 కోట్లను జూన్ నెలాఖరులోగా చెల్లిస్తామని తెలిపారు. ఇతర భూ యజమానులతో పాటు పిటిషనర్‌కు కూడా పరిహారం మొత్తం చెల్లించాలని..లేకుంటే పరిహారం పెంపుపై పిటిషనర్ చట్టపరమైన ప్రత్యామ్నాయాలను వినియోగించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు నం. SANDT-ZONAL-JDB
పని పేరు: వాల్తేరు డివిజనలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు/టెలి/జగదల్పూర్ వారి పరిధిలో టెలికాం జోనల్ పని.
ప్రకటిత విలువ: ₹ 27,43,444/-, బయానా: ₹ 54,900/-, పని పూర్తి చేయు కాలం: 12 నెలలు.
బిడ్డింగ్ ప్రారంభ తేదీ: 08.05.2023
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: At 1630 Hrs. of 22.05.2023.
ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏదైనా అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరించబడును.
ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటుపూర్తి వివరాలు లభించు వెబ్‌సైట్ : http://www.ireps.gov.in
సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీరు, వాల్తేరు
PR-132/O/23-24

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు నం. SANDT-ZONAL-KRPU
పని పేరు: వాల్తేరు డివిజనలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు/టెలి/కోరాపుట్ వారి పరిధిలో టెలికాం జోనల్ పని.
ప్రకటిత విలువ: ₹ 39,10,508/-, బయానా: ₹ 78,200/-, పని పూర్తి చేయు కాలం: 12 నెలలు.
బిడ్డింగ్ ప్రారంభ తేదీ: 08.05.2023
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: At 1500 Hrs. of 22.05.2023.
ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏదైనా అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరించబడును.
ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటుపూర్తి వివరాలు లభించు వెబ్‌సైట్ : http://www.ireps.gov.in
సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీరు, వాల్తేరు
PR-131/O/23-24

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, అందోల్-జోగిపేట, సంగారెడ్డి జిల్లా
మున్సిపల్ కౌన్సిల్, అందోల్-జోగిపేట, సంగారెడ్డి జిల్లా, ఇ-మెయిల్: mcandolejogipet@gmail.com
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
టెండర్ నోటీస్ నం.E1/MCAJ/Engg/SDF/2021-22/Pattana Pragathi fund తేదీ: 06.05.2023
SDF గ్రాంట్స్/ పట్టణ ప్రగతి ఫండ్స్ క్రింద అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండర్లు కోరబడుతున్నవి. ప్యాకేజ్ I మరియు ప్యాకేజ్ II. అంచనా వ్యయం: రూ.357.50 లక్షలు, పనుల సంఖ్య 03. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ కొరకు ప్రారంభ తేదీ: 06.05.2023. టెండరు దాఖలుకు చివరి తేదీ, సమయం: 13.05.2023న ఉ॥ 10.30 గం॥ వరకు, సాంకేతిక బిడ్ తెరుచు తేదీ, సమయం: 13.05.2023న ఉ॥ 10.30 గం॥లకు, ఆర్థిక బిడ్ తెరుచు తేదీ, సమయం: 13.05.2023న సా॥ 04.30 గం॥లకు.
సం/- కమిషనర్, అందోల్-జోగిపేట మున్సిపాలిటీ
DIPR RO No.1249-PP/CL/Advt/1/2023-24, Dt. 05.05.2023

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ : రాజేంద్రనగర్ సర్కిల్
టెండర్ ప్రకటన నం.01/23-24
క్రింద తెలిపిన పనుల కోసం అర్హతగల బిడ్డర్ల నుండి టీఎస్ టెండర్ల ద్వారా బిడ్లు కోరబడుచున్నవి: 1) ... ORR ... 33KV 400sqmm UG కేబుల్ ..., 2) ... 11KV LT OH లైన్స్ మరియు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు, 3) ... 11KV LT OH లైన్స్ మరియు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు, 4) ... 3-ఫేజ్ CT మీటర్ 2.9KW ..., 5) ... 3-ఫేజ్ మీటర్ 49 HP ..., 6) ... 33/11 KV ... 3.15 MVA PTR ..., 7) ... 12-05-2023 నుండి 24-05-2023 వరకు మరియు దాఖలుకు చివరి తేదీ: 20-05-2023, 14:00 గం.వరకు మరియు తెరుచు 22-05-2023, 17:00గం. వరకు ... www.eprocurement.gov.in & www.tssouthernpower.com ఫోన్ నం: 040-23431232, సెల్ నం.7901093694
DIPR RO No.1246-PP/CL/Advt/1/2023-24, Dt: 05.05.2023 సం/- SE/OP/RJNR సర్కిల్, ..., హైదరాబాద్ -28



క్లుప్తంగా

శరద్ పవార్ రాజీనామా నిర్ణయం వాపస్

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) అధ్యక్ష హోదా నుంచి వైదొలగాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు శరద్ పవార్ తెలిపారు. పార్టీ సహచరులు, శ్రేణుల మనోగతం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అంతకుముందు, పార్టీ ప్రత్యేక కమిటీ సమావేశమై, శరద్ పవార్ నిర్ణయంపై చర్చించింది. పార్టీ చీఫ్‌గా ఆయనే కొనసాగాలన్న తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం ఆయన్ను కలిసి రాజీనామా నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని కోరింది.

'కరోనా పీడ విరగడైంది'

జెనీవా: కరోనా మహమ్మారి పీడ దాదాపుగా విరగడైనట్టే. గత మూడున్నరేళ్లుగా ప్రపంచ దేశాలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన కరోనా వైరస్ గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ దశను దాటేసిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. కోవిడ్-19 అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ఇకపై చూడాల్సిన అవసరం లేదని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ టెడ్రోస్ అధ్నామ్ వెల్లడించారు. కనీవినీ ఎరుగని రీతిలో లాక్‌డౌన్‌లతో నాలుగ్గోడల మధ్య ప్రజలు బందీగా ఉండడం, ఆర్థిక వ్యవస్థలన్నీ కుప్పకూలిపోవడం వంటి వాటితో కరోనా కలకలం రేపింది. ఈ వైరస్ బారిన పడి ప్రపంచవ్యాప్తంగా 70 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అయితే కరోనా వైరస్ బలహీనపడిపోయినప్పటికీ ఇంకా ముగింపు దశకు చేరుకోలేదని టెడ్రోస్ చెప్పారు. ఇప్పటికీ ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్య దేశాల్లో కరోనా కేసులు వెలుగులోకి వస్తున్నాయని, ప్రతీ వారం కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. 2020 జనవరి 30 డబ్ల్యూహెచ్‌ఓ కోవిడ్-19ను అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది.

యూకే 'స్థానికం'లో అధికార పక్షానికి ఎదురుదెబ్బ

లండన్: యూకే స్థానిక ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రధానిగా భారత సంతతికి చెందిన రిషి సునాక్ బాధ్యతలు చేపట్టాక జరిగిన మొదటి ఎన్నికలివి. ఇంగ్లండ్‌లోని 317 కౌన్సిళ్లకుగాను 230 కౌన్సిళ్లలోని 8 వేల సీట్లకు గురువారం ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు ప్రకటించిన ఫలితాల్లో అధికార పార్టీ 20కిపైె కౌన్సిళ్లను కోల్పోయింది. ఎన్నికలు జరిగిన 8 వేల సీట్లలో లేబర్ పార్టీ 1,384, కన్జర్వేటివ్ పార్టీ 1,041, లిబరల్ డెమోక్రాట్లు 768 సీట్లను సాధించాయి. 20 ఏళ్లుగా అధికారపక్షానికి కంచుకోటగా ఉన్న మెడ్‌వే లాంటి కౌన్సిళ్లను సైతం లేబర్ పార్టీ, లిబరల్ డెమోక్రాట్లు కై వసం చేసుకున్నారు. మరికొద్ది నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనుండగా వెలువడిన ఈ ఫలితాలపై ప్రధాని రిషి సునాక్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఓట్లెక్కువ.. సీట్లు తక్కువ!

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో విచిత్రం

చాలాసార్లు నష్టపోయింది కాంగ్రెస్సే

బీజేపీకి తక్కువ ఓట్లతో ఎక్కువ సీట్లు






సాక్షి, బెంగళూరు: కర్ణాటక శాసనసభ ఎన్నికల పోలింగ్ గడువు ముంచుకొస్తోంది. ఈ సారైనా మేజిక్ ఫిగర్ దాటడానికి కాంగ్రెస్, బీజేపీ పోటీపడి ప్రణాళికలు రచిస్తూ ముందుకు సాగుతున్నాయి. 1999, 2013లో మినహా గత మూడు దశాబ్దాల ఎన్నికల్లో కన్నడ ఓటరు ఏ పార్టీకి మెజార్టీ కట్టబెట్టడం లేదు. ఈసారి ఓటర్ల మనోగతం ఎలా ఉందోనని పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్ర గమనిస్తే అనేక ఆశ్చర్యకరమైన సంగతులు వెలుగు చూస్తాయి. ఓట్ల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ గెలిచే సీట్ల సంఖ్య మాత్రం తక్కువగా ఉంటోంది. ఓట్లు తక్కువగా పోలయినా సీట్ల బలంతో అధికార అందలం ఎక్కుతున్నారు. ఈ విచిత్రకరమైన పరిస్థితి గత నాలుగు శాసనసభ ఎన్నికల్లో కనిపించింది. కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఓట్లను సాధించి అగ్రస్థానంలో ఉంటోంది. కానీ సీట్ల సాధనలో వెనుకబడిపోతోంది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 36.59% ఓట్లను సాధించి 224 స్థానాలున్న అసెంబ్లీలో 122 సీట్లలో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2018 ఎన్నికల సమయానికి ఆ పార్టీ ఓటు షేర్ 38శాతానికి పెరిగినప్పటికీ కేవలం 78 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో బీజేపీ 36శాతం ఓట్లతో 104 స్థానాల్లో నెగ్గి అతి పెద్ద పార్టీగా అవతరించడం విశేషం. అదే విధంగా 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 35.27% ఓట్లు కొల్లగొట్టి 65 స్థానాలు సాధించింది. అదే ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే తక్కువగా 28.3% ఓట్లను గెలుచుకున్న బీజేపీ 79 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. 2008 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల వాటా ఒక్క శాతం తగ్గినప్పటికీ 80 స్థానాల్లో గెలుపొందింది.

రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు, ఆశ్చర్యకర సంఘటనలు జరిగిన ఎన్నికలు ఇవే . 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. సిద్ధరామయ్య నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఐదేళ్ల పాటు పూర్తి కాలం పాటు పాలన సాగించింది. బీజేపీలోని అంతర్గత విభేదాలు, భిన్నాభిప్రాయాలు కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చాయి. బీఎస్ యడియూరప్ప బీజేపీని వీడి సొంతంగా కేజేపీ స్థాపించి ఎన్నికలకు వెళ్లారు. ఆయన సహచరుడు బి.శ్రీరాములు కూడా బీఎస్ఆర్ పార్టీని నెలకొల్పి ఎన్నికల బరిలో దిగారు. ఈ పరిణామాలతో బీజేపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 36.6 శాతం ఓట్లను రాబట్టి 112 నియోజకవర్గాల్లో గెలుపొందింది. బీజేపీ 19.9 శాతం ఓట్లతో 40 సీట్లు, జేడీఎస్ పార్టీ 20.2 శాతం ఓట్లతో 40 సీట్లు, యడియూరప్ప కేజేపీ పార్టీ 9.8 శాతం ఓట్లతో ఆరు నియోజకవర్గాలు గెలుచుకున్నాయి. ఈ దెబ్బతో బీజేపీ యడియూరప్పను బుజ్జగించి పార్టీలోకి తిరిగి చేర్చుకుంది.

2013 ఎన్నికలు ప్రత్యేకం

ఎందుకీ పరిస్థితి..?

కర్ణాటక ఓటరు నాడి ఎవరికీ అందకుండా ఉంటుంది. పోలింగ్ బూత్‌కి వెళ్లేవరకు కూడా ఎవరికి ఓటు వెయ్యాలా అని నిర్ణయించుకోలేని ఓటర్లు 20% వరకు ఉంటారని అంచనాలున్నాయి. దీనివల్ల ఏ పార్టీకి లాభం చేకూరుతుందో చెప్పలేకపోతున్నారు. రాష్ట్రంలో సంక్లిష్టమైన కులాల చిక్కుముడులు, లింగాయత్‌లు, వొక్కలిగల జనాభా ఎంత ఉంటుందో స్పష్టమైన గణాంకాలు లేకపోవడం వంటివి కూడా ఏ పార్టీకి మెజార్టీ దక్కకపోవడానికి కారణాలన్న విశ్లేషణలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా మూడు పార్టీలు ఉన్నప్పటికీ జేడీ(ఎస్) పాత మైసూరుకే పరిమితమైంది. ఆ ప్రాంతంలో బీజేపీకి అంతగా పట్టు లేదు. దీంతో ఎక్కడైనా రెండు పార్టీల మధ్యే ముఖాముఖి పోరు నెలకొంటోంది. పాత మైసూరులో కాంగ్రెస్, జేడీ(ఎస్)ల మధ్య హోరాహోరీ పోరు ఉంటే, మిగిలిన ప్రాంతాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే గట్టి పోటీ ఉంటుంది. దీంతో అయితే భారీ మెజార్టీ, లేదంటే అతి స్వల్ప మెజార్టీతో పార్టీలు విజయం సాధిస్తున్నాయి. మొత్తమ్మీద రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోనూ క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండడం వల్ల ఆ పార్టీ ఓట్ల శాతంలో అగ్రభాగంలో నిలుస్తున్నా అధికారానికి అవసరమైన సీట్లను రాబట్టుకోవడంలో విఫలమవుతోంది.



నేడే చార్లెస్-3 పట్టాభిషేకం

అట్టహాసంగా ఏర్పాట్లు ● రాజు, రాణికి కిరీటధారణ చేయనున్న మత పెద్దలు



లండన్: చరిత్రాత్మక ఘట్టానికి తెరలేచింది. బ్రిటన్ రాజుగా చార్లెస్-3 పట్టాభిషేక సంబరానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ అబేలో శనివారం ఆయనకు సంప్రదాయబద్ధంగా కిరీటధారణ చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుంది. బీబీసీలో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. ఎలిజబెత్-2 మృతితో ఆయన తనయుడు చార్లెస్-3 బ్రిటన్ రాజుగా ఇప్పటికే బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు లాంఛనంగా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. 74 ఏళ్ల చార్లెస్-3, 75 ఏళ్ల ఆయన భార్య కెమిల్లా శనివారం ఉదయమే గుర్రాలు పూన్చిన ప్రత్యేక బంగారు రథంలో బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి వెస్ట్‌మినిస్టర్ అబేకు చేరుకుంటారు. అక్కడ లాంఛనప్రాయంగా జరిగే కార్యక్రమాలు ముగిసిన అనంతరం రాజుకు, రాణికి కిరీటధారణ చేస్తారు. సెయింట్ ఎడ్వర్డ్ కిరీటాన్ని చార్లెస్-3, సెయింట్ మేరీస్ కిరీటాన్ని కెమిల్లా ధరిస్తారు. ఈసారి కోహినూర్ వజ్రాన్ని ఈ కిరీటంలో చేర్చడం లేదు. కిరీటధారణ తర్వాత చరిత్రాత్మక కుర్చీలో రాజు, రాణి ఆసీనులవుతారు. 1953లో జరిగిన క్వీన్ ఎలిజబెత్-2 పట్టాభిషేక మహోత్సవానికి 8,000 మందిని ఆహ్వానించారు. చార్లెస్-3 పట్టాభిషేకానికి కేవలం 2,200 మందికి ఆహ్వానం పంపించారు. దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారడం, జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రైస్తవ పద్ధతిలో రాజు పట్టాభిషేకం జరగడం సంప్రదాయంగా వస్తోంది. ఈసారి కొంత ఆధునికతను జోడించారు. ఇతర మతాలకు సైతం చోటు కల్పించారు. వివిధ మతాల గురువులు, పెద్దలు రాజును ఆశీర్వదించనున్నారు. హిందూమతం తరఫున నరేంద్ర బాబూభాయి పటేల్ రాజుకు ఉంగరం అందజేస్తారు. బ్రిటన్ తొలి హిందూ ప్రధానమంత్రి రిషి సునాక్ బైబిల్ సూక్తులు చదివి వినిపిస్తారు. చార్లెస్-3 పట్టాభిషేక వేడుకలో పాల్గొనేందుకు వివిధ దేశాల అధినేతలు, దేశ విదేశీ అతిథులు లండన్‌కు చేరుకుంటున్నారు. భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు శుక్రవారం లండన్‌కు చేరుకున్నారు. బ్రిటిష్ ఎంపైర్ మెడల్(బీఈఎం) స్వీకరించినవారిని ఈ పట్టాభిషేకానికి ఆహ్వానించారు. ఇలా ఆహ్వానం అందుకున్న వారిలో భారత సంతతికి చెందిన పాకశాస్త్ర ప్రవీణురాలు మంజు మాల్హీ కూడా ఉన్నారు. పట్టాభిషేకం సందర్భంగా జరిగే సైనిక పరేడ్‌లో బ్రిటిష్ సైనికులతోపాటు కామన్వెల్త్ దేశాల జవాన్లు కూడా పాల్గొంటారు. 7,000 మంది జవాన్లతో జరిగే కవాతు కనువిందు చేయనుంది.

కశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు జవాన్లు వీరమరణం

రాజౌరీ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో భద్రతా సిబ్బంది, ఉగ్రవాదుల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు మృతిచెందారు. ఉన్నతాధికారుల సమాచారం మేరకు.. రాజౌరీ సెక్టార్‌లోని కాండీ అడవిలో ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది ఈ నెల 3న గాలింపు చర్యలు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ముష్కరులు ఓ గుహలో తలదాచుకున్నట్లు గుర్తించారు. సీఆర్‌పీఎఫ్‌తోపాటు ప్రత్యేక దళం జవాన్లు ఆ గుహను చుట్టుముట్టారు. లొంగిపోవాలని ఉగ్రవాదులను హెచ్చరించారు. వారు స్పందించకపోవడంతో మోర్టార్లు, గ్రనేడ్లతో గుహపై దాడి చేశారు. దాంతో ఉగ్రవాదులు పేలుడు పరికరాలు ప్రయోగించారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు ఘటనా స్థలంలో, మరో ముగ్గురు జవాన్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మేజర్ సహా మొత్తం నలుగురు గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి తప్పించుకున్న ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోందని సైనికాధికారులు వెల్లడించారు. రాజౌరీ సమీపంలోని పూంచ్ జిల్లాలో గత నెలలో ఉగ్రవాద దాడిలో ఐదుగురు సైనికులు మరణించిన సంగతి తెలిసిందే. పూంచ్, రాజౌరీ జిల్లాల్లో 2021 అక్టోబర్ నుంచి ఇప్పటిదాకా 7 ఉగ్రవాద దాడి సంఘటనలు జరిగాయి. 22 మంది సైనికులు సహా మొత్తం 29 మంది బలయ్యారు.

విదేశీ మారక నిల్వల కంటే వేగంగా...

పాక్ విశ్వసనీయత పతనం

నేటికీ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతోంది ● పీఓకేను ఎప్పుడు ఖాళీ చేస్తారో చెప్పండి



సదస్సులో పాల్గొన్న ఎస్. జై శంకర్, బిలావల్ భుట్టో

- విదేశాంగ మంత్రి జై శంకర్ మండిపాటు
- ఎస్‌సీవో భేటీలో బిలావల్ వ్యాఖ్యలపై ధ్వజం
- ఆయన ఉగ్రవాద సమర్థకుడంటూ నిప్పులు

బెనౌలిమ్ (గోవా): అంతర్జాతీయ వేదికలపై వక్రబుద్ధి ప్రదర్శించే పాకిస్తాన్ తీరుపై విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ నిప్పులు చెరిగారు. పాకిస్తాన్ విశ్వసనీయత దాని విదేశీ మారక ద్రవ్య నిల్వల కంటే కూడా శరవేగంగా క్షీణిస్తోందంటూ దుయ్యబట్టారు. శుక్రవారం గోవాలో ముగిసిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) విదేశాంగ మంత్రుల భేటీ ఇందుకు వేదికగా మారింది. కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దు అంశాన్ని పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో భేటీలో లేవనెత్తారు. దానిపై పునరాలోచన చేసేదాకా భారత్‌తో ద్వైపాక్షిక చర్చలకు పాక్ సిద్ధంగా లేదన్నారు. దాంతో భేటీ అనంతరం జై శంకర్ మీడియాతో మాట్లాడుతూ బిలావల్ వ్యాఖ్యలను తూర్పారబట్టారు. ''ఆర్టికల్ 370 ముగిసిన చరిత్ర. ఇప్పటికైనా నిద్ర నుంచి మేల్కొని వాస్తవాలు గమనించండి'' అంటూ చురకలు వేశారు. బిలావల్ 'ఉగ్రవాదానికి ప్రోత్సాహకుడు, సమర్థకుడు, అధికార ప్రతినిధి'గా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో ఆరోపించారు! తామూ ఉగ్రవాద బాధితులమేనన్న బిలావల్ వ్యాఖ్యలపైనా జై శంకర్ తీవ్రంగా స్పందించారు. పాకిస్తాన్ ఇప్పటికీ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతోందని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, పాక్ చేతులు కలుపుతాయా అని ప్రశ్నించగా, ఉగ్రవాద బాధితులు ఎప్పుడూ ఉగ్రవాదానికి పాల్పడిన వారితో కలిసి ఉగ్రవాదంపై చర్చించడానికి కూర్చోరని బదులిచ్చారు. చేశారు. జీ 20 సన్నాహక సమావేశాలను జమ్మూ కశ్మీర్‌లో జరపడంపై బిలావల్ లేవనెత్తిన అభ్యంతరాలనూ కొట్టిపారేశారు. ''అసలు జీ 20 భేటీలతో మీకేం సంబంధం? దానికంటే, జమ్మూ కశ్మీర్లో మీరు ఆక్రమించుకున్న భూభాగాలను ఎప్పుడు ఖాళీ చేస్తారన్న దానిపై మాట్లాడితే బాగుంటుంది'' అంటూ వాతలు పెట్టారు. జమ్మూ కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేశారు. ''మేమేదో పాక్‌పై దౌత్యపరంగా పై చేయి సాధించేందుకు ప్రయత్నించడం లేదు. ఆ దేశం అసలు రంగును రాజకీయంగా, దౌత్యపరంగా ఎప్పటికప్పుడు ప్రపంచం ముందుంచుతున్నాం'' అని వివరించారు.

ఉగ్రమూలాల్ని పెకిలించాలి

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సమూలంగా నాశనం చేయాలని ఎస్‌సీఓ భేటీలో జై శంకర్ పిలుపునిచ్చారు. ''ఉగ్రవాదం ఇప్పటికీ కొనసాగుతోంది. దానినెవరూ సమర్థించరాదు. ప్రభుత్వాల సాయంతో తెరవెనుక సాగే సీమాంతర ఉగ్రవాదం సహా ఏరూపంలో ఉన్నా అరికట్టాలి'' అని పాక్‌నుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఉగ్రమూకల ఆర్థిక మూలాలను సమూలంగా నాశనం చేయాలన్నారు. ఇది ఎస్‌సీవో లక్ష్యాల్లో ఒకటని గుర్తు చేశారు. సభ్య దేశాల శాంతి, సుస్థిరతలకు భారత్ అత్యంత ప్రాముఖ్యతనిస్తుందన్నారు. ద్వైపాక్షిక అంశాలను ప్రస్తావించరాదనే ఎస్‌సీవో నిబంధనలను ఉల్లంఘించకుండానే పాక్‌కు మంత్రి తలంటారు. బిలావల్ మాట్లాడుతూ దౌత్యపరమైన అంశాల్లో ఉగ్రవాదాన్ని అస్త్రంగా వాడుకోరాదన్నారు. ''ఈ సమస్యను రాజకీయాల నుంచి వేరు చేసి అందరూ కలిసికట్టుగా పోరాడాలి. నేనూ ఉగ్రవాద బాధితుడినే. నా తల్లి బేనజీర్ భుట్టో ఉగ్రవాదానికి బలయ్యారు'' అన్నారు.

నమస్కారంతోనే భుట్టోకు పలకరింపు

భారత్ సారథ్యంలో ఎస్‌సీవో సదస్సుకు హాజరైన పాక్ మంత్రి భుట్టో తదితర సభ్య దేశాల విదేశాంగ మంత్రులకు ఎస్.జై శంకర్ తాజ్ ఎగ్జోటికా రిసార్టులో ఏర్పాటు చేసిన వేదిక వద్ద నమస్తేతో స్వాగతం పలికారు. గురువారం సాయంత్రం హోటల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో మాత్రం భుట్టో సహా అతిథులందరితోనూ మంత్రి జై శంకర్ కరచాలనం చేశారు. కార్యక్రమంలో రష్యా, చైనా విదేశాంగ మంత్రులు వరుసగా బిలావల్ భుట్టో, సెర్గీ లావ్‌రోవ్, క్విన్ గాంగ్‌తోపాటు ఖజకిస్తాన్, కిర్గిజ్‌స్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ మంత్రులు పాల్గొన్నారు.

ఉగ్రవాదానికి కాంగ్రెస్ వెన్నుదన్ను

ఉగ్రవాదుల ముందు ఆ పార్టీ సాగిలపడుతోంది

'ద కేరళ స్టోరీ'ని నిషేధించేందుకు ప్రయత్నిస్తోంది

ముష్కరులతో తెరవెనుక బేరసారాలు సాగిస్తోంది

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం



సాక్షి, బళ్లారి/తుమకూరు: ప్రతిపక్ష కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి విరుచుకుపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆ పార్టీ ఉగ్రవాదానికి అండగా నిలుస్తోందని మండిపడ్డారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడమే కాదు, వారి ముందు సాగిలపడుతోందని ఆరోపించారు. కర్ణాటకలోని బళ్లారిలో శుక్రవారం ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'ద కేరళ స్టోరీ' చిత్రం గురించి ప్రస్తావించారు. సుందరమైన రాష్ట్రంలో జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు దర్శక నిర్మాతలు చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ మాత్రం ఈ చిత్రాన్ని నిషేధించేందుకు ప్రయత్నిస్తోందని ఆక్షేపించారు. కేరళలో చోటుచేసుకున్న ఉగ్ర కుట్రలను 'ద కేరళ స్టోరీ' చిత్రం బట్టబయలు చేస్తోందని ప్రశంసించారు. కేవలం ఒక రాష్ట్రంలో ముష్కర మూకల ఆగడాలు, మోసపూరిత విధానాలపై ఈ చిత్రం నిర్మించారని పేర్కొన్నారు. దేశాన్ని నాశనం చేసే ఉగ్రవాదానికి కాంగ్రెస్ అండగా నిలుస్తుండడం నిజంగా దురదృష్టకరమని చెప్పారు. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నవారికి ఆ పార్టీ వత్తాసు పలుకుతోందని, వారితో తెరవెనుక రాజకీయ బేరసారాలు కొనసాగిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అసలు నైజం ఏమిటో కర్ణాటక ప్రజలు తెలుసుకోవాలని కోరారు. కర్ణాటకను దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా మార్చాలంటే ఇక్కడ శాంతి భద్రతలు చాలా ముఖ్యమని ప్రధాని మోదీ చెప్పారు. ఉగ్రవాద రహిత రాష్ట్రంగా ఉండడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకున్నప్పుడల్లా కాంగ్రెస్ పార్టీకి కడుపు నొప్పి వస్తుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఘన విజయం సాధించబోతున్నామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం తుమకూరులో భారీ రోడ్డు షోలో పాల్గొన్నారు.

ఆ కుట్ర శబ్దాలు వినిపించవు

మారుతున్న కాలానికి తగ్గట్టుగా ఉగ్రవాదం కూడా స్వభావం మార్చుకుంటోందని, స్మగ్లింగ్, డ్రగ్స్ వ్యాపారం, మత ఘర్షణలకు ఉగ్రవాదంతో సంబంధం ఉంటోందని మోదీ గుర్తుచేశారు. గత కొన్నేళ్లలో కొత్తరకం ఉగ్రవాదం పుట్టుకొచ్చిందన్నారు. ఈ ఉగ్రవాదంలో సమాజాన్ని గుల్లబార్చే కుట్రల శబ్దాలు వినిపించవని చెప్పారు. నిశ్శబ్దంగానే కార్యకలాపాలు సాగిపోతుంటాయని, దీనిపై కోర్టులు కూడా ఆందోళన చెందుతున్నాయని పేర్కొన్నారు.

కాక రేపుతున్న 'ది కేరళ స్టోరీ'



కొచ్చిన్/బళ్లారి/న్యూఢిల్లీ: బహుభాషా చిత్రం 'ది కేరళ స్టోరీ' దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బలవంత మతమార్పిడికి గురై, ఐసిస్‌లో చేరిన కొందరు మహిళలే ఈ సినిమా ఇతివృత్తం. వారం క్రితం సినిమా ట్రయిలర్ రిలీజ్ నాటి నుంచే వివాదం రేగుతోంది. సుదీప్తో సేన్ దర్శకత్వం, విపుల్ షా నిర్మాతగా ఆదా శర్మ ప్రధాన పాత్రలో నటించిన ఈ శుక్రవారం రిలీజైంది. ఈ సినిమాపై ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఒక వర్గాన్ని కించపరిచేలా ఉన్న ఈ సినిమాపై నిషేధం విధించాలంటూ కేరళ, తమిళనాడుల్లోని కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు కూడా జరిగాయి. కర్ణాటకలోని బళ్లారి ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ సైతం ఈ సినిమా గురించి ప్రస్తావించడం విశేషం.

స్టేకు కేరళ హైకోర్టు నో

'ది కేరళ స్టోరీ' విడుదలపై స్టే విధించేందుకు కేరళ హైకోర్టు నిరాకరించింది. సినిమా ట్రయిలర్ ఒక వర్గానికి వ్యతిరేకంగా లేదని పేర్కొంది. 'ది కేరళ స్టోరీ'లో కొన్ని అంశాలను చిత్రంలో తప్పుగా చిత్రీకరించారని, కేరళ ప్రతిష్టకు దెబ్బతీసేలా ఉన్నందున విడుదలను అడ్డుకోవాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. 'సన్యాసులు, క్రిస్టియన్ పూజారులు, ఇతరులను కూడా చెడ్డవారిగా చూపించిన ఘటనలు సినిమాల్లో అనేకం ఉన్నాయి. కొందరు మతబోధకులను చెడుగా చూపారనే కారణంతో సినిమాను నిషేధించలేం'అని పేర్కొంది.

గర్భస్థ శిశువు మెదడుకు శస్త్రచికిత్స

ప్రపంచంలో మొట్టమొదటి సర్జరీ

బోస్టన్: అమెరికాలోని బోస్టన్ నగరంలో వైద్యులు అరుదైన ఘనత సాధించారు. వైద్య రంగంలోనే అద్భుతాన్ని సృష్టించారు. తల్లిగర్భంలో ఉన్న 34 వారాల శిశువు(పిండం)కు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. శిశువు మెదడులో అపసవ్యంగా ఉన్న రక్తనాళాన్ని సర్జరీతో సరిచేశారు. ప్రపంచంలో ఈ తరహా సర్జరీ చేయడం ఇదే ప్రథమం. బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్, బ్రిఘామ్, ఉమెన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ సర్జరీ జరిగింది. గర్భస్థ శిశువుల్లో అరుదుగా తలెత్తే ఈ వైకల్యాన్ని 'వీనస్ ఆఫ్ గాలెన్ మాల్‌ఫార్మేషన్' అంటారు. ఇలాంటి వైకల్యంతో జన్మించే శిశువులు మెదడులో గాయాలు, గుండె వైఫల్యం వంటి కారణాలతో మరణించే అవకాశం ఉంటుందని బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ రేడియాలజిస్ట్ డాక్టర్ డారెన్ ఒర్బాచ్ చెప్పారు. మెదడు నుంచి గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళం అపసవ్యంగా ఏర్పడడమే గాలెన్ మాల్‌ఫార్మేషన్. దీనివల్ల రక్త ప్రవాహం నెమ్మదిస్తుంది. ఫలితంగా రక్త పీడనం ఎక్కువై సిరలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సిరలలో ఒత్తిడి కారణంగా మెదడు పెరుగుదల మందగిస్తుంది. కణజాలాలు దెబ్బతింటాయి. అంతేకాకుండా గుండె పనితీరు కూడా దెబ్బతినవచ్చు. గాలెన్ మాల్‌ఫార్మేషన్‌తో బాధపడుతున్న గర్భస్థ శిశువుల్లో 50 నుంచి 60 శాతం మంది పుట్టిన వెంటనే ఆరోగ్యం విషమిస్తుందని, వారు బతికే అవకాశాలు కేవలం 40 శాతం ఉంటాయని డారెన్ ఒర్బాచ్ వెల్లడించారు.

సెర్బియాలో కాల్పులు.. 8 మంది మృతి

బెల్‌గ్రేడ్: సెర్బియాలో మరోసారి కాల్పుల కలకలం రేగింది. తుపాకీ పట్టుకున్న ఒక దుండగుడు కదులుతున్న కారులోంచి విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని బెల్‌గ్రేడ్‌కు దక్షిణంగా కారులో ప్రయాణిస్తూ మూడు గ్రామాల పరిధిలో ఆటోమేటెడ్ గన్‌తో అతను ఇష్టారాజ్యంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించగా, మరో 14 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం నిందితుడ్ని అదుపులోనికి తీసుకుంది. ఆ వ్యక్తి ధరించిన నీలం రంగు టీ షర్ట్‌పై నాజీల అనుకూల నినాదాలు ఉన్నాయి. అయితే అతను ఎందుకు ఈ కాల్పులు జరిపాడో ఇంకా తెలియాల్సి ఉంది. స్కూలు విద్యార్థి జరిపిన కాల్పుల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగిన రెండు రోజులకే మరొకటి జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు.

మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

ఇంఫాల్: మణిపూర్‌లో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. గత రెండు రోజులుగా మైతీలు, గిరిజనులకు మధ్య నెలకొన్న ఘర్షణలతో అట్టుడికిపోయిన ఇంఫాల్‌లో ఇంకా సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. దీంతో ప్రభుత్వం ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచి అదనపు బలగాలను రంగంలోకి దింపింది. కొన్ని జిల్లాల్లో నిరసనకారులకి, భద్రతా దళాలకు మధ్య కాల్పులు ఘటనలు చోటు చేసుకున్నాయి. పలు జిల్లాల్లో నిరసనకారుల్ని అదుపు చేయడానికి కాల్పులు జరపాల్సిన పరిస్థితి వచ్చిందని పోలీసులు తెలిపారు. శుక్రవారం కేంద్రం మరో 20 కంపెనీల సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ దళాల్ని పంపింది. మరోవైపు రైల్వే శాఖ ముందు జాగ్రత్త చర్యగా ఈశాన్య రాష్ట్రాల్లో తిరిగే పలు రైళ్లను రద్దు చేసింది.

రష్యా ప్రతినిధిపై ఉక్రెయిన్ ఎంపీ దాడి

అంకారా: రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం నడుస్తూ ఉంటే అంతర్జాతీయ వేదికలపై ఆయా దేశాల ప్రతినిధులు బాహాబాహీకి దిగుతున్నారు. తుర్కియేలోని అంకారాలో జరిగిన సదస్సులో ఉక్రెయిన్ జెండాపై మొదలైన గొడవ చివరికి రష్యా ప్రతినిధిపై దాడి చేసేవరకు వెళ్లింది. అంకారాలో జరిగిన బ్లాక్ సీ ఎకనామిక్ కోపరేషన్ (బీఎస్ఈసీ) 61వ సదస్సులో ఉక్రెయిన్ ఎంపీ ఒలెస్కాండర్ మారికోవస్కీ తమ జాతీయ జెండాను ప్రదర్శించారు. రష్యా ప్రతినిధి ఆ ఒలెస్కాండర్ చేతిలో జెండాను బలవంతంగా లాక్కొని దూరంగా లాక్కొని వెళుతూ కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన ఎంపీ ఆ రష్యా ప్రతినిధిపై దూసుకెళ్లి భౌతిక దాడికి పాల్పడ్డారు. ఆయన ముఖంపై పిడిగుద్దులు కురిపించి జెండాను తిరిగి లాక్కున్నారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 6 । మే । 2023



కాచిగూడలో చార్జింగ్ పాయింట్లు

కాచిగూడ: కాచిగూడ రైల్వే స్టేషన్ ఆవరణలో విద్యుత్ వాహనాల చార్జింగ్ పాయింట్లను శుక్రవారం కాచిగూడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ బాలాజీ ప్రారంభించారు. ఏకకాలంలో ఆరు వాహనాలను చార్జింగ్ చేసుకోవచ్చన్నారు.



ప్రారంభానికి 'స్కైవాక్' సిద్ధం

ఉప్పల్: హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో నిర్మిస్తున్న స్కైవాక్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ప్రారంభానికి ఒకటి రెండు రోజుల్లో మూహుర్తం ఖరారు కానుంది.

-8లో

శ్రీశైలం వెళ్లే భక్తులకు బస్సులు ఇలా

అఫ్జల్‌గంజ్: శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్సుల సమయాలను క్రమబద్ధీకరించామని టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి 20, 30 నిమిషాలకో బస్సును అందుబాటులో ఉంచామని, ఎంజీబీఎస్ నుంచి మొదటి సర్వీసు ఉదయం 3.30 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11.45 గంటలకు ఉంటాయని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రాణం తీసిన ఇన్‌స్టా రీల్ సరదా

- రైలు ఢీకొని యువకుడి మృతి

సనత్‌నగర్:

సోషల్ మీడియా మోజు యువత ప్రాణాల మీదకు తెస్తోంది. లైక్స్, వ్యూస్, సబ్‌స్క్రైబర్స్, ఫాలోవర్స్ తదితర వాటికోసం తహతహలాడుతున్న యువత హద్దులు దాటి ఫీట్స్ చేస్తున్నారు.

ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిలిస్తున్నారు. భవనాలపై సెల్ఫీలు, బైక్‌లపై ఫీట్స్, చెరువులు, రిజర్వాయర్ల వద్ద రీల్స్, ప్రమాదకరమైన చోట్ల షార్ట్ వీడియో షూటింగ్‌లతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నా తీరుమార్చుకోవడం లేదు.

గతంలో ఎన్నో ఘటనలు చోటుచేసుకున్నా.. వాటిని సోషల్ మీడియాలో చూస్తున్నా యువతలో ఎలాంటి మార్పు రావడం లేదు. రైల్వే ట్రాక్ పక్కన నడుస్తూ ఇన్‌స్టా రీల్ షూట్ చేస్తున్న ఓ బాలుడిని ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటన సనత్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్ ప్రాంతంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ సాదిక్ కుమారుడు మహ్మద్ సర్ఫరాజ్(16) స్థానిక మదర్సాలో ఇస్లామిక్ చదువుకుంటున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో అకౌంట్ ఉన్న బాలుడు తన స్నేహితులు అంజద్, అహ్మద్‌తో కలిసి తరచూ రీల్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటాడు. తన ఇద్దరు మిత్రులతో కలిసి సనత్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ట్రాక్ వెంట నడుస్తున్న సన్నివేశాన్ని తన మిత్రులు సెల్‌ఫోన్‌లో షూట్ చేయిస్తున్నాడు. లింగంపల్లి నుంచి సనత్‌నగర్ వైపు వస్తున్న ఎంఎంటీఎస్ దగ్గరకు వస్తున్నా ట్రాక్‌పై నుంచి పక్కకు జరగకపోవడంతో రైలు ఢీకొనడంతో మృత్యువాతపడ్డాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.



మహ్మద్ సర్ఫరాజ్ (ఫైల్)



నార్సింగిలో నిర్మించనున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్ నమూనా

రాష్ట్రానికే తలమానికం.. హెరిటేజ్ టవర్



400 అడుగుల ఎత్తు

- రూ.200 కోట్లతో నిర్మాణం
- 8న సీఎం కేసీఆర్ భూమి పూజ



మాట్లాడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

మణికొండ: మన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాల శిల్ప సౌందర్యాలను మోడ్రన్ పద్ధతిలో ప్రపంచానికి తెలియజేసేందుకు ఉద్దేశంతో నగర శివారు నార్సింగిలో హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌ను నిర్మిస్తున్నామని, అది రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తుందని హరేకృష్ణ మూవ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ శ్రీకృష్ణ గోశాల వారు జీవితకాల దానంగా ఇచ్చిన 6 ఎకరాల స్థలంలో రూ.200 కోట్లతో 400 అడుగుల ఎత్తు దేవాలయం నిర్మాణం అవుతుందన్నారు. తిరుమల దేవాలయ గెటప్‌తో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, మధుర, బృందావనం గెటప్‌తో శ్రీకృష్ణదేవాలయం నిర్మాణం అవుతుందన్నారు. మ్యూజియం, లైబ్రరీ, థియేటర్లతో పాటూ దేవాలయాల్లో జరిగే పూజలు ఆలయ టవర్‌పై లైవ్ ప్రదర్శన ఉంటుందన్నారు. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వచ్చే పర్యాటకులకు ఓ కేంద్రంగా ఇది నిలుస్తుందన్నారు. ఐదేళ్లలో నిర్మాణ పనులు పూర్తవుతాయని, సీఎం కేసీఆర్ చేతులమీదుగా ఈనెల 8న ఉదయం 11.30గంటలకు ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరుగుతుందని ఆయన తెలిపారు.

ముగ్గురిని బలిగొన్న ఓవర్‌టేక్!

- లారీ దాటే క్రమంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో
- అక్కడికక్కడే దంపతులు మృతి
- ఆస్పత్రిలో కూతురు మృతి.. తల్లి పరిస్థితి విషమం
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఏడుపాయల నుంచి తిరిగివస్తుండగా ఘటన
- మృతులది జీడిమెట్లలోని సూరారం





నాగలింగరాజు, రమ మృతదేహాలు



మరణించిన వైశాలి (ఫైల్)



ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో

కౌడిపల్లి(నర్సాపూర్): ఓవర్ టేక్ దంపతులతోపాటు ఓ బాలిక ప్రాణం తీయగా, మరో ఐదుగురిని గాయాలపాలు చేసింది. దైవదర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వస్తుండగా, పెను విషాదం చోటుచేసుకుంది. ఆటోడ్రైవర్ కుటుంబం చిన్నాభిన్నమైంది. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జీడిమెట్ల సూరారం సాయిబాబానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సప్పిడి నాగలింగరాజు(36), అతని భార్య రమ(33) వీరి పిల్లలు ధరణి, వెంకటలక్ష్మి, అమృతతోపాటు పక్కింటి బత్తిని లత, ఆమె కూతుళ్లు వైశాలి (16), అవంతిక ట్రాలీ ఆటోలో గురువారం ఏడుపాయల వనదుర్గ ఆలయానికి వచ్చారు. రాత్రి అక్కడే ఉండి శుక్రవారం మధ్యాహ్నం తిరుగుప్రయాణం అయ్యారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్‌గేట్ సమీపంలోకి రాగానే ఆటో నడుపుతున్న నాగలింగరాజు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఎదురుగా మెదక్ డిపోనకు చెందిన పల్లెవెలుగు బస్సు నర్సాపూర్ నుంచి మెదక్‌వైపు వస్తుండగా, ఆటో బస్సును ఢీకొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ నాగలింగరాజు, అతని భార్య రమకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వీరి పిల్లలు ధరణి, వెంకటలక్ష్మి, అమృతతో పాటు పక్కింటి బత్తిని లత, ఆమె కూతుళ్లు వైశాలి, అవంతికకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అయితే వీరిలో బత్తిని లత ఆమె కూతురు వైశాలి పరిస్థితి విషమంగా ఉండగా, హైదరాబాద్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైశాలి మృతి చెందింది. మృతులు ప్లాస్టిక్ సంచులు కుడుతూ జీవనం సాగిస్తున్నారు.



గాయపడిన బత్తిని లత



నాగలింగరాజు కుటుంబ సభ్యులు (ఫైల్)

జేసీబీ సాయంతో మృతదేహం వెలికితీత

ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొనడంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అందులోనే ఆటోడ్రైవర్ నాగలింగరాజు మృతదేహం ఇరుక్కుపోయింది. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదార్, ఎస్‌ఐ శివప్రసాద్ రెడ్డి సందర్శించారు. మృతదేహాన్ని జేసీబీ సాయంతో ఆటోలో నుంచి బయటకు తీశారు.

ప్రమాద వివరాలు తెలుసుకున్న సునీతారెడ్డి..

అటుగా వెళుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి డీఎస్పీని అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పాతబస్తీ.. రోగాలతో కుస్తీ..



దీర్ఘకాలిక వ్యాధుల్లో 50 శాతానికి పైగా పాతబస్తీలోనే..

నగరంలో పాతబస్తీ రోగాలతో కుస్తీ పడుతోంది. ప్రభుత్వ వైద్య సేవలు విస్తరిస్తున్నా.. ప్రైవేటుపైనే సగటు రోగి ఆసక్తి చూపిస్తుండటంతో అది ఆర్థిక సమస్యలకు దారి తీస్తోంది. ఈ విషయాలు నగరానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ సర్వేలో వెల్లడయ్యాయి. - సాక్షి, సిటీబ్యూరో

- ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే చికిత్సకు మొగ్గు
- స్వచ్ఛమైన నీటి లభ్యతలో ఇబ్బందులు
- హెచ్‌హెచ్‌ఎఫ్ సర్వేలో పలు అంశాలు వెల్లడి

సామాజిక–ఆర్థిక స్థితిపై కోవిడ్ అనంతర ప్రభావాన్ని అధ్యయనం చేయడమే లక్ష్యంగా పాత నగరంలోని కొన్ని పట్టణ మురికివాడలు నదీ పరివాహక ప్రాంతాల్లో నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్(హెచ్‌హెచ్‌ఎఫ్) సర్వే తేల్చింది. రాష్ట్రంలోని అన్ని దీర్ఘకాలిక వ్యాధుల్లో 33% హైదరాబాద్‌లో నమోదవగా, వీటిలో 50% కంటే ఎక్కువ పాతనగర ప్రాంతాల్లోనే నమోదవుతున్నాయని ఈ పోస్ట్ కోవిడ్ సర్వే వెల్లడించింది.

దీర్ఘకాలిక వ్యాధులతో సతమతం..

పాతబస్తీని సుస్తీకి చిరునామాగా మారుస్తున్న దీర్ఘకాలిక వ్యాధుల జాబితాలో మధుమేహం, రక్తపోటు, కరోనరీ ఆర్టరీ వ్యాధులు అగ్రస్థానంలో ఉన్నాయని సర్వే వెల్లడించింది. దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న 72% మంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే చికిత్సకు మొగ్గు చూపుతున్నారని, ఇది రోగుల కుటుంబంపై భారీ భారాన్ని మోపుతోందని స్పష్టం చేసింది. దాదాపు 50% మురికివాడలు పారిశుద్ధ్య లోపం, అపరిశుభ్రత, స్వచ్ఛమైన నీటి లభ్యత లోపాలతో ఇబ్బందులు పడుతుండటం ఇప్పటికీ కనిపిస్తోందని, అర్హత లేని వైద్యులు, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో ఆధిపత్యం చెలాయిస్తున్నారని వెల్లడించింది. తద్వారా రోగుల జేబులకు చిల్లు పడుతోంది. సర్వే చేసిన పిల్లల్లో 58% మంది టీకాలు వేసుకున్నట్లు తేలగా అందులో 74% టీకాలు ప్రైవేట్, 20% మాత్రమే ప్రభుత్వ కేంద్రంలో టీకాలు తీసుకున్నట్లు వెల్లడవడం గమనార్హం.



వైద్య సేవలు మెరుగుపర్చాలి..

ఉచిత పాఠశాలలు, కళాశాలలు, క్లినిక్‌లు, ఆస్పత్రులను నిర్మించాల్సిన అవసరం ఉంది. సమాజ శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడం ప్రభుత్వం, పౌర సమాజం పౌరుల బాధ్యత' అని హెచ్‌హెచ్‌ఎఫ్‌కి చెందిన ముజ్తబా హసన్ అస్కారీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ సర్వే కోసం హకీంపేట్, గోల్కొండ, చింతల్‌మెట్, తీగల్‌కుంట, హషీమాబాద్, ఆసిఫ్‌నగర్, చంచల్‌గూడ, షాహీన్‌నగర్‌తో సహా హైదరాబాద్‌లోని వివిధ మురికివాడల్లో అధ్యయనం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అత్యధిక జనాభా కలిగిన మొత్తం 1,394 నోటిఫైడ్ మురికివాడలను, 200 నాన్–నోటిఫైడ్ మురికివాడలను సర్వే గుర్తించింది.

అట్టడుగుకు వైద్య సేవలు చేరాలి..



కొంతకాలంగా మేం ఈ ప్రాంతాల్లో వైద్యసేవలు అవసరమైన వారికి చేయూత అందిస్తున్నాం. అందులో భాగంగానే ఈ సర్వే నిర్వహించాం. నగరంలో పాతబస్తీలో వైద్య సేవల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. దీర్ఘకాలిక రోగాలు పేదల్ని మరింత పేదలుగా మారుస్తున్నాయి. దీన్ని సరిదిద్దడానికి మరింత గట్టిగా కృషి చేయాల్సి ఉంది.

– ముజ్తాబా అస్కారీ, వ్యవస్థాపక ట్రస్టీ, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్

అత్యవసరమైతేనే సైరన్ వాడండి



మాట్లాడుతున్న నార్త్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

అంబులెన్స్‌ల వ్యవహారంపై ట్రాఫిక్ పోలీసుల నజర్

- అతిక్రమించిన డ్రైవర్లపై చర్యలతో పాటు కేసులు
- స్పష్టం చేసిన నార్త్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే
- సమన్వయం కోసం ప్రత్యేక నంబర్లు 87126 60600, 90102 03626

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సంచరిస్తున్న అంబులెన్స్‌ల కారణంగా సాధారణ వాహనచోదకులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అత్యవసరమైన పేషెంట్లను తరలిస్తున్నవి మాత్రమే సైరన్ వినియోగించేలా ఆదేశాలు జారీ చేశారు. వీటిని అతిక్రమించిన వారిపై చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో అంబులెన్స్ అసోసియేషన్లు, ఆస్పత్రుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అత్యవసర పేషెంట్లను తీసుకువెళ్లే అంబులెన్స్‌లకు ఎలాంటి అవాంతరాలు లేకుండా గమ్యస్థానాలకు చేర్చడానికి ప్రత్యేక ఫోన్ నంబర్‌తో ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో(టీసీసీసీ) స్పెషల్ సెల్ అందుబాటులోకి తెచ్చినట్లు వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ సైరన్లు వేసుకుని ఇష్టానుసారం దూసుకుపోతున్న అంబులెన్స్‌ల వ్యవహారంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టారు. దీనికోసం రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు నిర్వహించిన తనిఖీల్లో అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. అత్యవసరం కాని వాహనాలు, ఖాళీగా వెళ్తున్న అంబులెన్స్‌లతో పాటు మృతదేహాలను తరలిస్తున్న సమయంలోనూ కొన్ని అంబులెన్స్ లైట్లు, సైరన్‌లతో హడావుడి చేస్తూ ఇతర వాహనచోదకులకు ఇబ్బంది కలిగిస్తున్నాయని తేల్చారు. అనేక అంబులెన్స్‌లకు సరైన పత్రాలు, అనుమతులు లేవని, కొందరు డ్రైవర్లు మద్యం మత్తులో ఉంటున్నారని వెలుగులోకి వచ్చింది. దీంతో సిటీలో సంచరిస్తున్న అంబులెన్స్‌లకు 'గ్రీన్ ఛానల్' ఇవ్వడంపై ఓ విధానానికి రూపకల్పన చేశారు. ఆ అంశాలను రాహుల్ హెగ్డే ఈ సమావేశంలో ఆయా ప్రతినిధులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లోనే ఉన్న పేషెంట్లను తరలించడానికి ప్రత్యేకంగా ఓ సెల్ ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో పని చేసే దీనికోసం ప్రత్యేక సెల్‌ఫోన్ నంబర్ 8712660600 కేటాయించారు. అత్యవసర పేషెంట్లను తరలిస్తున్న లేదా వారి కోసం వెళ్తున్న అంబులెన్స్‌ల వివరాలను ఆస్పత్రులు లేదా నిర్వాహకులు ఈ సెల్‌తో పాటు ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ ఫోన్: 9010203626కు అందించాలని కోరారు. ఆస్పత్రుల నుంచి అందే వివరాల ఆధారంగా ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ ప్రయాణించే రూట్‌లోని జంక్షన్లను అప్రమత్తం చేస్తూ దాని ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడనున్నారు. ట్రాఫిక్ అదనపు డీసీపీ ఎస్.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బల్క్ వేస్ట్‌పై బల్దియా నిర్లక్ష్యం

ఇళ్లనుంచి చెత్త సేకరించాల్సిన వాహనాలు ఫంక్షన్ హాళ్లకు..

- ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- 'సాక్షి' కథనంతో సీఎస్ ఆదేశాలు
- పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

'చెత్తపై చిత్తమేదీ?'

రెండు నెలల క్రితం 'చెత్తపై చిత్తమేదీ?' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనంతో నగరంలో చెత్త తరలింపు, తదితర అంశాలపై నివేదిక అందజేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీహెచ్ఎంసీని ఆదేశించగా, చెత్త తరలింపు కోసం కొన్ని కార్యక్రమాలు ఆరంభించి.. అమలు చేస్తున్నట్లు ఇటీవల నివేదిక పంపినట్లు తెలిసింది. స్వచ్ఛ ఆటోలన్నీ సవ్యంగానే పనిచేస్తున్నాయని, ఎక్కడికక్కడ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపినట్లు సమాచారం.

సాక్షి, సిటీబ్యూరో: ఇంటింటి నుంచి చెత్త తరలింపుతో పాటు రోడ్ల వెంబడి చెత్తకుప్పల తొలగింపు, బల్క్ గార్బేజీ తరలింపునకు పకడ్బందీగా నిబంధనల అమలు వంటివి బల్దియా కాగితాల్లో తప్ప అమలు కావడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా బల్క్ గార్బేజీని తరలించే వారిపై చట్టం మేరకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించిన జీహెచ్ఎంసీ.. చర్యలు తీసుకోలేక చతికిల పడింది. ఇప్పటికీ పలు హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, పెద్దపెద్ద కంపెనీల నుంచి వెలువడే వ్యర్థాలను జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటోలే తరలిస్తున్నాయి. ఇళ్ల నుంచి చెత్త సేకరించాల్సిన స్వచ్ఛ ఆటోలు బల్క్‌గార్బేజీని తరలించే వీల్లేనప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. రోజుకు వంద టన్నుల కంటే ఎక్కువ వ్యర్థాల్ని వెలువరిస్తే బల్క్‌గార్బేజీగా వ్యవహరిస్తారు. బల్క్‌గార్బేజీని తరలించే ఏజెన్సీగా జీహెచ్ఎంసీ 'హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ లిమిటెడ్'ను ఎంపిక చేసింది. బల్క్ గార్బేజీ తరలించేందుకు కేజీకి రూ.2.90 యూజర్ చార్జీగా నిర్ణయించింది. పలు కంపెనీలు, హోటళ్లు సదరు ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ, ఏజెన్సీకి చెత్త ఇవ్వకుండా స్వచ్ఛ ఆటోల కార్మికులు అడ్డుపడుతున్నారు. వాహనాలు బయటకు వెళ్లకుండా రోడ్లపై అడ్డంగా ఉంటూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాల్సిన జీహెచ్ఎంసీ యంత్రాంగం చోద్యం చూస్తోంది.

పేర్లే మార్పు..

ఇటీవలి కాలంలోనే చెత్త సమస్యల పరిష్కారానికి కొన్ని కార్యక్రమాలు చేపట్టారు. వివిధ సమస్యలతో పాటు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి మునిసిపల్ శాఖ ఆదేశాల మేరకు 'కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. మరోవైపు వంద రోజుల యాక్షన్ ప్లాన్ పేరిట మరో కార్యక్రమాన్ని చేపట్టారు. అవి అలా ఉండగానే మళ్లీ కొత్తగా ఇంటెన్సివ్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పేరిట మరో కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. అన్నింటి లక్ష్యం ఒక్కటే. చెత్త సమస్యలుండరాదు. చెత్తకుప్పలు పోగుపడుతున్న గార్బేజీ వల్నరబుల్ పాయింట్స్(జీవీపీ) తొలగించాలి. బల్క్ గార్బేజీ ఉత్పత్తి చేసే వారు స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వరాదు.. ఇలా పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ఉద్దేశించినవే. కానీ.. వందరోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభమైందని ఒక స్థాయిలోని వారంటే.. ఇంకా ప్రారంభం కాలేదని మరోస్థాయిలోని వారు చెబుతున్నారు. వివిధ కార్యాలయాలు, అధికారుల మధ్య సమన్వయ లోపానికి ఇదొక మచ్చుతునక. గతంలో 1,104 జీవీపీలుండగా, ప్రస్తుతం 2,451కు చేరాయి. వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వాటిల్లో ఎన్నింటిని పరిష్కరించారంటే సరైన సమాచారం ఇచ్చేవారు లేరు. ప్రభుత్వం నుంచి తీవ్ర హెచ్చరికల నేపథ్యంలో ఇటీవల స్థానిక డిప్యూటీ కమిషనర్లు, ఇతరత్రా అధికారులు తెల్లవారుజామున 4 గంటల నుంచే క్షేత్రస్థాయిలో ఉండాలని కమిషనర్ ఆదేశించినట్లు తెలిసింది. ఏం చేసినా.. ఎప్పటిలోగా చెత్త సమస్యలు తీరతాయో వేచి చూడాల్సిందే.





బ్యాగుల్లో సిద్ధంగా ఉన్న బల్క్ గార్బేజీ.. ఏజెన్సీ ద్వారా తరలించకుండా రోడ్డుపై స్వచ్ఛ ఆటోల కార్మికులు

కాగితాల్లో చర్యలు..

పారిశుద్ధ్యం మెరుగయ్యేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు కాగితాల్లో పేర్కొన్నప్పటికీ, వాస్తవంగా అమలు కావడం లేదు. వాటిల్లో మచ్చుకు కొన్ని..

- స్వచ్ఛ ఆటోలు వెళ్లాల్సిన నిర్దేశిత ప్రాంతాల్లోని ఇళ్లకే వెళ్లాలి. కానీ.. బల్క్ గార్బేజీని తరలిస్తున్నాయి.
- బల్క్ గార్బేజీ వెలువడే సంస్థల్ని గుర్తించి సంబంధిత ఏజెన్సీ ద్వారానే తరలించాలి.
- వార్డులో ఏదైనా గోడపై కానీ, బోర్డు మీద కానీ వార్డు మ్యాప్‌తోపాటు స్వచ్ఛ ఆటోలు ఆయా ప్రాంతాల్లో చెత్త తరలించాల్సిన సమయం, సమస్యలుంటే ఫిర్యాదు చేయాల్సిన ఫోన్ నంబర్ ఉండాలి. ఫిర్యాదుల పరిష్కారంపై వారం వారం సమీక్షలుండాలి.
- జీవీపీల్లో చెత్త తొలగించి పార్కులు, పార్కింగ్ ప్రదేశాలు వంటి వాటిగా తీర్చిదిద్దాలి.
- వీక్లీ మార్కెట్లు, స్ట్రీట్‌వెండింగ్ జోన్లలో చెత్త వేయకుండా వ్యాపారులకు తగిన అవగాహన కల్పించాలి. చెత్తను డబ్బాల్లోనే వేసే ఏర్పాట్లుండాలి. డబ్బాల్లోని చెత్తను ఏరోజుకారోజు పూర్తిగా తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

4 నెలలు.. రూ.3.2 కోట్లు!

- 'నిషా'చరులు చెల్లించిన జరిమానా మొత్తం ఇది
- ఈ ఏడాది జనవరి–ఏప్రిల్ మధ్య 13,429 కేసులు
- తీవ్రమైన ఉల్లంఘనలపై లక్షకు పైగా చలాన్లు జారీ
- వివరాలు వెల్లడించిన ట్రాఫిక్ చీఫ్ సుధీర్‌బాబు





సాక్షి, సిటీబ్యూరో: వాహనచోదకుడితో పాటు ఎదుటి వారిగా ముప్పుగా మారే ప్రమాదం ఉన్న తీవ్రమైన ఉల్లంఘనలపై నగర ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. రాజధానిలో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. వీటిలో భాగంగా ఈ ఏడాది జనవరి–ఏప్రిల్ మధ్య ట్రాఫిక్ వింగ్ చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 13429 మంది మందుబాబులు చిక్కినట్లు, వీరికి కోర్టు రూ. 3,21,39,060 ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు శుక్రవారం వెల్లడించారు. దీంతో పాటు తీవ్రమైన ఉల్లంఘనలపై చేపట్టిన చర్యలు, ఆపరేషన్ రోప్‌నకు సంబంధించిన ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

ఓపక్క జైలు మరోపక్క జరిమానా...

నగరంలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలకు మద్యం తాగి వాహనాలు నడపటం కూడా ఓ కారణమే. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ఉన్నతాధికారులు డ్రంక్ డ్రైవింగ్‌పై దాదాపు ప్రతి రాత్రీ స్పెషల్ డ్రైవ్స్ చేస్తున్నారు. వీటిలో గత నెల్లోనే 2687 కేసులు నమోదు కాగా... ఈ ఏడాదిలో ఏప్రిల్ వరకు 13429 కేసులు నమోదయ్యాయి. వీరిపై ట్రాఫిక్ పోలీసులు న్యాయస్థానంలో చార్జ్‌షీట్స్ దాఖలు చేశారు. మద్యం తీసుకున్న మోతాదు, నడిపిన వాహనం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న కోర్టు 1317 మందికి జైలు శిక్ష, జరిమానా, మిగిలిన వారికి జరిమానా విధించింది. ఇలా మొత్తమ్మీద మందుబాబులు రూ. 3.2 కోట్లు జరిమానాగా కట్టారు. వీరిలో 243 మంది డ్రైవింగ్ లైసెన్సులను కోర్టు సస్పెండ్ చేసింది. ఇలా జైలు శిక్షలు పడిన వారికి భవిష్యత్తులో పాస్‌పోర్టు, ప్రభుత్వ ఉద్యోగాలు రావడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

మరికొన్ని తీవ్రమైన ఉల్లంఘనల పైనా...

ట్రాఫిక్ విభాగం అధికారులు డ్రంక్ డ్రైవింగ్‌తో పాటు మరికొన్ని ప్రమాదకరమైన, తీవ్రమైన ఉల్లంఘనల పైనా దృష్టి పెట్టారు. వాహనచోదకులతో పాటు పాదచారుల భద్రతకు పెద్దపీట వేస్తూ వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో పాటు ఎనిమిది రకాలైన వాటిపై దృష్టి పెట్టారు. భారీ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులనూ పరిగణలోకి తీసుకున్న అధికారులు స్పెషల్ డ్రైవ్స్ చేస్తున్నారు. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై 2,30,974, ట్రిపుల్ రైడింగ్‌పై 51,383, ఆర్టీసీ బస్సులపై 8587, హెవీ వాహనాలపై 7841 చలాన్లు జారీ చేశారు. మరోపక్క నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న, నిబంధనలకు భిన్నంగా కలిగి ఉన్న 42,273 వాహనాలపై చలాన్లు విధించిన ట్రాఫిక్ పోలీసులు 282 వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. అద్దాలపై బ్లాక్ ఫిల్ములున్న 9199 కార్లు, అక్రమంగా సైరన్లు వినియోగిస్తున్న 1600 వాహనాలపై చర్యలు తీసుకున్నారు.

కొనసాగుతున్న ఆపరేషన్ రోప్...

రహదారులపై ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, ఫ్రీలెఫ్ట్ నిబంధనను అతిక్రమించడంతో పాటు వివిధ రకాలైన ఉల్లంఘనలపై ట్రాఫిక్ విభాగం ఆపరేషన్ రోప్ (రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోజ్‌మెంట్స్) చేపట్టింది. ఇందులో భాగంగా ట్రాఫిక్ విభాగం అధికారులు ఏప్రిల్ వరకు స్టాప్‌లైన్ క్రాసింగ్‌పై 1,89,214, ఫ్రీలెఫ్ట్ బ్లాకింగ్‌పై 37,093 చలాన్లు జారీ చేశారు. రహదారులపై, క్యారేజ్ వేల్లో ఆపిన 21228 వాహనాలకు వీల్ క్లాంప్స్ వేసి జరిమానా విధించారు. ఇతర ఉల్లంఘనలపై 82,719 చలాన్లు విధించారు. గతంలో జరిమానాలు విధించినా ఫుట్‌పాత్ ఆక్రమణ కొనసాగించిన 332 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 'రహదారి భద్రతా నిబంధనలు ఉన్నది ప్రజల భద్రత కోసమే. ఈ విషయాన్ని వాహనచోదకులు దృష్టిలో పెట్టుకుని పక్కాగా పాటించాలి' అని సుధీర్‌బాబు పేర్కొన్నారు.

రూ. 67.5 లక్షల విదేశీ సిగరెట్ల స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: పాన్ ఇండియా డ్రైవ్‌లో భాగంగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు నాంపల్లి రైల్వేస్టేషన్‌లో సుమారు రూ. 67.50 లక్షల విలువైన స్మగ్లింగ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నాంపల్లి స్టేషన్‌లో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ (12724) ట్రైన్‌లో పోలీసులు అనుమానాస్పద స్థితిలో ఉన్న పార్శిళ్లను గుర్తించారు. తనిఖీల్లో 15 పార్శిళ్లు న్యూఢిల్లీలో లోడ్ చేసినట్లు తేలింది. వీటిలో 4,50,000 విదేశీ బ్రాండ్ 'పారిస్' సిగరెట్‌లు లభించాయి. మొత్తం 45 కాటన్ బాక్సులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుక్ చేసే వ్యక్తి కిరాణా వస్తువులని తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం గమనార్హం. బహిరంగ మార్కెట్‌లో ప్రతి సిగరెట్ స్టిక్‌ను రూ. 15 నుంచి రూ. 20 వరకు విక్రయిస్తుంటారు. ఈ మేరకు స్మగ్లింగ్ సిగరెట్ల విలువ సుమారు రూ. 67.50 లక్షలు ఉంటుంది. తప్పుడు పేరుతో పార్శిల్ బుక్ చేసిన వ్యక్తిపై ఆర్పీఎఫ్ హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దక్షిణ మధ్య రైల్వే, ఆర్‌పీఎఫ్ ఐజీ రాజారాం మాట్లాడుతూ... సిగరెట్ల స్మగ్లింగ్ ఆందోళనకరమని, రాబోయే రోజుల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని చెప్పారు.

త్వరలో వెస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్

బంజారాహిల్స్: ప్రతి జోన్‌కూ ఓ మహిళా పోలీస్ స్టేషన్ ఉండేలా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రతిపాదించారు. ఇందులో భాగంగా త్వరలోనే వెస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్‌లో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు సీసీఎస్‌లో వెస్ట్‌జోన్, ఈస్ట్‌జోన్, సెంట్రల్‌జోన్ తదితర మూడు జోన్లకు కలిపి ఒకే మహిళా పోలీస్ స్టేషన్ ఉంది. సౌత్‌జోన్‌కు, నార్త్‌జోన్‌కు ప్రత్యేకంగా దేనికవే వేర్వేరుగా మహిళా పోలీస్ స్టేషన్లు ఉండగా వెస్ట్, ఈస్ట్, సెంట్రల్‌కు మాత్రం మూడింటికి కలిపి ఒకే మహిళా పోలీస్ స్టేషన్లు ఉండటం వల్ల మహిళా బాధితులకు సకాలంలో సరైన న్యాయం అందడం లేదనే ఉద్దేశంతో ప్రతిజోన్‌కు మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్‌ఆర్‌నగర్, పంజగుట్ట పోలీస్ స్టేషన్లతో పాటు కొత్తగా ఏర్పాటు కానున్న ఫిలింనగర్, మధురానగర్, మాసబ్‌ట్యాంక్, బోరబండ తదితర ఎనిమిది పోలీస్ స్టేషన్లకు వెస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కసరత్తు ఇప్పటికే పూర్తి చేశారు. త్వరలో ఈ పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వచ్చే విధంగా అధికారులు పనులు వేగవంతం చేశారు. ఆ స్టేషన్ అందుబాటులోకి వస్తే ఈ ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలోని బాధిత మహిళలు సీసీఎస్ వరకు వెళ్లడం తప్పడమే కాకుండా తమ పరిధిలోని అందుబాటులో మహిళా పోలీసులు ఉండనున్నారు.

స్పందించారు.. ప్రాణాలు కాపాడారు

ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

అల్వాల్: ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. పోలీసుల సమాచారం మేరకు... నేరేడ్‌మెట్ మధురానగర్‌లో నివాసముండే రంజిత్‌కుమార్ యాదవ్(28) ఆటో డ్రైవర్. ఇతనికి భార్య, కూతురు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడన్న సమాచారాన్ని అతని స్నేహితుడు పోలీసులకు తెలిపాడు. దీంతో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇంటి తలుపులు పగుల గొట్టి రంజిత్‌కుమార్‌ను రక్షించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక, కుటుంబ సమస్యలే ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

ఐసైపోవొద్దు!

పిల్లలు తినే చాక్లెట్లు.. ఐస్‌క్రీమ్‌లు కల్తీ..
- పోలీసుల దాడుల్లో బయటపడుతున్న వైనం
- అనారోగ్య సమస్యలు తప్పవంటున్న వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: పసి పిల్లలు తాగే పాలే కాదు.. ఇష్టంగా తినే చాకెట్లు, ఐస్‌క్రీమ్‌లు కల్తీ అవుతున్నాయి. సులభంగా డబ్బు సంపాధించాలనే ఆలోచనతో కొంత మంది వ్యాపారులు శుచి, శుభ్రత లేని ప్రాంతాల్లో కలుషిత నీటితో ఐస్‌క్రీములు తయారు చేస్తున్నారు. మోతాదుకు మించి సింథటిక్ కలర్లు వాడుతున్నారు. వాటికి ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలను పోలిన లేబుళ్లను అతికించి గుట్టుగా మార్కెట్లోకి వదులుతున్నారు. ఏది అసలో? ఏది కల్తో? గుర్తించలేనంతగా వాటిని ప్యాకింగ్ చేస్తున్నారు. మరికొంత మంది ఏకంగా చాక్లెట్లలో ప్రమాదకరమైన డ్రగ్స్ కలుపుతున్నారు. ఈ విషయం తెలిక తింటున్న చిన్నారులు వాంతులు, విరేచనాలు, గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు నరాల బలహీనత, మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాధ్యమైనంత వరకు ఐస్‌క్రీమ్‌లు, చాక్లెట్లు, బేకరీ ఉత్పత్తులను ఇంట్లోనే తయారు చేసుకోవాలని సూచిస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు..

- షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో డెలీషియస్ ఐస్‌క్రీం తయారీ కంపెనీపై గురువారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. అపరిశుభ్రమైన వాతావరణంలో పలు రకాల ఐస్‌క్రీంలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. తయారీ కంపెనీకి ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో పాటు అపరిశుభ్రమైన ప్రదేశంలో.. మోతాదుకు మించిన సింథటిక్ కలర్లతో ఐస్‌క్రీమ్‌లు తరయా చేస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన వాటిని కూడా బ్రాండెడ్ లేబుళ్లతో మార్కెట్లోకి తరలిస్తున్న వాటిని సీజ్ చేశారు.
- కాటేదాన్ పారిశ్రామికవాడలో 24 కంపెనీల్లో ఇటీవల జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించగా, వీటిలో 17 కంపెనీలకు సంబంధించిన ఉత్పత్తులు కల్తీ, నాసిరకంతో ఉన్నట్లు గుర్తించి, ఆ మేరకు ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. ప్రధానంగా రవి ఫుడ్స్ బిస్కెట్స్ కంపెనీ పరిమితికి మించి సింథటిక్ కలర్లు వాడుతున్నట్లు తేలింది. బేగంబజార్, తుర్కయాంజాల్, నాదర్‌గుల్, ఆల్మాస్‌గూడలోని పలువురు అల్లం వ్యాపారులు ఆలుగడ్డ పేస్ట్‌ను అల్లంలో మిక్స్ చేసినట్లు గుర్తించారు.
- షాద్‌నగర్ మండలం రామచంద్రాపురం ఐస్‌క్రీం తయారీ కంపెనీలో కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌క్రీంతో పాటు నాసిరకం చాకోబార్‌లను విక్రయిస్తుండటంతో స్థానికులు ఇటీవల పోలీసులకు సమాచారం అందజేశారు. మంగళవారం రాత్రి పోలీసులు ఐస్‌క్రీం షాపుపై దాడి చేసి రూ.3 లక్షల విలువ చేసే బ్రాండెడ్ లేబుళ్లతో పోలిన నాసిరకం వెనీలా కప్స్–300, మ్యాంగో ఫ్లేవర్–500, స్ట్రాబెర్రి–100, చాకోబార్–100లను సీజ్ చేశారు.
- ఆమనగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మెగా ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై బుధవారం శంషాబాద్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌క్రీంలకు ఆకర్షణీయమైన బ్రాండెడ్ లేబుళ్లతో వీటిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఐస్ తయారీ కేంద్రాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.10 లక్షల విలువ చేసే ముడిపదార్థాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నరాలపై ఎఫెక్ట్

కంటికి కలర్‌ఫుల్‌గా కనిపించేదే కాదు.. నాలుకకు రుచికరంగా అనిపించే ఆహార పదార్థాలతో ఆరోగ్యం కన్నా.. అనర్థాలే ఎక్కువ. ఐస్‌క్రీమ్స్‌లో కలిపే కలర్స్‌లో పాయిజన్ కెమికల్స్ కలిసి ఉంటాయి. శరీరానికి హాని చేస్తాయి. వాంతులు, విరేచనాలతో పాటు గ్యాస్ట్రిక్ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. నరాలు బలహీనపడి చచ్చుబడిపోతాయి. కొంత మంది ఏకంగా చాక్లెట్లలో మత్తుపదార్థాలు కలుపుతున్నారు. వీటికి అలవాటు పడిన వారు మానసిక రుగ్మతలకు గురవుతున్నారు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ, రంగారెడ్డి జిల్లా

దుండిగల్ మున్సిపల్ సిబ్బందిపై వేటు

నలుగురిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ?

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన నలుగురు సిబ్బందిపై వేటు పడింది. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ మున్సిపాలిటీలో నరేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో వీరు గాగిల్లా పూర్, డి.పోచంపల్లి, బహదూర్‌పల్లి గ్రామ పంచాయతీల్లో బిల్ కలెక్టర్లుగా పని చేసేవారు. ఆ సమయంలో వీరికి రూ.50వేలు నెలవారీ జీతాలు వచ్చేవి. మున్సిపాలిటీగా ఏర్పడిన అనంతరం మున్సిపల్ చట్టం ప్రకారం వీరికి రూ.20 వేల జీతంతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించారు. అయితే అప్పటి నుంచి వీరు తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, గతంలో ఇచ్చిన జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా తమను క్రమబద్ధీకరించే విధంగా జీవోను అమలు చేయాలని సీడీఎంఏ కార్యాలయంలో ఓ అధికారిని కలిసి లంచం ఇచ్చినట్లు సమాచారం. అయితే రెగ్యులర్ చేస్తానని చెప్పిన సదరు అధికారి తప్పుడు జీవో జారీ చేయగా విషయం తెలిసిన ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. విచారణలో సదరు అధికారి అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో రెండు వారాల క్రితం కేసు నమోదు చేసి జైలుకు పంపించగా సదరు అధికారికి లంచం ఇవ్వడంతో పాటు బాధ్యులుగా ఉన్న నలుగురిని విధుల నుంచి తప్పించినట్లు తెలిసింది.

అదృశ్యమైన బాలుడు అనుమానాస్పద మృతి

- తల్లి, అత్తతో కలిసి దుస్తులు ఉతకడానికొచ్చి అదృశ్యం
- కుంటకు దూరంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో శవం లభ్యం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ మంగలివాని కుంటలో బుధవారం దుస్తులు ఉతకడానికి తల్లి లక్ష్మీ, అత్త వరలక్ష్మితో వచ్చి అదృశ్యమైన బాలుడు పల్లపు సంతోష్(12) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుంట సమీపంలోని ఓ వెంచర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో శవంగా లభించాడు. బుధవారం మధ్యాహ్నం తల్లి, అత్త దుస్తులు ఉతకడంలో నిమగ్నంకాగా బాలుడు కుంటకు మరో వైపు వెళ్లాడు. కొద్ది సమయం అనంతరం తల్లి సంతోష్ కోసం వెతకగా కనిపించకపోవడం, బాలుడి వెంట ఉన్న కుక్క కుంట ఒడ్డున నీళ్ల వద్ద కూర్చొని ఉండటంతో నీటిలో పడినట్లు భావించి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. అక్కడికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఎస్ఐ అశోక్ రాచకొండ విపత్తు నివారణ బృందం, జీహెచ్ఎంపీ, ఫైర్ సిబ్బందిని రప్పించి రెండు రోజులు పాటు కుంటలో గాలించినా ఆచూకీ లభించలేదు.

డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో శవం...

శుక్రవారం ఉదయం కుంటలో గాలింపు చర్యలను ప్రారంభించారు. రెండు రోజులైనా మృతదేహం నీటిపై తేలకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కుంట సమీపంలో వెతికారు. కుంటకు సుమారు 300 మీటర్ల దూరంలోని ఓ వెంచర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో బాలుడి శవాన్ని గుర్తించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

సైబరాబాద్‌లో 'సెంట్రలైజ్డ్ క్లూస్ టీమ్ హెడ్ ఆఫీస్'

- రిటైర్డ్ ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు చర్యలు
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సెంట్రలైజ్డ్ క్లూస్ టీమ్‌ను త్వరలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ టీమ్‌ను రిటైర్డ్ ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయాన్ని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర శుక్రవారం ప్రకటించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యా లయంలో సైబరాబాద్ ఫింగర్ ప్రింట్ యూనిట్ అండ్ క్లూస్ టీమ్ సిబ్బందితో సీపీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఉన్న మాదాపూర్, శంషాబాద్, బాలానగర్ జోన్లకు అదనంగా కొత్తగా ఏర్పా టు చేసిన లా అండ్ ఆర్డర్ రాజేంద్రనగర్, మేడ్చెల్ జోన్లలోనూ ఫింగర్ ప్రింట్, అండ్ క్లూస్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జోన్ల వారీగా ఫింగర్ ప్రింట్ యూనిట్లు, డివిజన్ల వారీగా క్లూస్ టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలోనే ఒక రిటైర్డ్ ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ క్లూస్ టీమ్ హెడ్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఎఫ్ఎస్ఎల్, హైదరాబాద్ క్లూస్ టీమ్ హెచ్‌ఓడీ వెంకన్న ఆధ్వర్యంలో సిబ్బందికి వారి పనితీరులో వర్క్ మానిటరింగ్, క్వాలిటీ ఎన్స్యూరింగ్, అకౌంటబిలిటీపై అవగాహన కల్పించారు. అనంతరం కేసుల ఛేదనలో ఉత్తమ పనితీరు కనబర్చిన వారికి సీపీ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా రివార్డులను అందజేశారు. సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ కల్మేశ్వర్ సింగెన్వర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఎఫ్ఎస్ఎల్, హైదరాబాద్ క్లూస్ టీమ్ హెచ్‌ఓడీ వెంకన్న, అన్ని డివిజన్ల ఏసీపీలు, ఫింగర్ ప్రింట్ యూనిట్, క్లూస్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి 'స్కైవాక్' సిద్ధం

- ఉప్పల్‌లో అధునాతన స్కైవే
- ప్రారంభానికి ఒకటి రెండు రోజుల్లో ముహూర్తం ఖరారు

ఉప్పల్: హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న స్కైవాక్ (ఆకాశ నడక) వంతెన పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదిరి చూస్తున్న వంతెన ప్రారంభానికి ఒకటి రెండు రోజుల్లో మూహూర్తం ఖరారు కానుంది. డిసెంబర్ 2020లో పనులు ప్రారంభమైనా ఉప్పల్ చౌరస్తా నిత్యం ట్రాఫిక్‌తో బిజీగా ఉండటంతో అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయలేక పోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా అత్యాధునిక టెక్నాలజీతో భావితరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న స్కైవాక్ వంతెన ఉప్పల్ ప్రాంతానికే కాకుండా హైదరాబాద్ ఈస్ట్ సిటీకి తలమానికం కానుందనడం నిర్వివాదాంశం. రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన వంతెనకు 1000 టన్నులతో 90 శాతం వరకు బ్రాండెడ్ స్టీల్‌ను ఉపయోగించారు. ఒక్క సారి పూర్తియితే ఉప్పల్ రింగ్ రోడ్డు రూపు రేకలు ఎంతో ఆహ్లాదంగా మారబోతుంది. ప్రతి లిఫ్ట్, స్టెప్స్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో గ్రీనరీ డెవలప్ చేసి రెండేళ్ల పాటు మెయింటనెన్స్ చేయనున్నారు. పురపాలక శాఖమంత్రి కేటీఆర్ సమయంకోసం వేచి చూస్తున్నట్లు సమాచారం.



సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

BUILDING & CONSTRUCTION

■ కేవలం 1600/-లకే Per Sft. నాణ్యమైన మెటీరియల్‌తో, 100% వాస్తు, క్వాలిటీ ఇంజనీర్లచే మీకు నచ్చిన రీతిలో ఇండ్లు బిల్డింగ్‌లు కట్టి ఇవ్వబడును. ఫోన్ : 9494707023 [HA-93169]

■ ఇల్లు కట్టి ఇవ్వబడును. 100% వాస్తు క్వాలిటీ మెటీరియల్‌తో 20 సం॥ అనుభవం గల ఇంజనీర్లు, మేస్త్రీలు మీ బడ్జెట్‌లో కట్టి ఇవ్వబడును. Ph: 7386082969 [H-781601]

■ Construct ur Dream House with Good Quality Material at Reasonable Price as per Vastu in and Around Hyd. Call for Best Price@9666009005 [H-793414]

FLAT FOR SALE

■ Hubsiguda Street No-8, Hema Mansion 1240 SFT, North Face SBI Bank Building 2BHK Flat For Sale Call : 6300138100 [H-797467]

■ Premium Project Near Habsiguda. Last 5 3BHK Flats For Sale. Gated Community, Club House, Swimmingpool. Fully Completed. Must See Call : 9492427519 [H-797585]

■ On Warangal Hwy, Opp : To D Mart Pocharam, Near Infosys, EAST Hyd. 2&3BHK Flats - 1437 SFT To 1962 SFT Club House, Swimmingpool Gated Community Call : 9873816525 [H-797584]

■ Flat 3BHK 56 Lakhs (Fixed) 15 yrs Old, Sri Lakshmi Residency, Tarnaka, E/F, 1320 Sft. UDS-35 Sq.yds, Near St. Anns School, Ph: 8978974761, 7386734669. [H-793679]

HOUSE FOR SALE

■ బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పూర్, యాదాద్రి కాలనీ 140గా॥ల. ఇండి పెండెంట్ ఇల్లు (G+1, E/F 40Ft Road) Rs. 1.65Cr. అమ్మకమునకు కలదు. గండిపేట (మం), రంగారెడ్డి (జిల్లా), ఫోన్ : 8008843371, 8555919283 [H-792867]

■ Independent House For Sale 150 sq.yds. 2BHK East & West Facing, @Nadargul, Green Homes Colony. LRS Paid, Spot Registration. Ph : 95817 75555 [H-781665]

■ 2BHK Flats & INDP Houses with Furniture HMDA, Near Hayathnagar, Gated Community, Loans, B. Bheem Reddy,Ph:8885060741,9700974808 [HA-10743]

LAND FOR SALE

■ 2 Acres - 28 Guntas Land with Boundary Wall Available For Sale At Cheeriyala Service Road, Near Keesara ORR No Brokers, No Middle Man. Ph : 8801057873. [HA-5349]

PLOT FOR SALE

■ ముంబై హైవే సదాశివ పేట్ సమీపంలో @ కొహిర్ 'X' రోడ్ దగ్గర 100 ఎకరాల DTCP ప్రాజెక్ట్, గజం : 2500/– సంప్ర: 7306202389. [HA-1919]

■ షాద్‌నగర్@రాజాపూర్ దగ్గర, 0% ఇంట్రస్ట్‌తో 30 నెలల EMI తో అన్ని డెవలప్‌మెంట్స్ 147 గజాలMUDA=(HMDA)లేఅవుట్‌లో ఓపెన్ Plots కలవు.ఫ్రీ సైట్ విజిట్. ఫోన్: 9949695027. [HA-133]

■ సదాశివపేట బాంబే హైవేకి ఆనుకొని అన్ని డెవలప్‌మెంట్‌లతో DTCP అప్రూవ్డ్ విల్లా ప్లాట్స్ అమ్మకానికి కలవు & మార్కెటింగ్ టీమ్ కావలెను. ఫోన్ : 8008005082. [HA-1648]

■ VJA, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. గన్నవరం, బందరు రోడ్డు, కంచికచర్ల దగ్గర శ్రీగంధం మొక్కలతో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/-, నుండి 17,500. సంప్ర : ✆ 89773 06689 [B-27]

■ ప్లాట్ ఫర్ సేల్: షాద్‌నగర్, పోలేపల్లి SEZ రూ. 4000/- చ.గ. DTCP సదాశివపేట్ ఎంప్లాయ్‌మెంట్ జోన్ 10000 చ.గ. భువనగిరి Nr కలెక్టరేట్ YTDA మేడ్చల్, తూప్రాన్ HMDA ఆల్ ఫుల్ డెవలప్డ్ ప్లాట్స్. ఫోన్ : 9000250099. [HA-10731]

■ బెంగుళూరు హైవే షాద్‌నగర్ దగ్గర 104 ఎకరాల మెగా ఫ్రూట్స్ ఫాం ల్యాండ్ అందమైన వెంచర్‌లో పోలెపల్లి SEZ ప్రక్కన 2 మరియు 5 గుంటల ప్లాట్లు కలవు. గజం 6499/– ఫిక్స్‌డ్ బై బ్యాక్ ఆఫర్ కలదు. సంప్ర: 9666695886 [G-3076]

■ Mallapur Village Saroor Nagar (Mandal) Venkatapur Grampanchayat, Plot No-4, W/F, 33 Ft. Road, 286 Sq. yds RCI Road. Call : 6300138100. [H-797468]

Services

BEAUTY CARE

WANTED

■ Wanted Experienced Lady Beautician for hair and beauty Address: Suncity, Langer House Ph:9346836962 / 9399984800 [H-796778]

BUSINESS OFFER
All Kitchen Equipment for Sale
- Rice Boilers
- Chapatis Making Machine
- Cold Room
- S S Work Tables
- 2 Burner Stoves
- Kitchen Utensils
Call : 9581386789

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-797511]

BUSINESS OFFER

■ We Give Business / Income Ways in Education & Entertainment Fields Earn with us & Grow with us Call : 6371797847 [H-797465]

HOME NEEDS

WATER PROOFING

■ శ్రీసాయి భవానీ వాటర్ ప్రూఫింగ్: మీ ఇంట్లో వాటర్ లీకేజ్ ఉందా! సీలింగ్, వాటర్ ట్యాంక్, సంపు, బాత్రూమ్స్, సైడ్‌వాల్స్, టెర్రస్, ఎటువంటి లీకేజ్ అయినా కెమికల్స్‌తో బాగు చేయబడును. 9948270898 [H-781480]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Anjilamma W/o Vittalaiah R/o H.No.1-17, Antharam (V), Kulkacherla (M), Vikarabad Dist. PERUMALA ANJILAMMA & ANJILAMMA Both Names Are Same Person [H-797673]

LOST

■ I, S.A. Samad S/o Abdul Khadar, R/o 12-12-230, Ravindra Nagar, Sitafalmandi, Secbad. I have lost Original Flat property document No 568/2007 in the name of D. Vamshi Mohan. S/o Late D. Rama Murthy while Travelling from Ravindranagar to O.U. sec bad if found call 9966586771 [H-781304]

OLD AGE HOME

■ మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781606]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16K-18K ఏజెంట్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793423]

■ ప్రముఖ మ్యారేజ్ బ్యూరోలో పనిచేయుటకు లేడీ టెలికాలర్స్+కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. మంచి జీతము +ఇన్సెంటివ్స్. Q:10th-Degree, రామాంతపూర్ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత: ఫోన్ : 9581566072. [HA-13757]

■ అజీజ్ నగర్ సమీపాన ఉన్న ప్రముఖ ఇంటర్‌నేషనల్ స్కూల్‌కి సెక్యూరిటీ గార్డులు -30 కావలెను. మంచి జీతం ఇవ్వబడును. ఫోన్ : 9849079995, 7386173670 [HA-10766]

■ పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9440828190 [HA-6164]

■ జీడిమెట్ల IDA ఇండస్ట్రీ ఏరియా ఇంటర్‌టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పని చేయుటకు అనుభవజ్ఞులైన ఎలక్ట్రీషియన్లు కావలెను. 8గం॥లు డ్యూటీ. ఫోన్ : 9849079995. [HA-10767]

■ వంట మనిషి కావలెను, ప్రముఖ కాలేజీలో పనిచేయుటకు, జీతం : 15వేలు–30వేలు, నిజాంపేట్ రోడ్డు, జేఎన్టీయూ దగ్గర, ఫోన్ : 9502987699, 9100094699 [HA-29488]

■ NGO ఆర్గనైజేషన్ దిల్‌సుఖ్ నగర్, లేడీ టెలికాలర్స్ కావలెను. వయస్సు: 35సం॥ లోపు, జీతం: 15,000/– + ఇన్సెంటివ్స్, ఫోన్ : 9666536627, 8121456580 [H-796900]

■ హైదరాబాద్‌లో పనిచేయుటకు ఉత్సాహవంతమైన యువతీ యువకులు కావలెను. POS : టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ స్టాఫ్, Qul : Inter / Degree, P/F, Food, Accomidation Free ✆ 88971 70985 [B-786305]

■ మా కంపెనీ నందు వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌తో మెటీరియల్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000 + ఇన్సెంటివ్స్. 8341371684 [G-786222]

■ సెక్యూరిటీ గార్డ్స్, సెం॥సూపర్‌వైజర్, కా॥ L.B. నగర్, ఘట్‌కేసర్, బాచుపల్లి, కొల్లూర్, జీడిమెట్ల, కాజగూడ & ఆఫీస్ బాయ్స్, హౌస్ కీపింగ్ కా॥ మంచి జీతం. మెట్రో మేనేజ్‌మెంట్. ఫోన్ : 9885657755, 9963077722. [H-781417]

■ డైరెక్ట్ జాబ్ 18-50 సం॥ల మహిళలు మాకంపెనీ కొరకు వెంటనే కావలెను. ఉచిత వసతి+ భోజనం, జీ॥ 16-30వేల వరకు. స్పాట్ జాయినింగ్. ఫోన్ : 8886733005 / 008 [HA-10829]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-10756]

■ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ పని చేయుటకు అర్హులైన యువ టీచర్స్ & ట్యూటర్స్ కమ్ వార్డెన్స్ కావలెను. జీతం: 15000–18000, హయత్‌నగర్, Hyd. ఫోన్ : 8790998430 [H-797464]

■ Wanted Telecallers and Sales Managers for Reputed Construction Company, Salary + Incentives. Cont: RainBow Children Hospital, Nanakramguda. Ph:6300407796, 9885468071 [H-781422]

■ Wanted Salesmen For Textiles Wholesale Shop, Helpers, Auto driver for delivery, Marketing Manager. Call:8801805758 [HA-11027]

■ Mega Online JobFair With 100 Companies On IT & Non IT On 9th May Freshers & Experience Can Apply 7207456432, 7675056432, 7674956432, 7702535577, 9392579539, 9392585154, 8074266054, Register @www.hyseplacements.com [HA-2023]

■ WANTED Field Executives For all areas Salary 15 to 20k Tele Caller Salary start 13K- 18k Team Leader 23k+ &Ince @ Sec-Bad 9000740700 [HA-29163]

■ Wanted Computer Operator, Female Tele Callers. Salary: 10000/- to 15000/-. Qualification: Any Degree. Job Location: Ameerpet, Hyd. Contact: 8008556087, 9248733346 [G-4221]

■ Wanted Male Campus Principal, Male Academic Principal. Salary upto: 35,000/-. Qualification: Degree. Age: 35 to 45 yrs. Experience in Educational or Any Other Sector. Job Location: Dilsukhnagar, Hyd. Contact: 9100069434, 9248733346 [G-4222]

FACULTY TEACHERS

■ Sri Vidya Degree College-Chintal. Wanted: Principal & Lecturers Commerce, Computer Science, English, Sanskrit, Arabic Faculty Min. 5 years Experience& 55% in Concerned Subject. Send Your Resume To Mail Id: srividyadegreecollege.hyd@gmail.com on or Before 07-05-2023 Contact : 8125200423. [HA-2494]

■ Wanted Qualified Experienced Teachers for primary and High School for English, Science and Computer on 08-05-2023 come along with your Resume and Certificates, SFS HIGH SCHOOL, Medipally, Hyd. Ph : 9032887795, 040-29880005. [HA-93066]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం
వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell :9912225453

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పలి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కళ్యాణ్‌నగర్ పార్కు 11కేవీ ఫీడర్ బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కళ్యాణ్‌నగర్‌పార్కు, సిద్ధార్థనగర్ కోఆపరేటివ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కె.కిశోర్‌కుమార్ తెలిపారు. అల్లాడిన్ కోటి, డీఎస్‌ఎం కాలనీ 11 కేవీ ఫీడర్లు, లోధ సబ్‌స్టేషన్ పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, అల్లాడిన్ కోటి, లిక్కర్ కంపెనీ, డీఎస్‌ఎం కాలనీ, అశోక్ కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ కొంతభాగం, టీవీఎస్ షోరూం లైన్, మెథడిస్ట్ చర్చి లైన్, డీ మార్ట్ ఎదురు గల్లీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.

శుభాకాంక్షలు



శుభాకాంక్షలు చెబుతున్న రవిగౌడ్

శ్రీనగర్‌కాలనీ: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఎర్రగడ్డ కాంగ్రెస్ నేత, గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్ ఆయన కార్యలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

లిబర్టీ: బుద్ధుడి బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానంతో గౌతమ బుద్ధుని తాత్విక వెలుగులో సమతా రాజ్యాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. బుద్ధుడు ఆలోచనలు సిద్ధాంతాన్ని సమాజం పాటిస్తే మానవాళి సుఖసంతోషాలతో జీవనం సాగిస్తారన్నారు. బుద్ధుడి బోధనలు ప్రపంచంలోని మానవాళి అనుసరిస్తూ ఆచరిస్తున్నారన్నారు. గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుద్ధుడి బోధనలు అధ్యయం చేస్తే మనుషులు పరిపూర్ణ మానవాళిగా ఎదుగుతారన్నారు. ప్రపంచంలోనే అనేక దేశాలు బుద్ధిజాన్ని ఆచరిస్తున్నాయని గుర్తు చేశారు. నేతలు ఇటిక్యాల గణేష్, బీరం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు లవంగచూర్ణ రసంతో అభిషేకం



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని విశ్వసాయి మందిరంలో సాయిబాబాకు లవంగ చూర్ణ రసంతో అభిషేకం, మామిడి పండ్లు, పుష్పాలతో సహస్రనామార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం వైశాఖ పౌర్ణమి కావటంతో ప్రత్యేక పూజలను నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారన్నారు.

బురదలో కూరుకుపోయిన కారు



పంజగుట్ట: ఎర్రమంజిల్ నుంచి రాజ్‌భవన్ వైపు వెళ్లే దారిమూల మలుపులో ఓ కారు బురదలో ఇరుక్కుపోయింది. ఆ ప్రాంతంలో డ్రైనేజీ పనుల కోసం భారీ గొయ్యి తీశారు. రాజ్‌భవన్ రోడ్డునుండి ఎర్రమంజిల్ వైపు వస్తున్న ఓ క్యాబ్ అక్కడ నుండి కారు వెళ్లే మార్గం లేకున్నా అందులో ఇరికించడంతో గోయ్యి పూడ్చిన మట్టి బురదలో దిగిపోయింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు కారును బయటకు తీశారు. ఆ రోడ్డును పనులు జరుగుతున్న నేపథ్యంలో పూర్తిగా మూసివేశారు.

ఎనిమిది నెలలు.. 77216 కేసులు

'రోప్'లో భారీగా ట్రాఫిక్ ఉల్లంఘనలు

మరోసారి స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమవుతున్న ట్రాఫిక్ పోలీసులు

వాహనాలు తేలికగా ముందుకు వెళ్లడం, ఫుట్‌పాత్‌లపై పాదచారులు ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా నడిచి వెళ్లడం లక్ష్యంగా గతేడాది సెప్టెంబర్ 15వ తేదీన ట్రాఫిక్ పోలీసులు రోప్ (రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్స్) విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మూడు వారాల పాటు వాహనదారులకు, ఫుట్‌పాత్ ఆక్రమణదారులకు అవగాహన కల్పించారు. సిగ్నళ్ల వద్ద ఎడమ వైపు వెళ్లే వాహనదారులు తేలికగా ముందుకు వెళ్లేలా ఫ్రీ లెఫ్ట్ అడ్డంకులు లేకుండా చూసేందుకు ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చి పకడ్బందీగా ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద వెనుక వచ్చే వాహనాలు ఆగకుండా చూశారు. ఇక సిగ్నళ్ల వద్ద స్టాప్‌లైన్‌ను దాటి ముందుకు వచ్చే వాహనాలు నిలిపేవారిపై కొరడా ఝులిపించారు.

బంజారాహిల్స్: పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ పరిధి (వెస్ట్ జోన్ ట్రాఫిక్) కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట, బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతేడాది 15వ తేదీ నుంచి ఈ ఏడాది మే 5వ తేదీ వరకు ఎనిమిది నెలల్లో ఫుట్‌పాత్ ఆక్రమణదారులు, స్టాప్‌లైన్, ఫ్రీ లెఫ్ట్‌లో బ్లాక్ చేసిన వారిపై 77,216 కేసులను నమోదు చేశారు.

- ఇందులో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి పాదచారులకు అడ్డంకులు కలిగించిన 52 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫ్రీ లెఫ్ట్‌లు బ్లాక్ చేసిన 7539 మందిపై, స్టాప్‌లైన్లు దాటి ముందుకు వచ్చిన 69625 మందిపై ఉల్లంఘనల కేసులు నమోదు చేశారు.
- ఈ కేసులన్నీ రోప్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇప్పటికే స్టాప్‌లైన్, ఫ్రీ లెఫ్ట్, ఫుట్‌పాత్ ఎంక్రోచ్‌మెంట్లపై వాహనదారులకు, వ్యాపారులకు అవగాహన భారీగా పెరిగినా ఇంకా కొన్ని చోట్ల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయని అధికారుల దృష్టికి రావడంతో మరోసారి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుడుతున్నారు.
- ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రోప్‌ను మరింత పటిష్టంగా అమలు చేసే దిశగా తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లకు సిద్ధమవుతున్నారు.
- స్టాప్‌లైన్ ఉల్లంఘించిన వారు బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా ఉండగా ఫ్రీ లెఫ్ట్ బ్లాక్ చేసిన వారు జూబ్లీహిల్స్ పరిధిలో అధికంగా ఉన్నారు.

పోలీస్ స్టేషన్	ఫుట్‌పాత్ ఆక్రమణలు	ఫ్రీ లెఫ్ట్ బ్లాక్	స్టాప్‌లైన్ దాటిన వారు
పంజగుట్ట	10	447	8955
ఎస్ఆర్‌నగర్	13	2599	8999
జూబ్లీహిల్స్	4	2975	18693
బంజారాహిల్స్	11	965	14153
బేగంపేట	14	553	18825
మొత్తం	52	7539	69625

వాహనదారులు బాధ్యతగా ఉండాలి



ఫ్రీ లెఫ్ట్‌లు బ్లాక్ చేసే వారిపై, స్టాప్‌లైన్ దాటిన వారిపై ఇప్పటికే పెద్ద ఎత్తున ఉల్లంఘనల కేసులు నమోదు చేశాము. నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు, నార్త్ డిస్ట్రిక్ట్ డీసీపీ రాహుల్ హెగ్డె ఆదేశాల మేరకు ఇప్పటికే మా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట, బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరంగా జరుగుతున్నది. మరోవైపు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి పాదచారులకు అడ్డంకులు కలిగిస్తున్నవారిపై కూడా ఆయా పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. పాదచారుల భద్రతకు పెద్ద పీట వేయడంలోనూ, వాహనదారులు ఎక్కడా ఆగకుండా తేలికగా ముందుకు సాగే విధంగా ఉన్నతాధికారులు సరైన ప్రణాళికలు రూపొందించి ఆదేశాలు ఇస్తుండగా వాటిని సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతున్నది. మరోసారి రోప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. స్టాప్‌లైన్ దాటిన వారికి, ఫ్రీ లెఫ్ట్ బ్లాక్ చేసిన వారికి ట్రాఫిక్ పోలీసులు రోజూ అవగాహన కలిగిస్తున్నారు. ప్రజలు మరింత బాధ్యతగా వ్యవహరించాలి. ట్రాఫిక్ పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించాలి. ఉల్లంఘిస్తే తమతో పాటు ఇతర వాహనదారులకు కూడా ఇబ్బందులు ఉంటాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

– శంకర్‌రాజు, ఇన్‌చార్జి ట్రాఫిక్ ఏసీపీ వెస్ట్‌జోన్

సమస్యల పరిష్కారమే లక్ష్యం



పాదయాత్రలో పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి తదితరులు

వెంగళరావునగర్: సమాజాభివృద్ధిలో యువతరం, మహిళలే కీలకమని అలాంటి వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని టీ హోప్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనరసింహానగర్‌లో శుక్రవారం ఆయన జాగో జూబ్లీహిల్స్ పేరుతో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు యువతీయువకులు, మహిళలు ఆయనను కలిసి తాము కూడా కలిసి పని చేస్తామన్నారు. అనంతరం ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... జాగో జూబ్లీహిల్స్ పాదయాత్రలో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పాదయాత్రలో భాగంగా ప్రతి బస్తీ, కాలనీల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీనరసింహానగర్‌లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ప్రధానంగా ఉన్నాయన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని ప్రజలంతా తమ మద్దతును తెలియజేయాలని కోరారు. నేతలు శాసనాల గాలయ్య, రాజు రజక, భాస్కర్ రెడ్డి, కొండపల్లి రమేష్, వడ్డెర మోహన్, చంద్రమౌళి, యాదగిరి, ప్రసాద్‌గౌడ్, మాణిక్యం, రాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వం



పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం బీసీలను విస్మరిస్తుందని భారత ధమ్మ పార్టీ అధ్యక్షుడు మెట్టు గంగారాం ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే తొలి సంతకం ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భారత ధమ్మ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను పార్టీ చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సాప శివరాములు నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతుబంధును ఒక్క ఎకరానికి సంవత్సరానికి రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచుతామన్నారు. మహిళలకు మహిళా చట్టాలను రూపొందించి డ్రాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని, ప్రతి రేషన్ కార్డుకు కిలో చెక్కర, కిలో కందిపప్పు, రెండు కిలోల పామాయిల్ ప్యాకేజీ ఇస్తామన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగాల కేలెండర్ విరివిగా వేస్తామని, మొదటి సంవత్సరమే 6 లక్షల మంది యువతీయువకులకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామన్నారు. నేతలు నారాయణ స్వామి, ఉపేందర్, వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.

సందడిగా బుద్ధ పీస్ కార్ ర్యాలీ

ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్: బుద్ధుడికి మరో బుద్ధుడు అయిన నాగార్జునుడు నివశించిన తెలంగాణ ప్రాంతంలో బుద్ధ జయంతి సందర్భంగా దేశంలోనే అత్యంత ఎత్తైన బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బుద్ధ పీస్ ర్యాలీని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ పీస్ కార్ ర్యాలీని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... బుద్ధ పీస్ ర్యాలీని ప్రతి సంవత్సరం నిర్వహిస్తామన్నారు. నాగార్జున సాగర్‌లో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును అంతర్జాతీయ స్థాయి బుద్ధిస్ట్ విజ్ఞాన కేంద్రంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుని విగ్రహం వరకు పర్యాటక శాఖకు చెందిన బోటులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రయాణించారు. సాగర్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ జలాశయంలో నిర్వహిస్తున్న బోటింగ్ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. 125 అడుగుల బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బుద్ధ వనం వరకు పీస్ కార్ ర్యాలీ నిర్వహించారు. పీస్ ర్యాలీ ప్రారంభానికి ముందు బౌద్ధ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, అధ్యక్షుడు పరంధాములు, వరున్ కుమార్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్ పీఎస్‌గా రహమత్‌నగర్ అవుట్ పోస్టు



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ పోలీస్ అవుట్ పోస్టులో కొత్త పోలీస్ స్టేషన్‌కు ఏర్పాటుకు సంబంధించిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటులో భాగంగా రహమత్‌నగర్ అవుట్ పోస్టును మధురానగర్ పోలీస్ స్టేషన్‌గా మార్చనున్నారు. ఈ నేపథ్యంలో అవుట్ పోస్టు భవనంలో మరమ్మతులు చేపడుతున్నారు. గతంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న రహమత్‌నగర్ పోలీస్ అవుట్ పోస్టు మధురానగర్ పోలీస్ స్టేషన్‌గా మారుతుండటంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కేసు

బంజారాహిల్స్: ఫుట్‌పాత్‌లు ఆక్రమించి కొనసాగిస్తున్న వ్యాపారులపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో కొంతకాలంగా శ్రీలక్ష్మి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని వేణు, ఆర్‌కే తందూరి పాయింట్ యజమాని అంజద్‌ఖాన్, రెహమాన్ టిఫిన్ సెంటర్ యజమాని అజయ్‌కుమార్, ఫ్రెష్ క్వాలిటీ ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్స్ యజమాని ఎం.డి. రెహాన్, న్యూ బంజారా దోశ ఓనర్ ఎండి ఆలంలపై కేసులు నమోదు చేశారు. వీరికి సంబంధించిన గ్యాస్ సిలిండర్లు, టేబుళ్లు, కుర్చీలు, తూనికల మిషన్లు, వాటర్ క్యాన్లు, మిక్సర్ గ్రైండర్లు, సీజ్ చేశారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 341, 285 కింద బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

ప్రజాసేవే లక్ష్యం

పంజగుట్ట: ప్రజాసేవే పరమావధిగా పద్మక్క సేవా సంస్థ పనిచేస్తుందని సంస్థ వ్యవస్థాపకుడు ప్రశాంత్ తెలిపారు. వైద్యరంగంలో ఎంతో రాణిస్తూ, రైజ్ ఫౌండేషన్ స్థాపించి ఎంతో మందికి సేవ చేస్తున్న ఎంతో మందికి స్ఫూర్తి నింపుతున్న పద్మక్క సేవా సంస్థ ఏర్పాటు చేయడం ఎంతో హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సేవా సంస్థ లోగోను సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ టీవీ, మూవీ ఆర్టిస్ట్ యూనియన్ కోశాధికారి నూకరాజు, శిరీషా రెడ్డి, దివ్య, అశోక్ సింగ్, లక్ష్మీకాంత్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చడం అభినందనీయం

సనత్‌నగర్: శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో వందలాది మంది ఆకలి తీరుస్తూ స్ఫూర్తి నింపుతున్నారని బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానం ఈఓ ఎస్.అన్నపూర్ణ అన్నారు. బీకేగూడ పార్కు వద్ద కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజన కార్యక్రమంలో శుక్రవారం ఆమె దాతగా వ్యవహరించారు. అన్నపూర్ణ దంపతులతో పాటు డాక్టర్ పునీత, భాను-శివరావు దంపతులు సైతం దాతలుగా ముందుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతియేటా వేసవిలో క్రమం తప్పకుండా రెండు నెలల పాటు అన్నార్తుల ఆకలి తీర్చడంలో వయోధికుల కృషి ఎనలేనిదన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి శ్రీనివాస సమాజ సేవా సమితి తరుపున మధ్యాహ్న మిత భోజన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ట్రస్టీ పార్థసారధి, కృష్ణారెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షలను అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: పాత వారిని తొలగించకుండా టీఎస్‌పీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తే అడ్డుకుంటామని ఓయూ విద్యార్థులు హెచ్చరించారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ నుంచి టీఎస్ జాక్, బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ ర్యాలీని పోలీసులు అడ్డుకొని విద్యార్థి నేతలు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి, పులిగంటి వేణుగోపాల్ అరెస్ట్ చేశారు.

జూబ్లీహిల్స్ రూట్ మారిన 47వై/ఎం బస్సులు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 78లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తుండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ స్తంభించిపోతూ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఫిలించాంబర్ నుంచి షేక్‌పేట ఓల్డ్ ముంబయి వరకు రూ. 1.15 కోట్లతో అన్ని హంగులతో రోడ్డును విస్తరించినా ఆర్టీసీ బస్సులు వినియోగించుకోవడం లేదని దీని వల్ల రోడ్ నెం 78పై భారం పడుతున్నదని ట్రాఫిక్ ఇక్కట్లు పెరిగిపోతున్నాయని సమస్యలు 'సాక్షి' కళ్లకు కట్టింది. ఇందుకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. విస్తరించినా... వినియోగించని శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రాంమోహన్ ఈ మేరకు రాణిగంజ్ డిపోకు చెందిన 47వై/ఎం రూట్ బస్సులను గురువారం నుంచి రూట్ మారుస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ బస్సులన్నీ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 78 నుంచి కాకుండా ఫిలింనగర్ కొత్త చెరువు మీదుగా షేక్‌పేట ఓల్డ్ ముంబయి రోడ్డు మీదుగా మణికొండ, నార్సింగ్, మంచిరేవుల వైపు వెళ్లేలా ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ స్పందన చూసి 47/ఎల్ రూట్ బస్సులను కూడా మారుస్తామని ఆయన వెల్లడించారు. దీని వల్ల జూబ్లీహిల్స్ రోడ్ నెం. 78పై ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రమాదాల నివారణతో పాటు బస్సులు కూడా అనుకున్న రీతిలో ప్రయాణికులకు అందుబాటులో ముందుకు సాగేలా ప్రణాళికలు రూపొందించామని డీఎం వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 5లోని దేవరకొండ బస్తీలో రూ. 16 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన నూతన నాలా శ్లాబ్ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్, డీఈ మణిపాల్, ఏఈ సతీష్‌తో కలిసి పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏటా వానాకాలంలో దేవరకొండ బస్తీ నాలా పొంగిపొర్లుతున్నదని స్థానికులు ఇబ్బందులు పడకుండా నిధులు మంజూరు చేయించి... నాణ్యత ప్రమాణాలతో పనులను వెంటనే పూర్తి చేయాలిన కోరారు. ఇక్కడి పరిస్థితులను అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకన్నారు. ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ స్పష్టం చేశారు.

కనులపండువగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి మూలవిరాట్

వెంగళరావునగర్: బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లోని హరిహరక్షేత్ర దేవస్థానంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన పూజల్లో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కలవల సత్యనారాయణరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి, మంగళాశాసనం, 8 గంటలకు ప్రభోధిక సేవాకాలం, 9 గంటలకు యాగశాల ప్రవేశం, యాగమంటపారాధన, 10 గంటలకు లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గరుడ సేవ, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



కార్ల్‌మార్క్స్‌కు నివాళి

లిబర్టీ: దోపిడీ పీడన లేని సమసమాజ స్థాపన కోసం మార్క్స్ కృషి చేశారని ఎంసీపీఐ పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.మార్టిన్ అన్నారు. మానవాళి ఉన్నంత వరకు మార్క్సిజం సిద్ధాంతం ఉంటుందని స్పష్టం చేశారు. కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూజ... దోపిడీ అణిచివేత వివక్షత లేని నవీన సమాజాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో మార్క్స్ కృషి చేశారన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీకి వ్యతిరేకంగా అనేక రచనలు చేశారని గుర్తు చేశారు. క్యాపిటల్ గ్రంథం ప్రపంచ ప్రసిద్ధిగాంచిందని అనేక దేశాల్లో శ్రామిక వర్గం దాన్ని ఆధారంగా తీసుకోని పోరాటాలు సాగిస్తున్నాయని మార్టిన్ స్పష్టం చేశారు. పెట్టుబడిదారుల శ్రమ దోపిడీ గురించి మార్క్స్ చెప్పిన సూత్రాలను పాటించాలన్నారు. మార్క్స్ శాస్త్రీయ సిద్ధాంతం ప్రస్తుత సమాజం ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు.

BEFORE THE HONOURABLE PRINCIPAL SPECIAL COURT IN THE CADRE OF DISTRICT JUDGE FOR TRIAL AND DISPOSAL OF COMMERCIAL DISPUTES: CITY CIVIL COURT: AT HYDERABAD
C.O.S. No. 44 OF 2022
BETWEEN:
M/s. Meenakshi Infrastructures Private Limited ...Plaintiff
AND
M/s. Meenakshi Estates Hyderabad LLP & ORs ...Defendants
NOTICE
Defendant No.2 : Bhavani Developers, B-7, Mallareddy Heights, 1st Floor, Madhura Nagar, Hyderabad 500 038.
WHEREAS the plaintiff has filed the above suit in the above named court in the captioned case in which the appearance of defendant No.2 is required to hear the matter on merits in person or through an advocate duly instructed on the 1st day of June, 2023 (01/06/2023) at 10-30 AM to show cause against the claim of the plaintiff failing which the matter will be heard and determined ex parte.
// By order of the Court //
Sri. SVS Chowdary,
501, Bhavani Shakthi Homes, Rajeev Nagar, Hyderabad-500 081
Counsel for Plaintiff
Hyderabad, Dt.06/05/2023

అయ్యో.. మళ్లీ కొట్టుకుపోయిందే...



వినాయకనగర్‌లో వర్షానికి కొట్టుకుపోయిన చదును చేసిన మట్టి రోడ్డు

బంజారాహిల్స్: ఒకటి కాదు రెండు కాదు ఇప్పటికి మూడుసార్లు జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలోని చదును చేసిన మట్టి రోడ్డు వర్షానికి వచ్చిన వరద తాకిడికి కొట్టుకుపోయింది. వినాయనగర్ బస్తీలో వరద నీటి కాల్వ నిర్మించిన అనంతరం దానిపై సీసీ రోడ్డు వేయాలని జీహెచ్ఎంసీ అధికారులు తలపెట్టారు. ఇందులో భాగంగా వారం రోజుల క్రితం ఇక్కడ మట్టితో రోడ్డును చదును చేసి సిద్ధంగా ఉన్నారు. ఇంతలోనే వర్షానికి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. రెండు రోజుల విరామం ఇచ్చి మళ్లీ రోడ్డును చదును చేశారు. అదే రోజు రాత్రి భారీ వర్షం రావడంతో రోడ్డు కొట్టుకుపోయింది. గత మూడు రోజులుగా వర్షాలు రావడం లేదని భావించిన అధికారులు గురువారం రాత్రి రోడ్డును చదును చేసి సీసీ రోడ్డు వేసేందుకు పూర్తిగా ఏర్పాట్లు చేశారు. కాగా రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా కుంభవృష్టిలా వానరావడంతో మరోసారి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఏం చేయాలో జీహెచ్ఎంసీ అధికారులకు, బస్తీ వాసులకు తోచడం లేదు. వానలు పూర్తిగా ఆగిపోయిన తర్వాతే రోడ్డు పనులు మొదలు పెట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు.

వరద వెళ్లేదెలా సారూ..

వెంకటేశ్వరకాలనీ: జంక్షన్ల సుందరీకరణలో భాగంగా జీహెచ్ఎంసీ అధికారుల అడ్డగోలు పనులకు కేబీఆర్ పార్కు వద్ద వర్షం వస్తే కనిపించే పరిస్థితి అద్దం పడుతోంది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద వర్షం వచ్చిన ప్రతిసారీ కేబీఆర్ పార్కు ప్రధాన గేటుతో పాటు పార్కుకు దారి తీసే మార్గంలో పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోతున్నది. ఇక్కడ వర్షానికి నిలుస్తున్న నీరు పోయేందుకు సరైన దారి లేకపోవడంతో వర్షం ఆగిపోయిన తర్వాత నాలుగు రోజుల వరకు కూడా నీళ్లు పోవడం లేదు. దీంతో వాకర్లు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

క్లుప్తంగా...

సీబీఐ కోర్టులో లొంగిపోయిన గంగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టులో లొంగిపోయారు. గంగిరెడ్డి బెయిల్ రద్దుచేస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. జూన్ 30 వరకు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఆ తర్వాత రూ.లక్షన్నర పూచీకత్తుతో ట్రయల్ కోర్టు నుంచి బెయిల్ పొందవచ్చని గంగిరెడ్డికి సూచించింది. వివేకా హత్యకేసులో గంగిరెడ్డిని 2019 మార్చి 28న అరెస్ట్ చేశారు. 90 రోజులు గడిచినా ఆయనపై సిట్ చార్జిషీట్ దాఖలు చేయకపోవడంతో ఆయనకు కడప కోర్టులో డీఫాల్ట్ బెయిల్ వచ్చింది. అప్పటి నుంచి బయటే ఉన్న ఆయన హైకోర్టు ఆదేశాల మేరకు లొంగిపోయారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయన్ని జైలుకు తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి బొమ్మిరెడ్డి

సాక్షి, అమరావతి : పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. బొమ్మిరెడ్డితో పాటు ఆత్మకూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, టీడీపీ నేత ఇందూరు వెంకటరమణారెడ్డిలు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, వరప్రసాద్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. టీడీపీలో డబ్బులున్న వారికే పదవులు దక్కుతాయని బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి చెప్పారు. సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అనంతరం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు.

నేడు ఏపీ టెన్త్ ఫలితాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ఫలితాలను విజయవాడలో విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు 6.40 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 6,05,052 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలికలు 2,95,807 మంది..బాలురు 3,09,245 మంది ఉన్నారు. ఫలితాలను https://www.sakshieducation.comలో చూడవచ్చు.

నర్రెడ్డి సోదరులు చెప్పినట్టే చేశా

ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు

- ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- లెటర్, ఫోన్ దాచిపెట్టమని రాజశేఖరరెడ్డి చెప్పారు
- ఆ విషయాలన్నీ ఎవరికీ చెప్పొద్దన్నారు
- నుదుటిపై దెబ్బ, బెడ్ రూమ్.. బాత్‌రూంలో రక్తం ఉందని కూడా చెప్పాను
- వాళ్లవన్నీ ఏమీ పట్టించుకోలేదు.. మేం చూసుకుంటామన్నారు
- ఎర్రగంగిరెడ్డి ఇంట్లోకి వచ్చిన వెంటనే రక్తం వాంతులని చెప్పాడు
- ఈయన సూచన మేరకే పనిమనిషి లక్ష్మి, రాజశేఖర్, ట్యాంకర్ బాషాలు శుభ్రం చేశారు
- నా ఫోన్‌లో సీఐ శంకరయ్యతో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడారు
- తాము చెప్పినట్లు వినకపోతే జైలుకెళ్తావని సునీతమ్మ అన్నారు



సాక్షి ప్రతినిధి, కడప : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి మృతి చెందాక ఆయన అల్లుడు.. బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, అతని సోదరుడు నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలు చెప్పినట్టే చేశానని వివేకా పీఏ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. పెద్దోళ్లు కనుక వారు చెప్పినట్టే చేయాల్సి వచ్చిందన్నారు. 'వారు చెప్పినట్లు చేయకపోతే నువ్వు కూడా జైలుకు వెళ్తావు' అని వివేకా కుమార్తె సునీతమ్మ కూడా చెప్పడంతో వారి సూచనల మేరకు నడుచుకున్నానని ఇటీవల ఆయన ఓ టీవీ చానల్ (ఎన్‌టీవీ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పూసగుచ్చినట్లు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

■ రోజులాగే ఆ రోజు వెళ్లాను

నేను 30 ఏళ్లకు పైగా వివేకా సార్ వద్ద పని చేస్తున్నాను. ప్రతిరోజు 5.30 గంటలకు సార్ ఇంటికి వెళ్లే అలవాటు. ఆ రోజు కూడా అలాగే వెళ్లాను. ఆయన నిద్ర లేచి ఉంటే హాలులో లైట్ వేస్తారు. వాచ్‌మన్ రంగన్న పడుకొని ఉన్నాడు. సార్ ఇంకా లేవలేదని బయటికి వచ్చి, వీధిదీపం కింద ఐదు నిమిషాలు ఆంధ్రజ్యోతి పేపర్ తిరగేశాను. వివేకా సతీమణి సౌభాగ్యమ్మకు ఫోన్ చేశాను. 'సార్ లేట్‌గా వచ్చి ఉంటాడులే.. కొద్దిసేపు పడుకోని' అని ఆమె సూచించారు. తిరిగి పేపర్ చదువుతుండగా.. వంట మనిషి లక్ష్మి, ఆమె కుమారుడు వచ్చారు. సార్ ఇంకా లేవలేదా? అని అడిగారు. 'రాత్రి లేట్‌గా వచ్చి ఉంటారు.. లేప వద్దని మేడమ్ చెప్పింది' అని చెప్పాను. కొద్దిసేపటి తర్వాత.. సార్ లేవకపోతే లేపాలి కదా.. మళ్లీ ఎందుకు లేపలేదు.. అని అరుస్తారని వంటమనిషి లక్ష్మిని బెడ్‌రూమ్ సైడుకు వెళ్లి పిలవాలని చెప్పాను. లక్ష్మి బెడ్‌రూము వద్దకు వెళ్లి పిలిచి వచ్చే సమయంలో వాచ్‌మన్ రంగన్న లేచి.. బెడ్‌షీట్‌ను సందులో పెట్టి ఉత్తరం వైపు ఉండే గార్డెన్ వైపు వెళ్లిపోయాడు. అంతలోనే వాచ్‌మెన్ రంగన్న పరుగెత్తుకుంటూ వచ్చి సార్ పడిపోయాడని చెప్పాడు. నేను వంటమనిషి కుమారుడు ప్రకాశ్ నార్త్ సైడ్ వాకిలి గుండా లోపలికి పరుగెత్తాము.

■ లోపలికి వెళ్లి చూస్తే అంతా రక్తమే

ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బెడ్‌రూం అంతా రక్తం. భయం వేసింది. ఏసీ, లైట్ ఆన్‌లో ఉంది. సార్ మాత్రం బెడ్‌పై లేడు. బాత్‌రూములో పడిపోయి ఉన్నాడు. నాడి పట్టుకుని చూశా. తలపై గాయం కనిపిస్తోంది. నాతోపాటు ఉన్న ప్రకాశ్‌తో మన సార్ మనకు లేడని చెప్పా. బయటికి వచ్చి వివేకా సార్ అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేశాను. 'బావ ఇక మనకు లేడు. ఎవరో ఏదో చేశారు. ఏదో జరిగింది. తలపై గాయం కనిపిస్తోంది. ఇల్లంతా రక్తం ఉంది' అని చెప్పాను. తర్వాత ఆయన సోదరుడు శివప్రకాశ్‌రెడ్డికి కూడా అదే చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి వైఎస్ వివేకా మొబైల్ సోఫాలో కనిపించింది. సైలెంట్‌లో ఉంది. ఏదో ఫోన్ రావడంతో రింగ్ అవుతున్నట్లు గుర్తించి, జేబులో పెట్టుకున్నాను. బెడ్ ముందు ఉన్న వీల్ చైర్ ముందు ఓ పేపరు పడి ఉంది. ప్రకాశ్, నేను దాన్ని ఓపెన్ చేసి చూశాము. అందులో సార్ రాసిన మ్యాటర్ ఉంది. ఆ లెటర్‌లో అక్షరాలు అంత క్లియర్‌గా లేవు. బాగా పరిశీలిస్తే 'డ్రైవర్ ప్రసాద్ నిన్న డ్యూటీకి త్వరగా రమ్మన్నందుకు నన్ను కొట్టి చంపాడు. మీరు డ్రైవర్ ప్రసాద్‌ను వదిలి పెట్టవద్దు' అని రెండుసార్లు రాసి ఉంది. కింద వైఎస్ వివేకా అని ఉంది.

■ లెటర్‌ను ఎవరికీ చూపించొద్దన్నారు

ఆ లెటర్ విషయం వెంటనే అల్లుడు రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. 'ఆ లెటర్‌ను జాగ్రత్తగా దాచి పెట్టు.. ఎవరికీ చూపించవద్దు' అన్నాడు. నేను పోలీసులతో ప్రాబ్లమ్ అవుతుంది కదా అని అడిగాను. 'అదంతా నేను వచ్చిన తర్వాత మాట్లాడతా. నీకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. నేను వచ్చాక పోలీసులకు ఇస్తాను. అప్పటి దాకా దాచి పెట్టు' అని చెప్పాడు. ఈ విషయంగా శివప్రకాశ్‌రెడ్డికి కూడా తెలియజేసి.. నాకు దిక్కుతోచడం లేదని చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వచ్చాడు. నేనే ఆయన్ను లోపలికి పిలుచుకుని వెళ్లాను. అవినాశ్‌రెడ్డితోపాటు శివశంకర్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి మరికొంత మంది ఉన్నారు. తర్వాత అవినాశ్‌రెడ్డి సార్ బయటికి వచ్చి లాన్‌లో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆ తర్వాత వైఎస్ అవినాశ్‌రెడ్డి చిన్నాన్న, పెద్దనాన్న, కుటుంబ సభ్యులు ఒకరి తర్వాత ఒకరు అక్కడికి వచ్చారు. నేను రంగన్నను పిలిచి దబాయిస్తే, రాత్రి దోశలు తిని నిద్రయానని చెప్పాడు.

■ పోలీసులకు చెప్పేద్దామంటే వినలేదు

గుండెపోటు విషయం ఎవరు ఎలా చెప్పారో తెలియదు. లెటర్, రక్తాన్ని బట్టి వైఎస్ వివేకాను ఎవరో ఏదో చేశారని నేను భావించాను. కొద్దిసేపటికి సీఐ శంకరయ్య, ఎర్రగంగిరెడ్డి వచ్చారు. ఎర్ర గంగిరెడ్డి రావడంతోటే బ్లడ్ వామ్‌టింగ్ చేసుకున్నాడని చెప్పాడు. బాత్‌రూములో గోడకు ఆరు, ఏడు అడుగులు రక్తం చిమ్మిందని చెప్పగా.. బేసిన్‌కు తల కొట్టుకుని రక్తం వచ్చి ఉంటుందిలే అన్నాడు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామా అంటే ఏం అవసరం లేదులే అన్నాడు. ఎర్రగంగిరెడ్డి ఇలా చెబుతున్నాడని నేను నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి చెప్పాను. పక్కన సీఐ ఉన్నాడని మాట్లాడాలని ఫోన్ సీఐకి ఇచ్చాను. వాళ్లిద్దరు మాట్లాడుకున్నారు. రాజశేఖరరెడ్డి స్టేషన్‌లో కంప్లైంట్ రాసివ్వాలని సూచించారు. కొద్దిసేపటికి ఎర్రగంగిరెడ్డి.. కంప్యూటర్ ఆపరేటర్ ఇనాయతుల్లాకు 'లక్ష్మమ్మను రమ్మను.. బక్కెట్‌తో నీళ్లు తీసుకుని ఇదంతా క్లీన్ చేయాలి' అని చెప్పాడు. లక్ష్మమ్మ సగం క్లీన్ చేసి.. కళ్లు తిరుగుతున్నాయని చెప్పి వెళ్లిపోయింది. తర్వాత తన వద్ద పనిచేసే పిల్లలు రాజశేఖర్, ట్యాంకర్ బాషాతో ఇనాయతుల్లా క్లీన్ చేయించారు. సార్ డెడ్‌బాడీ బాత్‌రూము నుంచి తేవడానికి ఎర్రగంగిరెడ్డితో కలిసి నలుగురు వెళ్లారు. తర్వాత అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు.

■ పోలీసులు బాగా కొట్టారు

అవినాశ్‌రెడ్డి ఉదయాన్నే వచ్చి వెళ్లాడు.. మళ్లీ రాలేదు. రక్తం శుభ్రం చేసే సమయంలో ఆయన లేరు. నేను సీఐ చెప్పినట్లు కంప్లైంట్ రాసిచ్చి ఆస్పత్రికి వెళ్లాను. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి.. నా భార్యను తీసుకొచ్చి పోస్టుమార్టం రూమ్ వద్ద సార్‌ను చూపించాను. తర్వాత సార్ డెడ్ బాడీని ఇంటి వద్దకు తెచ్చారు. అప్పుడు లెటర్‌ను నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఇచ్చాను. తర్వాత 15 నిమిషాలకు ఆ లెటర్‌ను ఎస్పీకి అందజేశానని, నీకు ఇబ్బంది లేదని రాజశేఖరరెడ్డి చెప్పాడు. సాయంత్రం 4 - 4.30 గంటల ప్రాంతంలో నన్ను పోలీసులు తీసుకు వెళ్లి జీఎస్‌టీయూ గెస్ట్‌హౌస్‌లో పెట్టారు. అక్కడి నుంచి నాతోపాటు మరికొందరిని వేముల పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కడప డీటీసీకి తీసుకెళ్లి 13 రోజులు పెట్టుకుని అందరినీ కొట్టారు. తర్వాత నాతోపాటు ప్రకాశ్, ఎర్రగంగిరెడ్డిని ముద్దాయిలుగా చూపిస్తూ రిమాండ్‌కు తరలించారు. మూడు నెలలు జైలులోనే ఉన్నాం. మధ్యమధ్యలో సునీతమ్మ, రాజశేఖరరెడ్డి వచ్చి మాట్లాడిపోయే వారు. మేము బయటికి వచ్చిన కొద్దిరోజుల తర్వాత కేసు సీబీకి బదిలీ చేశారు. తర్వాత సునీత, రాజశేఖరరెడ్డి.. సీబీఐకి సహకరించాలని చెప్పేవారు. అప్పటి నుంచి సీబీఐ అధికారులు ఎప్పుడు పిలిచినా వెళ్లి వచ్చాం.

సీబీఐ వాళ్లు కొడతారనుకోలేదు

సీబీఐ వాళ్లు ఢిల్లీకి రావాలని చెప్పారని నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. వెళ్లమని చెప్పి.. టికెట్ ఆయనే తీసిచ్చాడు. వారికి సహకరించాలని సూచించాడు. ఢిల్లీలో వాళ్లు నెల రోజులు పెట్టుకున్నారు. మధ్యలో రాంసింగ్ వచ్చి 'నేను చెప్పినట్లు చెబుతావా? లేదా? వైఎస్ అవినాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలు మిమ్మల్ని మ్యానేజ్ చేశారు. ఆ విషయం మీరు చెప్పడం లేదు. మేము చెప్పినట్లు చెప్పకపోతే జైలుకు పంపుతాం' అని బెదిరిస్తూ కొట్టేవారు. సీబీఐ అధికారులు ఇలా కొడతారని ఊహించలేదు. నెల తర్వాత నన్ను పంపించేశారు. ఆ తర్వాత నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతలు నన్ను హైదరాబాదుకు రమ్మని పిలిచారు. అక్కడికి వెళ్లాక 'నువ్వు రామ్‌సింగ్ సార్ ఎలా చెబితే అలా చేయాలి. లేకపోతే ఇబ్బందుల్లో పడతావు. నువ్వు సహకరిస్తే నిన్ను సేవ్ చేస్తాం. ఇదొక్కటే మార్గం' అని చెప్పారు. మధ్యమధ్యలో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి.. అవినాశ్ మ్యానేజ్ చేశాడని చెప్పమన్నారు.

■ అలాగైతే జైలుకెళ్లేది నువ్వేనని భర్తకు సునీత హెచ్చరిక

అవినాశ్ నన్ను మేనేజ్ చేయడం ఏమిటని అప్పుడే గట్టిగా వ్యతిరేకించాను. అప్పుడు సునీత నాపై ఫైర్ అవుతూ 'నువ్వు ఏమనుకుంటున్నావు.. నిన్ను ఎవ్వరూ కాపాడలేరు' అని హెచ్చరించారు. రాజశేఖరరెడ్డి నన్ను సముదాయించేలా భుజం తట్టాడు. నేను ఉన్నది ఉన్నట్లు చెబుతానని తెలియజేశాను. ఆ సమయంలో సునీత.. రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి 'కృష్ణారెడ్డి సహకరించకపోతే నువ్వే జైలుకు వెళతావు' అని చెప్పింది. ఆమె అలా ఎందుకు అనిందో నాకు అర్థం కాలేదు. తర్వాత కొద్ది రోజులకు రాత్రి సమయంలో సీబీఐ అధికారి రాంసింగ్ నా సెల్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. తర్వాత మా అబ్బాయితో ఫోన్ చేయించి (రామ్‌సింగ్‌కు తెలుగు సరిగా రాదు కనుక) మాట్లాడించాను.

నిజం చెబితే కొడతారేంటి?

'దస్తగిరి, రంగన్నలు మేము చెప్పినట్లు విన్నారు. నువ్వు కూడా చెప్పినట్లు వింటే సేవ్ చేస్తా' అని రామ్‌సింగ్ తెలిపారు. తెల్లవారగానే నీ ఇద్దరు కుమారులతో కలిసి కడపలోని కేంద్ర కారాగార గెస్ట్‌హౌస్‌కు రావాలని సూచించారు. నేను ఈ విషయం నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పగా, వెళ్లాలని సూచించాడు. హైదరాబాదులోని పిల్లలను పిలిపించి ఉదయం 11 గంటలకు వారితో కలిసి వెళ్లాను. మేము చెప్పినట్లుగా సహకరించాలని కోరారు. ఇందుకు నేను మరోమారు అభ్యంతరం చెబుతూ.. నాకు తెలిసిన విషయాలన్నీ చెబుతానని చెప్పాను. దాంతో ఆయన కట్టె తీసుకుని నన్ను కొట్టాడు. నిజం చెబితే కొడతారా? అంటూ మా పిల్లలు అడ్డుతగిలారు. సాయంత్రం వరకు నన్ను అక్కడే పెట్టుకుని బూతులు తిట్టి పంపారు. మళ్లీ పిలిచినప్పుడు కూడా ఇలాగే మాట్లాడితే నీ కథ ఉంటాదని హెచ్చరించారు.

చెప్పినట్లు వినలేదని పెళ్లి ఆపించేశారు

అప్పటికి వారం రోజుల్లో నా చిన్న కుమారుడి పెళ్లి. సీబీఐ వాళ్లకు నేను సహకరించలేదని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతకు కోపం వచ్చింది. వారు పెళ్లి కుమార్తె వారికి ఫోన్ చేసి 'కృష్ణారెడ్డి హత్య కేసులో ఉన్నాడు. వైఎస్ అవినాశ్‌రెడ్డికి సహకరించాడు. త్వరలో ఆస్తులు స్వాధీనం చేసుకుంటారు. ఈ పెళ్లి క్యాన్సిల్ చేసుకోండి' అని ఫోన్ చేసి చెప్పారు. నాకు విషయం తెలిసి నేను నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి వద్దకు వెళ్లగా సరైన స్పందన లేదు. పెళ్లి క్యాన్సిల్ అయితే కానీ అని నేను నిజాన్ని నిర్భయంగా చెప్పాలని భావించాను. ఆ తర్వాత నా కుమారుడు అమెరికా వెళ్లాడు. నేను ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతిపత్రం ఇవ్వబోతే ఆయన తీసుకోలేదు. అందుకే పులివెందుల కోర్టులో ప్రైవేటు కంప్లెయింట్ వేశాను. దాని గురించి ఇప్పటివరకు అతీగతీ లేదు. నా పాస్‌పోర్టు రెన్యువల్ కాకుండా ఆగిపోయింది. నా ప్రమోషన్, నా కుమారుడి పెళ్లి ఆగిపోయాయి. నేను వివేకాకు సేవ చేసినందుకు ఇస్తామన్న ఐదు ఎకరాల భూమి ఇవ్వలేదు. ఇలా అన్ని విధాలా నాకు అన్యాయం జరిగింది. ఇప్పుడు సీబీఐ కొత్త బృందం వచ్చింది. వారికి నాకు తెలిసిన విషయాలన్నీ చెప్పాను. వివేకాకు హైదరాబాద్, పులివెందుల, కడపల 200 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఆ ఆస్తులన్నీ దాదాపు కంపెనీ పేరుపైనే ఉండేవి.

కార్పొరేట్ కనుసన్నల్లో మోదీ ప్రభుత్వం



ఆనంద్‌బాగ్‌లో సీపీఐ ఇంటింటికీ పాదయాత్ర

అల్వాల్: కార్పొరేట్ కనుసన్నల్లో మోదీ ప్రభుత్వం పని చేస్తూ, పాలనను దిగజారుస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటికీ సీపీఐ పాదయాత్ర ఆనంద్‌బాగ్ చౌరస్తాలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగంలో పొందుపర్చిన సార్వభౌమత్వ విధ్వంసానికి మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాడు 5 ప్రభుత్వ రంగ సంస్థలు, 400 వందల ప్రభుత్వ సంస్థలను నిర్మించుకొని స్వావలంబన దిశగా అడుగులు వేస్తే, కాంగ్రెస్ కాలంలో ప్రారంభించిన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ తలుపులు మోదీ వచ్చాక పూర్తిగా తెరవబడ్డాయని అన్నారు. దేశంలో లాభాలతో నడిచే బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఉక్కు, బొగ్గు , రైల్వే, ఆయిల్ కంపెనీలు.. చివరికి రక్షణ రంగంతో పాటు అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేసేలా చట్టాలు చేశారని నారాయణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలమల్లేష్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. ఈ యాత్ర వినాయక్‌నగర్, వాజ్‌పేయినగర్ నుంచి నేరేడ్‌మెట్‌కు చేరుకుంది.

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरू) HEAVY WATER PLANT (MANUGURU)
गौतमी नगर पोस्ट Goutaminagar Post., आश्वापुरम Aswapuram - 507116,
भद्राद्रि कोत्तगुडेम जिला Bhadradri Kothagudem Dist., तेलंगाण राज्य Telangana State.

भारी पानी संयंत्र (मणुगूरु) के सीसीएस(पेंशन) नियमावली, 2021 के तहत
पेंशनभोगी / परिवार पेंशनभोगी के लिए

पेंशन अदालत नोटिस
PENSION ADALAT NOTICE

For the attention of Heavy Water Plant, Manuguru
Pensioners/Family Pensioners under CCS(Pension) Rules : 2021

भारी पानी संयंत्र (मणुगूरु) के पेंशनभोगी / परिवार पेंशनभोगी की शिकायतों पर विचार करने के लिए भारी पानी संयंत्र (मणुगूरु) में दिनांक 17.05.2023 को 10.30 से 13.00 बजेतक वीडियो कॉन्फ्रेंसिंग द्वारा पेंशन अदालत आयोजित किया जाएगा जिसके लिए लिंग का विवरण निम्नलिखित वेब - साइट पर उपलब्ध किया जाएगा । पेंशन लाभों से संबंधित शिकायतों पर अदालत में विचार किया जाएगा । शिकायतें पहले से ही निपटान की गई / उत्तरित / मुकदमे के तहत या पूरी तरह से कानूनी मामले जैसे उत्तराधिकार और नीतिगत मामलों पर विचार नहीं किया जाएगा । भारी पानी संयंत्र (मणुगूरु) के पेंशनभोगी / परिवार पेंशनभोगी निर्धारित प्रारूप में अपनी शिकायतें, यदि कोई हो, श्री पी. रामचन्द्र राजु उप लेखा नियंत्रक, भापासंम को दिनांक 13.05.2023 तक ई-मेल dca@man.hwb.gov.in पर या पोस्ट द्वारा लिफाफे पर पेंशन अदालत हेतु लिख कर प्राप्त मामलों पर विचार किए जाएँगे । शिकायतें पंजीकरण प्रपत्र HWB Website: www.hwb.gov.in पर उपलब्ध है ।

A "PENSION ADALAT" is scheduled to be held at 10.30 hrs to 13.00 hrs. on 17.05.2023 at Heavy Water Plant. Manuguru to consider and redress grievances of HWP Manuguru pensioners and family pensioners. The Pensioners / Family Pensioners can choose to attend the Adalat through Video Conferencing through a link which will be provided in due course in the HWB website mentioned below. Grievances pertaining to pensionary benefits would be considered in the Adalat. Grievances already settled/replied/under litigation or involving purely legal points e.g. succession and policy matters will not be considered. HWP Manuguru pensioners and family pensioners may send their grievances if any. in the prescribed format to Shri P. Ramachandra Raju. Dy. Controller of Accounts. on email at dca@man.hwb.gov.in or by post at the above address in an envelope superscribed "PENSION ADALAT" Grienvances received in HWPM by 13.05.2023 shall be considered. Grievances Registration form is available in the HWB Website: www.hwb.gov.in

HWP(M)/Admn(G)/NIT/19/2023/2380 Dt: 05/05/2023.

నగర వార్తలు

ప్రపంచంలో ఈ ప్రదేశం తపోస్థలి

- ఉదాసీన్ మఠం అధ్యక్షుడు మహంత్ రఘుమునీజీ

కూకట్‌పల్లి: అంతర్జాతీయ ప్రమాణాలతో కూకట్‌పల్లిలో నిర్మించనున్న ఉదాసీన్ మఠం ఆధ్యాత్మిక, విద్యాకేంద్రానికి శుక్రవారం మఠం అధ్యక్షుడు మహంత్ రఘుమునీజీ భూమిపూజ చేశారు. హైదరాబాద్ ఉదాసీన్ మఠం నిర్వాహకుడు రామకృష్ణ దంపతులు, దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు, ఉదాసీన్ మఠం ఉపాధ్యక్షుడు మహంత్ అరుణ్‌దాస్ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహంత్ రఘుమునీజీ మాట్లాడుతూ.. ఉదాసీన్ మఠం అనేది దేశ విదేశాలలో లక్షలాది మంది సభ్యులను కలిగిన ఆధ్యాత్మిక కేంద్రమని అన్నారు. ప్రపంచంలో ఈ ప్రదేశం ఉదాసీన్ మఠానికి ఒక తపోస్థలి వంటిదని తెలిపారు. శ్రీబాబా సజ్జన్ షా కమలాపతిజీ ఇక్కడ తపస్సు చేశారన్నారు. ప్రపంచంలో శాంతి, సామరస్యాలు వెల్లువిరియాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆ పరమాత్ముడిని కోరుకుంటున్నానని అన్నారు. మూడు రోజులుగా ఇక్కడ భూమిపూజ, పవిత్ర హవనం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు.



వేద పాఠశాల, గోశాల తదితరాలకు శంకుస్థాపన చేసిన మఠం అధ్యక్షుడు మహంత్ రఘుమునీజీ, ఉపాధ్యక్షుడు మహంత్ అరుణ్‌దాస్, రామకృష్ణ దంపతులు, ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

వేద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం..

- యువతకు ఆధునిక విద్యతో పాటు మన పవిత్ర గ్రంథాలపై అవగాహన కల్పించేందుకు వేద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. గోవుల సంరక్షణ కోసం గోశాల ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌ను సందర్శించే సాధువులు, సత్పురుషుల కోసం సంత్ నివాస్ నిర్మిస్తామన్నారు. హైదరాబాద్ ఉదాసీన్ మఠానికి చెందిన తపస్వి కమలాపతిజీ వారిలో ఒకరని అన్నారు. ఉదాసీన్ శాఖ అనేది హిందూ వైదిక మతం యొక్క అంతర్గత శాఖ అని వివరించారు.
- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, ఉదాసీన్ మఠం ఆధ్వర్యంలో వేద పాఠశాల, గోశాల, ఆసుపత్రి, అనాథాశ్రమం వంటి ఇతర సౌకర్యాలతో పాటు అనేక ప్రజా ప్రయోజన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మఠం అందించే సేవలకు ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పరిధులపై అవగాహన కల్పించండి

- అధికారులు, సిబ్బందికి కొత్వాల్ ఆనంద్ ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో కొత్త పోలీసుస్టేషన్లు, ఏసీపీ కార్యాలయాలు, డీసీపీ ఆఫీసులు అమలులోకి వచ్చిన నేపథ్యంలో వాటి పరిధులపై బాధితులు, ఫిర్యాదుదారులకు అవగాహన కల్పించాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన శుక్రవారం సౌత్, సౌత్ ఈస్ట్ జోన్లలోని కొత్త పోలీసుస్టేషన్లు, ఇతర కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. సైదాబాద్, చంద్రాయణగుట్ట, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో ఉన్న శాంతిభద్రతల విభాగం, ట్రాఫిక్ ఠాణాలతో పాటు ఏసీపీ కార్యాలయాలను సందర్శించారు. కార్యాలయాన్నీ పరిశీలించారు. కొత్తగా నిర్మితమవుతున్న, అభివృద్ధి పనులు జరుగుతున్న ఠాణాలు, ఆఫీస్‌ల తీరు తెన్నులను స్వయంగా అధ్యయనం చేశారు. ఆయా ఠాణాలు, ఇతర కార్యాలయాల్లో పని చేసే మహిళా సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

వైద్య ఖర్చులకు రుణాలు

ఫైబ్‌తో కేర్ హాస్పిటల్స్ ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: వైద్య చికిత్సలకు రుణ సౌకర్యాన్ని అందించేందుకు నగరానికి చెందిన కేర్ హాస్పిటల్స్, కన్స్యూమర్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ ' ఫైబ్' తో భాగస్వామ్యం చేసుకుంది. ఈ విషయాన్ని కేర్ హాస్పిటల్స్, గ్రూప్ సీఎఫ్ఓ వికాస్ రస్తోగి తెలిపారు. వాయిదాల పద్ధతిలో తీర్చే విధంగా పలు వైద్య చికిత్సలకు రూ. 10 లక్షల వరకూ రుణాన్ని అందిస్తామని, ఈ సదుపాయాన్ని ప్రస్తుతం హైదరాబాద్, భువనేశ్వర్‌ల్లోని తమ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చామని, తర్వాత దేశ వ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. తమ రెండు సంస్థల భాగస్వామ్యం రోగులకు, వారి కుటుంబాలకు వైద్య ఖర్చుల వల్ల ఎదురయ్యే ఆర్థిక భారం నుంచి బయటపడేందుకు తోడ్పడుతుందన్నారు. అత్యవసర వైద్య ఖర్చుల సందర్భంలో ఈ రుణాన్ని పొందేందుకు 21 నుంచి 55 సంవత్సరాల లోపు వయసు కలిగి, కనీస జీతం నెలకు రూ. 15 వేలు ఉన్న వారు అర్హులన్నారు.

సివిల్ సర్వీసెస్ ఆఫీసర్లకు ముగిసిన ఫౌండేషన్ కోర్సు



సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్ హెచ్ఆర్డీ)లో దేశంలోని 112 కేంద్ర సివిల్ సర్వీసెస్ ఆఫీసర్లకు 15 వారాల పాటు నిర్వహించిన ఫౌండేషన్ కోర్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్, ఎంసీఆర్ హెచ్ఆర్డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రశాంత మహాపాత్ర మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలనేవి స్థాయితో సంబంధం లేకుండా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, బలహీన వర్గాల ప్రజలలో గుణాత్మక మార్పులు తీసుకురావడానికి ఒక శక్తివంతమైన వేదికను అందిస్తాయన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ బెన్‌హుర్ మహేశ్ దత్ ఎక్కా మాట్లాడుతూ.. దేశంలో విధానాల రూపకల్పనలో ఐఏఎస్, ఐఈఎస్ అధికారులు వెన్నుముఖ అని అన్నారు. ఫౌండేషన్ కోర్సులో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన మనీష్ కుమార్‌ను డీజీ మెడల్, రోలింగ్ షీల్డ్‌తో సత్కరించారు.

ఓయూలో సందడిగా సింపోజియాల ప్రారంభం



మైనింగ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సింగరేణి కాలరీస్ టెక్నికల్ డైరెక్టర్ చంద్రశేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ సింపోజియాలు సందడిగా ప్రారంభమయ్యాయి. శనివారం 7 విభాగాలలో ప్రారంభమైన సింపోజిలయాలకు ముఖ్యఅతిథులుగా సివిల్ ఇంజినీరింగ్‌లో నిర్మాణ్-2023కు టీఎస్ ఆర్ అండ్ బీ ఇంజినీర్ - ఇన్-చీఫ్ గణపతిరెడ్డి, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఇన్ఫినిటీ-2023కు ఆర్‌సీఐ సీనియర్ సైంటిస్ట్ ఎన్‌కే సింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో టెక్నోనెన్స్-2023కు టీఎస్ ట్రాన్స్‌కో లిఫ్ట్ ఇరిగేషన్ డైరెక్టర్ జె.సూర్యప్రకాష్ పాల్గొన్నారు. అలాగే, మెకానికల్ ఇంజినీరింగ్‌లో మెకరినా-2023కు కాంటినెంట్ కాఫీ లిమిటెడ్ డైరెక్టర్ సౌరభ్ ఖురాన, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆకృతి-2023కు ఆర్‌సీఐ సైంటిస్ట్ గోపాల్‌నాయక్, బయో మెడికల్ ఇంజినీరింగ్‌లో మెడిటెక్-2023కు మాజీ ఎంపీ, బీజేపీ నేత కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, మైనింగ్ ఇంజినీరింగ్‌లో ఇగ్నైట్-2023కు సింగరేణి కాలరీస్ టెక్నికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించి సావనీర్లను ఆవిష్కరించారు. రెండు రోజులు జరిగే సింపోజియాలలో వివిధ అంశాలపై సదస్సులు, రోబోటిక్స్, పేపర్ ప్రజెంటేషన్, ఎగ్జిబిషన్, డాన్సులు, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వీసీ ప్రొ.రవీందర్, కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ప్రొ.గోపాల్ నాయక్, డీన్ యూజీసీ ప్రొ. మల్లేష్, ప్రొ.మంగు, డైరెక్టర్ ప్రొ.శ్యామల, డాక్టర్ సుమన్, డాక్టర్ మేడిపల్లి శ్రీనివాస్‌తో పాటు ఆయా విభాగాల అధిపతులు, బీఓఎస్‌లు, డీన్లు, అధ్యాపకులు, స్టూడెంట్స్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఆదివాసీలు అంటే మోదీకి భయం

టీఏజీఎస్ రాష్ట్ర మహాసభలో బృందా కారత్



ర్యాలీలో పాల్గొన్న బృందా కారత్, నాయకులు

భద్రాచలంటౌన్: ఆదివాసీలు అంటే ప్రధాని మోదీకి భయమని, అందుకే వారి హక్కుల చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ అధ్యక్షురాలు బృందా కారత్ మండిపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శుక్రవారం జరిగిన తెలంగాణ ఆదివాసీ, గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర మూడో మహాసభకు ఆమె హాజరయ్యారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన సభకు బృందాకారత్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఆదివాసీలు మతం మారితే ఎస్టీ సర్టిఫికెట్లు రద్దు చేస్తామని బెదిరించడంతోనే కేంద్రం వైఖరి ఏమిటో తెలుస్తోందన్నారు. ఏ మతమైనా స్వీకరించే స్వేచ్ఛ ప్రజలకు ఉన్నప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నందునే బీఆర్ఎస్ ప్రభుత్వానికి తాము మద్దతిస్తున్నామని, పోడు చేస్తున్న ఆదివాసీలపై దాడులు ఆపి, హక్కు పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన

సాక్షి, హైదరాబాద్: అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 29 నుంచి మే 5వ తేదీ వరకు పెద్దఎత్తున కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మొత్తం 434 ఫైర్ డ్రిల్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు అగ్నిమాపకశాఖ తెలిపింది. అగ్నిప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఫైర్ సేఫ్టీ పరికరాల నిర్వహణ, ప్రాణ, ఆస్తినష్టం లేకుండా కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? మంటలు అంటుకున్నప్పుడు వాటిని ఆర్పేందుకు ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఎలా వాడాలి.. అన్న అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. డ్రిల్‌లో భాగంగా ప్రజలతోనే స్వయంగా మంటలార్పే పరికరాలు వాడకంపై శిక్షణ ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. ప్రతి ఫైర్ స్టేషన్ పరిధిలోని సిబ్బంది వారి పరిధిలోని ప్రాంతాల్లో తరచూ ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్సీ స్కాలర్‌షిప్‌లకు అందని కేంద్ర సాయం!

నిబంధనల సవరణతో మూడేళ్లుగా నిలిచిన నిధుల విడుదల

నేరుగా లబ్ధి అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విముఖత

- లబ్ధిదారుల వివరాలు ఇస్తేనే నిధులిస్తామన్న కేంద్రం
- ఏటా సగటున రావాల్సిన సొమ్ము రూ.250 కోట్లకుపైనే..
- గత మూడేళ్లలో అందాల్సిన నిధులు రూ.775 కోట్లు..
- 'క్యారీ ఫార్వర్డ్'కు అవకాశం లేక రాష్ట్ర ప్రభుత్వంపైనే భారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులకు కేంద్ర నిధులు అందడం లేదు. దీనికి సంబంధించి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మూడేళ్లుగా నిధుల విడుదలను నిలిపివేసింది. కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపితేనే నిధులు ఇస్తామని స్పష్టం చేసింది. దీనితో గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వానికి అందాల్సిన రూ.775 కోట్లు ఆగిపోయాయి. అంతేకాదు ఇలా నిలిచిన నిధులను తదుపరి ఏడాది ఇచ్చే (క్యారీ ఫార్వర్డ్) అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొందని.. అంటే భారమంతా రాష్ట్రంపై పడినట్టేనని అధికారులు చెప్తున్నారు. కేంద్ర నిధులు విడుదలకాక రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతున్నాయని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నిధులను సర్దుబాటు చేయాల్సి రావడంతో విద్యార్థులకు చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందంటున్నారు.

నేరుగా ఇచ్చేందుకే కేంద్రం పట్టు..: ఎస్సీవర్గాల వారికి నేరుగా లబ్ధి చేకూర్చేలా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మూడేళ్ల కింద నిబంధనపెట్టింది. కేంద్ర ప్రభుత్వం అందించే సాయం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వడం కాకుండా, నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసిన కేంద్రం..నిర్దేశిత ఫార్మాట్ ప్రకారం వివరాలు సమర్పించాలని ఆదేశించింది. ఒకవేళ నిర్దేశిత ఫార్మాట్‌లో పంపినా.. ఉపకార వేతన దరఖాస్తులు స్వీకరించిన వెంటనే ఇవ్వాలని స్పష్టం చేసింది. విద్యా సంవత్సరం ముగిశాక సమర్పిస్తే పరిగణనలోకి తీసుకోబోమని పేర్కొంది. ఆ ఫార్మాట్‌లో వివరాల సమర్పణకు, ఇతర నిబంధనలకు రాష్ట్రం అంగీకరించకపోవడం, వివరాలు పంపకపోవడంతో కేంద్రం నిధుల విడుదలను ఆపేసింది. మూడేళ్లలో ఇప్పటి వరకు రూ.775 కోట్లు ఇలా నిలిచిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపకార వేతనాలను నేరుగా విద్యార్థి ఖాతాలో జమచేస్తుండగా.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాలేజీల ఖాతాలో జమ చేస్తున్నారు.

2.26 లక్షల మంది విద్యార్థులు

రాష్ట్రంలో పోస్టుమెట్రిక్ ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఏటా సగటున రెండు లక్షల మందికిపైనే షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి 2.26 లక్షల మంది విద్యార్థులు ఫ్రెషర్స్, రెన్యువల్ కోటాలో దరఖాస్తు చేశారు. సాధారణంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాల చెల్లింపుల్లో ఇబ్బందులు తలెత్తేవి కావని.. మూడేళ్లుగా కేంద్ర నిధులు విడుదల కాక, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు సకాలంలో అందక బకాయిలు పేరుకుపోతున్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. 2022–23 విద్యా సంవత్సరాన్ని కూడా కలుపుకొంటే ఎస్సీ విద్యార్థులకు సంబంధించి దాదాపు రూ.650 కోట్లు మేర బకాయిలు ఉన్నట్టు తెలిసింది.

టుడేస్ గ్రాఫిక్

ఏ ఉత్పత్తి అయినా.. ఏ యాప్ అయినా.. దానిప్రాచుర్యాన్ని లెక్కించేది వినియోగదారుల సంఖ్యను బట్టే. ఈ లెక్కన ఓసారి 10 కోట్ల మంది యూజర్లు సంపాదించడానికి రకరకాల ఉత్పత్తులకు పట్టిన సమయాన్ని ఓసారి లెక్కేస్తే..



తగ్గిన మద్యం ధరలు

బీరు, రెడీ టు డ్రింక్ (బ్రీజర్ వంటివి) ధరలు యథాతథం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గాయి. బీరు, రెడీ టు డ్రింక్ (బ్రీజర్ లాంటివి) మినహా అన్ని రకాల మద్యం ధరలను ప్రభుత్వం తగ్గించింది. ఈ నిర్ణయంతో ఫుల్‌బాటిల్ రూ. 2 వేలలోపు ఎమ్మార్పీ ఉన్న మద్యం క్వార్టర్‌పై రూ.10, హాఫ్‌పై 20, ఫుల్ బాటిల్‌పై రూ. 40 తగ్గనుంది. రూ. 2 వేల కంటే ఎక్కువ ధర ఉన్న మద్యం క్వార్టర్‌పై రూ. 20, హాఫ్‌పై రూ. 40, ఫుల్ బాటిల్‌పై రూ. 80 తగ్గనుంది. తగ్గిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వస్తాయని, పాత స్టాక్‌ను మాత్రం పాత ధరలకే అమ్ముకోవచ్చని ప్రభుత్వం వెల్లడించింది. డిపో నుంచి కొత్త స్టాక్ తెస్తే తగ్గిన ధరకే విక్రయించాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో మద్యం ధరలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో మద్యం ఆయా రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ అమ్ముతున్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీన్ని నివారించడానికే మద్యం ధరలను తగ్గించినట్లు ఎక్సైజ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రెండో దశ సోలార్‌లో 240 మెగావాట్లకు ప్రతిపాదన

8 ఏరియాల్లో రానున్న ప్లాంట్లు ● ప్రాజెక్టు నివేదికలపై చర్చించిన సింగరేణి సీఎండీ శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: బొగ్గు గనుల నుంచి విద్యుదుత్పత్తి వైపు మళ్లిన సింగరేణి సంస్థ మరింత విస్తరణ దిశగా మరిన్ని ప్లాంట్లపై దృష్టి సారించింది. నెట్‌జీరో ఎనర్జీ బొగ్గు సంస్థగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. రెండోదశలో 240 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్లను సింగరేణి వ్యాప్తంగా నిర్మించాలని, వీటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్లో శుక్రవారం జరిగిన సింగరేణి థర్మల్, సోలార్ విద్యుత్‌పై సమీక్షలో సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ వీటిపై చర్చించారు. సత్తుపల్లి వద్ద 35, శ్రీరాంపూర్ ఐ.కె. చెన్నూరు వద్ద 27.5, మందమర్రి ప్రాంతంలోని ఖాళీ ప్రదేశాల్లో 65 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఖాళీ స్థలంలో 37.5, రామగుండం-3 ఏరియాలో 41, భూపాలపల్లిలో 12, రామగుండం-1 ఏరియాలో పాత పవర్ హౌస్ స్థలంలో 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లను, ఇల్లందులో ప్రస్తుతం ఉన్న సోలార్ ప్లాంట్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో 15 మెగావాట్ల ప్లాంట్ నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు. కాగా, సింగరేణి ఏటా తన అవసరాలకు వినియోగించే 750 మిలియన్ యూనిట్లు పైనే. రెండు దశల్లో నెలకొల్పనున్న విద్యుత్ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే మరో రెండేళ్లలో సింగరేణి ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనాల్సిన అవసరమే ఉండదు. దీంతో సింగరేణి సంస్థ సోలార్ విద్యుత్ పై నడిచే పరిశ్రమగా 'నెట్ జీరో ఎనర్జీ'సంస్థగా మారిన తొలి బొగ్గు పరిశ్రమగా పేరు పొందనుంది.

ధాన్యం తడిచిందని బస్తాలు వెనక్కి..

ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోని మిల్లర్లు



ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తున్న హమాలీలు

వైరా రూరల్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా మిల్లర్లు మాత్రం ఖాతరు చేయట్లేదు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు చేసి మిల్లులకు పంపిస్తే తడిసిందంటూ వెనక్కి పంపేస్తున్నారు. ఖమ్మం జిల్లా వైరా మండలం దాచాపురంలో తాజాగా ఇలాంటి ఘటన వెలుగుచూసింది. గ్రామానికి చెందిన ముక్కార వెంకటకృష్ణారెడ్డి, మడుపల్లి ప్రసాద్, మరికొందరు రైతులు గరికపాడు సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రంలో గతనెల 30న 738 బస్తాలు కాంటా వేయించారు. వీటిని కొనుగోలు కేంద్రంలోనే నిల్వచేయగా మర్నాడు తెల్లవారుజామున వర్షం కురవడంతో ధాన్యం బస్తాల అడుగుభాగం తడిసింది. సొసైటీ నిర్వాహకుల సూచనతో ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టిన రైతులు, మే 1న సాయంత్రం నేరడలోని ఓ రైస్ మిల్లుకు పంపించారు. మిల్లర్లు 3 రోజుల పాటు ధాన్యాన్ని మిల్లు వద్దే ఉంచుకుని బస్తాలు తడిసిపోవడంతో వెనక్కి పంపుతున్నామని గురువారం చెప్పారు. దీనిపై గరికపాడు సొసైటీ సీఈఓ అక్కిశెట్టి రామకృష్ణను వివరణ కోరగా, విషయం నిజమేనని తెలిపారు. మరోమారు ఆరబెట్టాలని రైతులకు సూచించామని, ధాన్యాన్ని మిల్లుకు పంపించి రైతులు నష్టపోకుండా చూస్తామని చెప్పారు.

ఎంత ధాన్యం వచ్చినా కొంటాం

సాక్షి, హైదరాబాద్: అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, ఎంత ధాన్యం వచ్చినా పూర్తయ్యే వరకు కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత తమదేనని, దీనిపై సీఎం కేసీఆర్ స్పష్టంగా చెప్పారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7152 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, ఇప్పటివరకు 6000 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

సాక్షి రియల్టీ



రూ. 50 లక్షల లోపు గృహాలకు గిరాకీ!

- ఏప్రిల్‌లో 4,398 యూనిట్ల రిజిస్ట్రేషన్లు
- ఇందులో 54 శాతం వాటా ఈ ఇళ్లదే
- నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదికలో వెల్లడి
- రిజిస్ట్రేషన్లలో మేడ్చల్ వాటా 47 శాతం

అందుబాటు, మధ్య తరగతి గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. కరోనా తర్వాతి నుంచి విస్తీర్ణమైన, లగ్జరీ ఇళ్లకు గిరాకీ పెరిగినప్పటికీ.. రూ.50 లక్షలు లోపు ధర ఉన్న ఇళ్లకూ డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు. గ్రేటర్ హైదరాబాద్‌లో గత నెలలో రూ.2,230 కోట్ల విలువ చేసే 4,398 అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో 54 శాతం వాటా రూ.25 లక్షలు నుంచి రూ.50 లక్షల లోపు ధర ఉన్న మధ్య తరగతి గృహాలదేనని నైట్‌ఫ్రాంక్ ఇండియా నెలవారీ నివేదిక వెల్లడించింది.

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది జనవరి నుంచి గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుతూ వస్తుంది. జనవరిలో 5,454 యూనిట్ల రిజిస్ట్రేషన్లు కాగా.. ఫిబ్రవరిలో 5 శాతం వృద్ధి చెంది 5,725 యూనిట్లకు, మార్చిలో 22 శాతం పెరిగి 6,959 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. అయితే గతేడాది ఏప్రిల్‌లో జరిగిన 5,366 యూనిట్ల రిజిస్ట్రేషన్లతో పోలిస్తే గత నెలలో రిజిస్ట్రేషన్లలో 18 శాతం క్షీణత నమోదయింది. ఆయా రిజిస్ట్రేషన్ల విలువ 2022 ఏప్రిల్‌లో రూ.2,784 కోట్లతో పోలిస్తే 20 శాతం తగ్గుదల కనిపించింది.


- 2022 ఏప్రిల్‌తో పోలిస్తే గత నెలలో రూ.25 లక్షల లోపు, రూ.25–50 లక్షల మధ్య ధర ఉన్న గృహాలకు డిమాండ్ 2 శాతం వృద్ధి చెందింది. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన రిజిస్ట్రేషన్లలో ఈ ఇళ్ల వాటా 70 శాతం కాగా.. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 72 శాతానికి పెరిగింది. అలాగే రూ.కోటి, ఆపైన ధర ఉన్న గృహాల వాటా గతేడాది ఏప్రిల్‌లో 11 శాతం కాగా.. ఇప్పుడది 13 శాతానికి పెరిగాయి.
- కరోనా తర్వాతి నుంచి విస్తీర్ణమైన ఇళ్లకు జై కొట్టిన కొనుగోలుదారులు గత నెలలో నిరాసక్తి కనబరిచారు. 2022 ఏప్రిల్‌లో 1,000 నుంచి 2,000 చ.అ. విస్తీర్ణం ఉన్న యూనిట్ల వాటా 72 శాతం కాగా.. గత నెల నాటికి 69 శాతానికి తగ్గింది. ఇదే సమయంలో 500 చ.అ. నుంచి 1,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉన్న మధ్య తరగతి ఇళ్ల వాటా 14 శాతం నుంచి 17 శాతానికి పెరిగింది. అదే విధంగా 2 వేల చ.అ. పైన విస్తీర్ణం ఉన్న ఇళ్ల వాటా ఏడాది కాలంలో 11 శాతం నుంచి 12 శాతానికి వృద్ధి చెందింది.

మేడ్చల్ హల్‌చల్..


హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలతో కూడిన గ్రేటర్‌లో.. మేడ్చల్ హవా నడుస్తుంది. గత నెలలో సంగారెడ్డిలో సున్నా రిజిస్ట్రేషన్లు జరగగా.. 47 శాతం వాటాతో మేడ్చల్–మల్కాజ్‌గిరి తొలి స్థానంలో నిలిచింది. 38 శాతంతో రంగారెడ్డి, 14 శాతంతో హైదరాబాద్ ఆ తర్వాతి స్థానాలలో నిలిచాయి.

LAND REQUIRED
A Prestigious Real Estate Company Required
5-500 ACRES LAND
★ MUMBAI HIGHWAY
★ PATANCHERUVU TO SADASHIVPET
VILLAS AND PLOTTING DEVELOPMENT BASIS ONLY
9383494949

రియల్టీకి గ్రిడ్ బూస్ట్



సాక్షి, హైదరాబాద్: గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ ప్రాంతాలకే పరిమితమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఆఫీసులు నగరం నలువైపులా విస్తరిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం గ్రోత్ ఇన్ డిస్పర్షన్ (గ్రిడ్) పాలసీ అమలుతో ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు అందిస్తుండటంతో ఆఫీసు స్పేస్ నగరం చుట్టూ విస్తరిస్తున్నాయి. ఈ పాలసీలో భాగంగా ప్రభుత్వం ఔటర్ వెంబడి ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఉన్న 11 పారిశ్రామిక పార్క్‌లను ఐటీ పార్క్‌లుగా మార్చింది. దీంతో పాటు కొంపల్లిలో ఐటీ టవర్, కొల్లూరులో ఐటీ పార్క్‌లను నిర్మిస్తోంది. ఫలితంగా పశ్చిమం వైపున కాకుండా ఇతర ప్రాంతాలలో కొత్తగా 3.5–4 కోట్ల చ.అ. ఐటీ ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందని జేఎల్ఎల్ తెలిపింది. గ్రిడ్ పాలసీతో నగరం నలువైపులా ఐటీ విస్తరించింది. డెవలపర్లకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను కూడా అమలు చేస్తుంది. మూడు సంవత్సరాల వ్యవధిలో 500 లేదా అంతకంటే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న ఐటీ, ఐటీఈఎస్ యూనిట్లకు యాంకర్ యూనిట్ ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఇందులో సంబంధిత భూమిని 50 శాతం ఐటీ, ఐటీఈఎస్ ప్రయోజనాల కోసం వినియోగించగా.. మిగిలిన సంగంలో నివాస, వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించవచ్చనే వెసులుబాటును కల్పించింది. హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్ అనేది కేవలం రెండు ప్రధాన కారిడార్లలోనే కేంద్రీకృతమై ఉంది. హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలు గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్ ఇంజిన్లుగా పని చేస్తున్నాయి. 96 శాతం స్పేస్ ఈ ప్రాంతాల నుంచే ఉంది.





క్లుప్తంగా...

అభివృద్ధి చేస్తే భయమెందుకు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిజంగా అభివృద్ధి చేస్తే.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రజలను చూసి ఎందుకు భయపడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. వారిద్దరూ పిరికివాళ్లు అంటూ విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు అంటూ ఎక్కడికి వెళితే అక్కడ విపక్ష పార్టీల నేతలను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం వరంగల్‌లో కేటీఆర్ బహిరంగ సభ ఉంటే, గురువారం అర్ధరాత్రి మహిళలు అనికూడా చూడకుండా బీఎస్పీ కార్యకర్తలను అరెస్టు చేయడం పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడంపై కోర్టుకు వెళ్తామని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

నేడు మాయావతి రాక..

ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే తెలంగాణ భరోసా బహిరంగ సభలో తమ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ముఖ్య అతిథిగా పాల్గొంటారని బీఎస్పీ వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రికే ఆమె హైదరాబాద్ చేరకుంటారని వెల్లడించాయి.

'సాలు దొర సెలవు దొర' క్యాంపెయిన్

5 యాడ్ ఫిల్మ్‌లను విడుదల చేసిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ సర్కార్‌కు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర శాఖ చేపట్టిన 'సాలు దొర సెలవు దొర' క్యాంపెయిన్‌లో భాగంగా ఐదు యాడ్ ఫిల్మ్‌లను విడుదల చేసింది. 'రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయం, ఉద్యోగ నియామకాల్లో జాప్యం, వివిధ పథకాల అమల్లో దళితులకు



మోసం, మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు, సర్కార్ అవినీతిపై ఈ యాడ్స్ రూపొందించా'మని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ పాలనలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించేలా రాష్ట్ర పార్టీ గతేడాది జూన్‌లో 'సాలు దొర సెలవు దొర' క్యాంపెయిన్‌ని ప్రారంభించిందని తెలిపారు.


లీకేజీకి ఐటీ శాఖదే బాధ్యత

కేటీఆర్‌పై పోలీసులకు షర్మిల ఫిర్యాదు



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి ఐటీ శాఖదే బాధ్యతని.. అందుకే ఆశాఖ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీక్ ఐటీ శాఖ లోపం వల్లే జరిగిందని విమర్శించారు. ఐటీ చట్టం-2000 ప్రకారం రాష్ట్రంలోని ప్రతి కంప్యూటర్‌కు ఐటీ శాఖ మాత్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందని, రాష్ట్రంలోని అన్ని కంప్యూటర్ల నిర్వహణ, ఆడిట్ ఐటీశాఖ పరిధిలోకే వస్తా యని ఆమె గుర్తు చేశారు. కానీ, కేటీఆర్ మాత్రం తనకు సంబంధం లేదని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రగతిభవన్ నుంచే టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీపై సిట్ దర్యాప్తు కొనసాగుతోందని ఆరోపించారు. సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేశారు. టీఎస్‌పీఎస్సీలో కంప్యూటర్లు ఏ మాత్రం భద్రంగా లేవని, భద్రత లేకుండా మళ్లీ ఎలా పరీక్షలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. తిరిగి పేపర్‌లీక్ కాదని గ్యారంటీ లేదని చెప్పారు. డిజిటల్ భద్రత కల్పించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని షర్మిల సూచించారు.

కేటీఆర్ వైఖరితో వరంగల్ ప్రజల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: వరంగల్ వస్త్ర షాపింగ్ మాల్స్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపి నకిలీ చేనేత గుట్టును బయట పెట్టినా సంబంధిత మంత్రి కేటీఆర్ ఏమీ పట్టనట్టు వ్యవహరించడం వరంగల్ ప్రజల ఆగ్రహానికి గురిచేసిందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్లే కేటీఆర్ వరంగల్ పర్యటన విఫలమయ్యిందని స్పష్టం చేశారు. ప్రజల సొమ్మును లూటీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలకు వెన్నుదన్నుగా నిలబడటం వల్లే ప్రజలలో ప్రభుత్వంపై అనాసక్తి పెరిగిందని పేర్కొన్నారు.

'హిందూ ఏక్తా యాత్ర'కు అస్సాం సీఎం

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్‌లో బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించే 'హిందూ ఏక్తా యాత్ర'కు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, ఇతర నేతలు పాల్గొననున్నారు. 'ఈ యాత్ర' ద్వారా హిందూ సంఘటిత శక్తిని చాటుతామని సంజయ్ ప్రకటించారు. హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడే ప్రతి ఒక్కరూ ఈ యాత్రలో పాల్గొనాలని సంజయ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.



హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సతీష్

లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే సతీష్, వినోద్‌ను ప్రజలు ఆశీర్వదించాలి
- ఇక్కడ బండి సంజయ్ ఎంపీ అంటే ఇజ్జత్ అనిపిస్తోంది..
- హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్

హుస్నాబాద్: హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను మూడోసారి లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని, ఎమ్మెల్యే కంటే ఎక్కువతో లక్షకు పైబిలుకు మెజారిటీతో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించా లని మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ప్రజా ఆశీర్వాదసభ శుక్రవారం జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా 1.06 లక్షల ఎకరాలకు సాగునీరును ఇక్కడి ప్రజల పాదాల చెంతకు తెస్తున్న సతీష్‌కుమార్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని మంత్రి కోరారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి బండి సంజయ్, టీఆర్ఎస్ నుంచి వినోద్‌కుమార్‌లు పోటీచేస్తే.. 80 వేల మెజారిటీతో బండి సంజయ్‌ని గెలిపించారన్నారు. ప్రజలు నమ్మి గెలిపించినందుకు ఈ ప్రాంతంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పే దమ్ము ఉందాని బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. ఆయన పైసా అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎంపీ ఎవరని చెప్పుకోవడానికే సిగ్గనిపిస్తోందని, ఇక్కడ బండి సంజయ్‌ను గెలిపించుకోవడం ఇజ్జత్ అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. 'ఈ ప్రాంతానికి ట్రిపుల్‌ఐటీ తెచ్చాడా? నిధులేమైనా తెచ్చాడా? ఏదైనా విశ్వవిద్యాలయం తీసుకొచ్చాడా' అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఏనాడూ పర్యటించని పిచ్చోన్ని ఇంటికి పంపాలని, అభివృద్ధిని కాంక్షించే వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

రైతుల ఉసురుపోసుకున్న మోదీ

నల్ల చట్టాలతో ప్రధాని మోదీ రైతుల ఉసురు పోసుకున్నారని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇవ్వకుండా, పకోడీలు చేసుకొమ్మంటున్నందుకు మోదీని దేవుడం టున్నారా? అని ప్రశ్నించారు. మతం పేరిట పిల్లలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని, మోదీ వల్ల లాభపడ్డ ఏకైక వ్యక్తి అదానీ అని తెలిపారు. సమాధులు తవ్వితే అంటూ.. బండి సంజయ్ తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని, తవ్వాల్సింది సమాధులు కావని, బడి, కాలువలు, రైల్వే లైన్లు, గుడులకు పునాదులని హితవు పలికారు.

రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందే కాంగ్రెస్

ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ టీపీసీసీ అధ్యక్షుడు ప్రజలను అడుగుతుంటే నవ్వాలో, ఏడ్వాలో తెలియడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 75 ఏళ్లలో కాంగ్రెస్‌కు పదిసార్లు అవకాశం ఇస్తే కరెంట్, సాగునీరు, తాగునీరు ఇవ్వలేదని, కులవృత్తులను నాశనం చేశారని చెప్పారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందే కాంగ్రెస్ పార్టీయని, ఇప్పుడు ఒక్కసారి చాన్స్ ఇవ్వడంటూ ఏ ముఖం పెట్టుకొని ఆ పార్టీ నేతలు అడుగుతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితే కాదని, భారత రైతుల పార్టీ అని తెలిపారు. సభలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ

పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు మంత్రి కేటీఆర్ హుస్నాబాద్ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా అనభేరి చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాలో యువజన కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. హుస్నాబాద్‌కు ఏం చేశారని పర్యటిస్తున్నారంటూ ప్రశ్నించారు. దీంతో ఆయా పార్టీల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

పేపర్ లీకేజీ బీజేపీ దొంగల కుట్ర!

- వారిని పట్టుకుని జైలుకు పంపితే లీకేజీలు ఆగాయి: కేటీఆర్
- ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీల గంగిరెద్దులాట
- వరంగల్‌లో మంత్రి సుడిగాలి పర్యటన



చిన్నారులతో ముచ్చటిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన పేపర్ లీకేజీల వెనుక బీజేపీ దొంగల కుట్ర ఉందని.. వారిని పోలీసులు పట్టుకుని కేసులు పెట్టి జైలుకు పంపాక లీకేజీలు ఆగాయని ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖల మంత్రి కె. తారక రామారావు వ్యాఖ్యానించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, మరొకరు కలిసి పదో తరగతి పేపర్ లీక్ చేశారని ఆరోపించారు. చిల్లర మల్లర రాజకీయాలతో మత విద్వేషాలు సృష్టించి, పచ్చని తెలంగాణలో నెత్తురు పారించాలని చూస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం కేటీఆర్ గ్రేటర్ వరంగల్‌లో సుడిగాలి పర్యటన చేశారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించి, వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కాజీపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు.

మతం పేరిట చిచ్చుపెడుతున్నారు: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా తీసుకెళ్తున్నారని.. కానీ ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీలో గంగిరెద్దుల్లా వస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపీ వల్ల ఇంకా కుట్రలు జరుగుతాయని, మతం పేరిట చిచ్చుపెడుతారని ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ''రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయని సిగ్గుమాలిన పార్టీ బీజేపీ. మేం రూ.640 కోట్లతో గ్రేటర్ వరంగల్‌లో మంచినీటి సౌకర్యం కల్పించాం. రూ.1,100 కోట్లతో హెల్త్ సిటీ నిర్మిస్తున్నాం. బీజేపీకి నీయత్ ఉంటే వరంగల్‌కు ఏం చేశారో చెప్పాలి..'' అని సవాల్ చేశారు. మతం పేరిట మంటలు పెట్టడం తప్ప బీజేపీ ఏమీ చేయలేదన్నారు. వరంగల్‌కు ఐటీ రంగంలో ఉజ్వల భవిష్యత్ ఉందని.. శుక్రవారం నాలుగు ఐటీ కంపెనీలతో ఒప్పందం కూడా జరిగిందని, సుమారు 1,800 మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ముంబైకి పుణేలా.. హైదరాబాద్‌కు వరంగల్ మారుతుందన్నారు. సభలో రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు సతీశ్‌కుమార్, చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతు సమాఖ్య పేరుతో పొంగులేటి పార్టీ?

నేడు పొంగులేటితో భేటీ కానున్న నల్లగొండ జిల్లా నేత చకిలం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ వ్యూహంపై నల్లగొండ జిల్లాలో చర్చ జోరందుకుంది. బీజేపీలో చేరతారా... కాంగ్రెస్‌లో చేరతారా అన్న చర్చతో పాటు ఆయన సొంతంగా పార్టీ పెడతారన్న ప్రచారం ఇక్కడ జరుగుతోంది. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన బీఆర్ఎస్, ఇతర పార్టీల్లోని అసంతృప్త నేతలు పొంగులేటి శిబిరం టచ్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నల్లగొండ జిల్లా సీనియర్ నేత చకిలం అనిల్ కుమార్‌కు ఆహ్వానం అందడంతో ఆయన నేడు(ఈ నెల 6న) ఖమ్మంలో పొంగులేటితో భేటీ కానున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటికి నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలతోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. అయితే, పొంగులేటి బీజేపీలో చేరితే ఖమ్మం, నల్లగొండ వంటి జిల్లాల్లో ఆయన ప్రభావం చూపడం కష్టమేనని ఆయన అనుచరులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరినా కష్టమేనన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన తెలంగాణ రైతు సమాఖ్య (టీఆర్ఎస్) పేరుతో పార్టీ పెడతారన్న చర్చ సాగుతోంది. తద్వారా బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న ముఖ్యనేతలు, ఉద్యమంలో పనిచేసినా ప్రాధాన్యం దక్కని నేతలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్‌కు ఇటీవల రాజీ నామా చేసిన చకిలంను పొంగులేటి బృందం చర్చలకు ఆహ్వానించిందని అంటున్నారు.

మహారాష్ట్ర నేతలు బీఆర్ఎస్‌లోకి..

సీఎం కేసీఆర్ సమక్షంలో చేరిక

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల నేతలు సీఎం కేసీఆర్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో వార్ధా, అర్వి, రాంటెక్, ఉస్మానాబాద్, ఔరంగాబాద్ తదితర ప్రాంతాల నాయకులు బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన ప్రముఖుల్లో స్వరాజ్ షెట్కారీ సంఘటన్ మహారాష్ట్ర అధ్యక్షుడు జైకుమార్ శంకర్‌రావు బల్కెడే, బీజేపీ వార్ధా జిల్లా యువమోర్చా నేత హర్షల్ జైకుమార్ బల్కెడే, బీజేపీ మహారాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు యువరాజ్ ఆనంద్‌రావు పాటిల్ తదితరులున్నారు.

ప్రియాంక సభలో హైదరాబాద్ డిక్లరేషన్!

- విద్యార్థులు, నిరుద్యోగులకు ఏం చేస్తామో ప్రకటిస్తాం: రేవంత్
- 8న సరూర్‌నగర్ స్టేడియంలో 'యువ సంఘర్షణ సభ'
- ఏర్పాట్లను పరిశీలించిన ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే, రేవంత్



సరూర్‌నగర్ స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఠాక్రే, రేవంత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, రంగారెడ్డిజిల్లా: గతంలో వరంగల్ డిక్లరేషన్ పేరిట రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ విడుదల చేశారని.. అదే స్ఫూర్తితో సరూర్ నగర్ సభలో హైదరాబాద్ డిక్లరేషన్‌ను విడుదల చేస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తెలిపారు. దానిని ప్రియాంకాగాంధీ విడుదల చేస్తారని.. విద్యార్థులు, నిరుద్యోగులు, అమరవీరుల కుటుంబాలను ఎలా ఆదుకుంటామో అందులో ప్రకటిస్తామని చెప్పారు. టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో మార్చి ఉద్యోగ నియామకాలు ఎలా చేపడతామో సభలో వివరిస్తామని తెలిపారు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో కాంగ్రెస్ 'యువ సంఘర్షణ సభ' నిర్వహించనుంది. ఈ మేరకు శుక్రవారం రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. 'యువ సంఘర్షణ సభ' లోగోను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకే ఈ సభ నిర్వహిస్తున్నామని రేవంత్ చెప్పారు. విద్యార్థి, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ అండగా ఉందన్న భరోసా కల్పించేందుకే ప్రియాంక వస్తున్నారని తెలిపారు.

కేసీఆర్ విముక్త తెలంగాణ కావాలి

''ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఖాళీలను ఎలా నింపబోతున్నాం. ప్రైవేటు సంస్థల్లో 75శాతం స్థానికులకు రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని ఏ విధంగా తీసుకురాబోతున్నామో హైదరాబాద్ డిక్లరేషన్‌లో వివరిస్తాం. పేపర్ లీకేజీలను నియంత్రించేందుకు యూపీఎస్సీ తరహాలో ఉద్యోగ నియామకాలు ఎలా చేపట్టబోతున్నామో వివరిస్తాం'' అని రేవంత్ వెల్లడించారు. కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడ గొడితేనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. యువత కేసీఆర్ విముక్త తెలంగాణ తీసుకొచ్చేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అండగా ఉంటుంది..: ఠాక్రే

విద్యార్థులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని మాణిక్ రావ్ ఠాక్రే చెప్పారు. కర్ణాటకలో ఓడిపోతామన్న భయంతోనే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల వద్ద బీజేపీ నిరసనలు చేపడుతోందని విమర్శించారు. ఇలాంటివి తెలంగాణ రాజకీయ సంస్కృతికి మంచివి కావని.. ఇలాంటి చర్యలతో సంజయ్, కిషన్‌రెడ్డి గౌరవం తగ్గుతుందన్నారు.

సభ కోసం కోఆర్డినేటర్లు..

సరూర్‌నగర్‌లో నిర్వహించే ప్రియాంకా గాంధీ సభను విజయవంతం చేయడంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఇందుకోసం శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం నిర్వహించింది. సభ ఏర్పాట్లపై రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, రోహిత్ చౌదరి, రాష్ట్ర ముఖ్య నేతలు సమీక్షించారు. సభను విజయవంతం చేసేందుకు ఏడు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను నియమించారు. అనంతరం అనుబంధ సంఘాల చైర్మన్లతోనూ సమావేశం నిర్వహించారు. మరోవైపు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావ్ అధ్యక్షతన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. సభను విజయవంతం చేసేందుకు అన్ని అనుబంధ సంఘాలు, పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఠాక్రే, రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

త్రీ 'ఐ' నినాదంతో ముందుకు సాగాలి

- యువత జాబ్ క్రియేటర్స్‌గా ఎదగాలి: మంత్రి కేటీఆర్
- ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి
- హనుమకొండ కిట్స్‌లో ఐడియా ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి



కిట్స్ కాలేజీలో ఏఐసీసీటీఈ ఐడియా ల్యాబ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి ప్రతినిధి, వరంగల్/హసన్‌పర్తి: త్రీ 'ఐ' నినాదంతో ప్రపంచంలో అభివృద్ధి చెందిన ప్రథమ శ్రేణి దేశాల జాబితాలో భారత్ చేరుతుందని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్)లో ఏఐసీసీటీఈ ఐడియా ల్యాబ్ కేంద్రాన్ని ఆయన మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో వినూత్న ఆవిష్కరణపై చర్చించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ గ్రోత్ (త్రీ 'ఐ') లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తాగు, సాగునీరు, రోడ్లు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఇతర కనీస వసతులు, రైల్వే, విద్యుత్ సౌకర్యం వంటి పలు రకాల మౌలిక సదుపాయాలను దేశంలో కల్పించాల్సి ఉందని అన్నారు.

ప్రజలూ భాగస్వాములు కావాలి..

'త్రీ'ఐ నినాదం సాకారానికి ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మంత్రి కేటీఆర్ అన్నారు. విద్యార్థులు ఉన్నస్థానాలకు చేరేందుకు గట్టిగా ప్రయత్నించాలని సూచించారు. ప్రపంచంలో మేటి కంపెనీలకు భారతీయులైన సత్యనాదెళ్ల, సుందర్ పిచాయ్, లీనా నాయర్, శాంత నారాయణ్, లక్ష్మీనారాయణ్ వంటి అనేక మంది సీఈఓలుగా ఉన్నారని, వీళ్లంతా మనదేశంలో చదువుకొని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థల్లో అగ్రస్థానానికి ఎదిగారన్నారు.

ప్రజల చిత్తశుద్ధి వల్లే అగ్రస్థానానికి చైనా

1987 నాటికి భారత దేశం, చైనా ఆర్థికంగా ఒకే స్థాయిలో ఉన్నాయని, అయితే చైనాలో అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం, ప్రజలు చిత్తశుద్ధితో పనిచేయడం వల్ల నేడు ఆ దేశం జీడీపీ 18 ట్రిలియన్ డాలర్లకు చేరిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. యువత జాబ్ సీకర్‌గా కాకుండా జాబ్ క్రియేటర్‌గా తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. యువతకు అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం టీ హబ్, టీ వర్క్స్, రిచ్, వీ హబ్, టీఎస్ఐఏస్సీలను ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యాన్ని విడిచిపెట్టవద్దని, సీఎం కేసీఆర్‌కు అనేక అవరోధాలు, అవమానాలు ఎదురయ్యాయని.. వాటిని ఎదుర్కొంటూ నిలబడటం వల్ల తెలంగాణ సాధ్యమయిందని, ఆ స్ఫూర్తి విద్యార్థులందరిలో ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి, బసవరాజు సారయ్య, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మిగులు భూములు పంచుతాం

- మరమగ్గాలకు ఉచిత కరెంటు, గీత కార్మికుల ప్రమాద బీమా ప్రీమియం చెల్లిస్తాం
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టివిక్రమార్క



గొల్లగూడెంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి, యాదాద్రి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉన్న మిగులు భూములన్నింటిని నిరుపేదలకు పంచుతామని, అసైన్డ్ కమిటీలను పునరుద్ధరిస్తామని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ప్రకటించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గొల్లగూడెంలో ప్రారంభమై.. ముగ్దుంపల్లి, పెద్ద పలుగు తండా, గుర్రాల దండి, బట్టుగూడెం, పెద్ద రావులపల్లి, గోసుకొండ, రేవనపల్లి మీదుగా పోచంపల్లి వరకు సాగింది. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆయా గ్రామాల్లో జరిగిన కార్నర్ మీటింగ్స్‌లో భట్టి విక్రమార్క మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీమిచ్చి, అమలు చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం.. దళిత, గిరిజన, బలహీన వర్గాల నుంచి అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కుంటోందని ఆరోపించారు. రైతులకు ఇస్తున్నట్లుగానే 24 గంటల ఉచిత విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నేత వృత్తిని ప్రోత్సహించడానికి ఇస్తామని చెప్పారు. గీత కార్మికులకు ప్రమాద బీమా ప్రీమియం డబ్బులని ప్రభుత్వం నుంచే పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. గొర్ల పంపిణీ పథకం అవినీతి మయంగా మారిందని ఆరోపించారు. వేలమంది లబ్దిదారులు డీడీలు కట్టి ఏడాది దాటినా, ఇప్పటికీ ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుందని, ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తుందని హామీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు మెరుగైన వైద్యం అందించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు.

50 రోజులు పూర్తి..

భట్టి విక్రమార్క మార్చి 16న చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం 50వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంభ అనిల్‌కుమార్‌రెడ్డి.. బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామ శివారులో కేక్ కట్ చేసి భట్టి విక్రమార్కకు తినిపించారు.


పోటాపోటీగా బీజేపీ, కాంగ్రెస్ హనుమాన్ చాలీసా

గాంధీభవన్ గేట్లు దూకిన బీజేపీ కార్యకర్తలు.. అరెస్టు చేసి పీఎస్‌కు తరలించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు, కార్యకర్తలు పరస్పరం పోటాపోటీగా హనుమాన్ చాలీసా పఠనం ఉద్రిక్తతలకు దారితీసింది. శుక్రవారం అటు గాంధీభవన్, ఇటు నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం ఎదుట భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కర్ణాటకలో అధికారంలోకి వస్తే బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామంటూ అక్కడి కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో గాంధీభవన్‌తో సహా ఆ పార్టీ కార్యాలయాల ఎదుట హనుమాన్ చాలీసా పఠించి నిరసన తెలపాలని పార్టీశ్రేణులకు బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గాంధీభవన్ ఎదుట నిరసనలకు బీజేపీనాయకులు,కార్యకర్తలు ప్రయత్నించారు. అక్కడికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను బీజేపీ కార్యాలయం ఎదుటే పోలీసులు అడ్డుకున్నారు. కొందరు నాయకులు, కార్యకర్తలు బారికేడ్లు దూకి గాంధీభవన్ వైపు దూసుకెళ్లడంతో అక్కడి ప్రధాన గేట్లను పోలీసులు మూసివేశారు. పలువురు గాంధీభవన్ గోడలు దూకి లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించడంతో వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే హనుమాన్ చాలీసా పఠనం చేపట్టి బీజేపీ కార్పొరేటర్ దీపిక, ఇతర నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీలో ఉన్నవారు మాత్రమే హిందువులా? అని మహిళా కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. తాము కూడా రాముడిని, హనుమంతుడిని కొలుస్తామని, చాలీసా పఠిస్తామని పేర్కొంటూ పోటాపోటీగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. బీజేపీకి హిందుత్వం మాత్రమే తెలుసని, తాము అన్ని మతాలను గౌరవిస్తామన్నారు. గాంధీభవన్ గేట్లు ఎందుకు మూసేశారని మహిళా కాంగ్రెస్ నేతలు పోలీసులతో వాదించారు. హైదరాబాద్‌తో పాటు సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ తదితర జిల్లాల్లో బీజేపీ శ్రేణులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు.

పరపతి పెంచుకునేందుకు కిరాయి మనుషులు!

- ముఖ్యమంత్రిపై రేవంత్‌రెడ్డి ధ్వజం
- బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర వ్యక్తిని సీఎం ప్రైవేటు కార్యదర్శిగా నియమించారు
- దీనికి సంబంధించిన జీవోను రహస్యంగా ఉంచారు



విలేకరులతో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సొంత రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు ఇవ్వని సీఎం కేసీఆర్.. పక్క రాష్ట్రానికి చెందిన వారికి కొలువులు ఇస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. పరాయి రాష్ట్రంలో పరపతిని పెంచుకునేందుకే కిరాయి మనుషులను తెచ్చి పెట్టుకుంటున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఐటీ ఉద్యోగం వదిలేసిన మహారాష్ట్రకు చెందిన శరద్ మఢ్కర్ అనే వ్యక్తి బీఆర్ఎస్‌లో చేరారని పత్రికల్లో ప్రచారం చేసుకున్నారన్నారు. ఏప్రిల్ 10న బీఆర్ఎస్‌లో చేరిన అతడిని మే 2న సీఎం తన ప్రైవేటు కార్యదర్శిగా నియమించారన్నారు. ఎవరి సొమ్మని అతనికి ఏడాదికి రూ.18 లక్షల జీతం ఇస్తున్నారని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన జీవోను రహస్యంగా ఉంచారని, తక్షణమే ఆ జీవోను రద్దు చేయాలని రేవంత్ డిమాండ్ చేశారు.

కేసీఆర్ భ్రమలు తొలగిపోతాయి: తెలంగాణలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని.. ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం, చివరకు టీఎస్‌పీఎస్సీ అమ్ముకుందని రేవంత్ ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులు, నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణలో 2 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కేసీఆర్ సచివాలయాన్ని ప్రైవేట్ ఎస్టేట్ అనుకుంటున్నారని, త్వరలోనే ఆయన భ్రమలు తొలగిపోతాయని వ్యాఖ్యానించారు. బీజేపీని ఓడించాలని కేసీఆర్ అనుకుంటే.. కర్ణాటకలో మీడియా సమావేశం పెట్టి బీజేపీని ఓడించాల్సిందిగా పిలుపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఇతర బీజేపీ నేతలు ఎంఐఎంకు లొంగిపోయారని విమర్శించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽ 695	61,054	
నిఫ్టీ ▽ 187	18,069	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,210	△ 224
డోజోన్స్	33,580	△ 453
ఎఫ్‌టీఎస్ఈ 100	7,778	△ 76
డాక్స్	15,961	△ 227
షాంఘై	3,334	▽ 16
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	△ 35

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై		
బంగారం (99.9 గ్రాములు)	61,923	△ 277
బంగారం (99.5 గ్రాములు)	61,979	△ 279
వెండి (కిలో)	76,794	△ 330

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

ఒలెక్ట్రా ఆదాయం రూ. 376 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 376 కోట్ల ఆదాయం (కన్సాలిడేటెడ్)పై రూ. 27 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఆదాయం రూ. 271 కోట్లుగా, లాభం రూ. 18 కోట్లుగా నమోదైంది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 84 శాతం ఎగిసి రూ. 594 కోట్ల నుంచి రూ. 1,091 కోట్లకు చేరింది. నికర లాభం 86 శాతం వృద్ధితో రూ. 35 కోట్ల నుంచి రూ. 66 కోట్లకు పెరిగింది. 2021-22లో 259 ఎలక్ట్రిక్ బస్సులు డెలివరీ చేయగా, 2022-23లో 117 శాతం అధికంగా 563 ఈ-బస్సులను అందించినట్లు సంస్థ తెలిపింది. మొత్తం 3,394 బస్సుల కోసం ఆర్డర్లు ఉన్నట్లు వివరించింది. ఎలక్ట్రిక్ టిప్పర్లను కూడా విక్రయించడం ప్రారంభించామని, క్యూ4లో 17 వాహనాలను డెలివరీ చేశామని పేర్కొంది. సరఫరా వ్యవస్థ, స్థూల పరిస్థితులపరమైన రిస్కులు నెలకొన్నప్పటికీ తాము తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కె.వి. ప్రదీప్ తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల విభాగంలో అగ్రగామిగా కొనసాగేందుకు ఇది తోడ్పడుతోందని ఆయన పేర్కొన్నారు.

పతంజలి 'వెయిట్‌గో' తో సత్ఫలితాలు

హైదరాబాద్: బరువు తగ్గించడంలో తాము అభివృద్ధి చేసిన 'దివ్య వెయిట్‌గో' సత్ఫలితాలను ఇస్తున్నట్లు పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ తెలిపింది. తేలిక పాటి వ్యాయామాలు చేస్తూ, ఈ ఆయుర్వేదిక్ ఔషధాన్ని వినియోగిస్తే శరీరంలోని కొలెస్ట్రాల్, గ్లూకోజ్, ఇన్సులిన్‌లను తగిన స్థాయిల్లో ఉండేలా చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ జర్నల్ 'బయోమెడిషన్ అండ్ ఫార్మాకో థెరపీ'లో ఈ ఔషధం పనితీరు గురించి ప్రచురితమైనట్లు వివరించింది.



మనీ లాండరింగ్ పరిధిలోకి సీఏలు

- పీఎంఎల్‌ఏ కిందికి కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు
- అయిదు రకాల ఆర్థిక లావాదేవీలకు వర్తింపు
- కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: నల్ల ధనం చలామణీ, మనీ లాండరింగ్ కార్యకలాపాలను నిరోధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన కేంద్రం ఆ దిశగా మరో కీలక చర్య తీసుకుంది. బ్లాక్ మనీ చలామణీకి ఆస్కారం ఉండే అయిదు రకాల ఆర్థిక లావాదేవీలను, వాటిని క్లయింట్ల తరఫున నిర్వహించే చార్టర్డ్ అకౌంటెంట్లు, కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలను మనీ-లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) పరిధిలోకి చేర్చింది. దీంతో ఇకపై సదరు లావాదేవీలను నిర్వహించే సీఏలు, సీఎస్‌లు కూడా విచారణ ఎదుర్కొనాల్సి రానుంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మే 3న నోటిఫికేషన్ విడుదల చేసింది. స్థిరాస్తుల కొనుగోలు, విక్రయం; క్లయింట్ల డబ్బు, సెక్యూరిటీలు లేదా ఇతర ఆస్తుల నిర్వహణ; బ్యాంక్, సేవింగ్స్ లేదా సెక్యూరిటీస్ అకౌంట్ల నిర్వహణ; కంపెనీల ఏర్పాటు, నిర్వహణ కోసం నిధులు సమీకరించడంలో తోడ్పాటు; వ్యాపార సంస్థల కొనుగోళ్లు, విక్రయం.. మొదలైన అయిదు రకాల ఆర్థిక లావాదేవీలు ఇందులో ఉన్నాయి. పీఎంఎల్‌ఏ చట్టం 2002ను ప్రయోగించాల్సి వస్తే క్లయింట్ల స్థాయిలోనే సీఏలు కూడా జరిమానా, విచారణ ఎదుర్కొనాల్సి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'పీఎంఎల్‌ఏ నిబంధనలను అమలు చేస్తే క్లయింట్లతో సమానంగా సీఏలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా లావాదేవీ జరిగినట్లుగా భావిస్తే ఆ విషయాన్ని సీఏలు వెంటనే నియంత్రణా సంస్థకు తెలియజేయాలి' అని వివరించాయి.

రిపోర్టింగ్ అధికారులుగా సీఏలు..

ఆయా లావాదేవీల విషయంలో సీఏలు ఇకపై నియంత్రణ సంస్థలకు తెలియజేయాల్సిన రిపోర్టింగ్ అధికారులుగా వ్యవహరించాల్సి ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) పేర్కొంది. సదరు లావాదేవీలు నిర్వహించే క్లయింట్లందరి వివరాలను సేకరించి (కేవైసీ), రికార్డులను నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని తెలిపింది. క్లయింట్ల తరఫున ఏయే ఆర్థిక లావాదేవీలు జరపకుండా నిషేధం ఉందనే దాని గురించి తమ సభ్యుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీఏఐ వివరించింది. కొత్త మార్పులు సరైన కోణంలో అమలయ్యేలా చూసేందుకు, వృత్తి నిపుణులు పోషించగలిగే పాత్ర అర్థమయ్యేలా వివరించేందుకు నియంత్రణ సంస్థలు, అధికారులతో కలిసి పనిచేయనున్నట్లు ఐసీఏఐ తెలిపింది. నల్ల ధనం కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పీఎంఎల్‌ఏ నిబంధనలను కఠినతరం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు .. రాజకీయాలతో ప్రమేయమున్న వ్యక్తుల (పీఈపీ) ఆర్థిక లావాదేవీలను రికార్డు చేయడాన్ని తప్పనిసరి చేసింది. అలాగే లాభాపేక్ష రహిత సంస్థల ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని కూడా ఆర్థిక సంస్థలు, రిపోర్టింగ్ ఏజెన్సీలు సేకరించాల్సి ఉంటోంది. ఇక వర్చువల్ అసెట్స్ లావాదేవీలు నిర్వహించే క్రిప్టో ఎక్స్చేంజీలు, మధ్యవర్తిత్వ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించే యూజర్ల వివరాలను సేకరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.



ఫెడరల్ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 954 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 954 కోట్ల నికర లాభం ఆర్జించింది. 62 శాతం ఎగసింది. ఇది ఒక త్రైమాసికానికి బ్యాంక్ చరిత్రలోనే అత్యధికం కాగా.. ఇందుకు పెట్టుబడుల విక్రయ లాభాలు దోహదపడినట్లు బ్యాంక్ పేర్కొంది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 61 శాతం ఎగసి రూ. 3,165 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021-22) రూ. 1,970 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 25 శాతం పుంజుకుని రూ. 1,909 కోట్లను అధిగమించింది. ఇతర ఆదాయం 58 శాతం ఎగసి రూ. 734 కోట్లను తాకింది. దీంతో రికార్డ్ లాభం ఆర్జించినట్లు బ్యాంక్ వెల్లడించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.78 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గాయి.



సూచీలకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షాక్..!

- వారాంతాన ఒక శాతం పతనమైన మార్కెట్
- సెన్సెక్స్ నష్టం 695 పాయింట్లు
- 18,100 దిగువకు నిఫ్టీ

ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల ద్వయం 66% పతనంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. విలీన ప్రక్రియ తర్వాత సుమారు 150 – 200 మిలియన్ డాలర్ల మేర అవుట్‌ఫ్లో ఉండొచ్చని ఎంఎస్‌సీఐ నివేదిక తెలపడంతో ఇరు కంపెనీల షేర్లు గడిచిన మూడేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. అలాగే అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ భయాలు, వాల్ స్ట్రీట్ నుంచి బలహీన సంకేతాలు, ఈసీబీ పావుశాతం వడ్డీరేట్ల పెంపుతో పాటు వారాంతపు రోజు కావడంతో ట్రేడర్లు కీలక కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్ ఉదయం 586 పాయింట్ల నష్టంతో 61,163 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ఒక దశలో 747 పాయింట్లు క్షీణించి 61,002 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 696 పాయింట్లు నష్టపోయి 61,054 వద్ద ముగిసింది. నిఫ్టీ 139 పాయింట్ల పతనంతో 18,117 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 18,217 – 18,055 పరిధిలో కదలాడింది. ఆఖరికి 187 పాయింట్లు నష్టపోయి 18,069 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్, మీడియా, ఐటీ రంగాల షేర్లకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్ల పతనంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.50%, 0.30% చొప్పున నష్టపోయాయి. కాగా ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగానూ, యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.43 లక్షల కోట్లు హరించుకుపోయింది.

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 5.63% పతనంతో రూ.1625 వద్ద నిలిచింది. బ్యాంక్ రూ.56,228 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. హెచ్‌డీఎఫ్‌సీ 5.84% నష్టంతో రూ.1625 వద్ద క్లోజైంది. రూ.29,572 కోట్ల మార్కెట్ క్యాప్ ఆవిరైంది.



బంగారం డిమాండ్‌కు ధర సెగ

- భారత్ వినియోగదారుల కొనుగోళ్లు వాయిదా
- జనవరి–మార్చిలో డిమాండ్ 17 శాతం డౌన్
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక

ముంబై: దేశంలో బంగారం ధరలు తీవ్ర స్థాయికి చేరడంతో, జనవరి–మార్చి త్రైమాసికంలో డిమాండ్ భారీగా 17 శాతం పడిపోయింది. వినియోగదారులు తీవ్ర ధరల కారణంగా కొనుగోళ్లను వాయిదా వేసుకునే పరిస్థితి నెలకొంది. 'మొదటి త్రైమాసికంలో పసిడి డిమాండ్ ట్రెండ్స్' పేరుతో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన ఒక నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు...

- ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో భారత్ పసిడి డిమాండ్ 112.5 టన్నులు. 2022 ఇదే కాలంలో ఈ విలువ 135.5 టన్నులు.
- పసిడి ఆభరణాల డిమాండ్ ఇదే కాలంలో 94.2 టన్నుల నుంచి 78 టన్నులకు పడిపోయింది. 2010 నుంచి ఒక్క మహమ్మారి కరోనా కాలాన్ని మినహాయిస్తే పసిడి ఆభరణాల డిమాండ్ మొదటి త్రైమాసికంలో 100 టన్నుల దిగువకు పడిపోవడం ఇది నాల్గవసారి.



- విలువల రూపంలో చూస్తే, మొత్తంగా పసిడి కొనుగోళ్లు 9 శాతం క్షీణించి రూ.61,540 కోట్ల నుంచి రూ.56,220 కోట్లకు పడిపోయాయి.
- ఒక్క ఆభరణాల డిమాండ్ విలువల్లో చూస్తే, 9 శాతం పడిపోయి రూ.42,800 కోట్ల నుంచి రూ.39,000 కోట్లకు పడిపోయాయి.
- పెట్టుబడుల పరిమాణం పరంగా డిమాండ్ (కడ్డీలు, నాణేలు) 17 శాతం తగ్గి 41.3 టన్నుల నుంచి 34.4 టన్నులకు క్షీణించింది.

ప్రపంచ పసిడి డిమాండ్ కూడా మైనస్సే..

ఇదిలావుండగా, ప్రపంచ వ్యాప్తంగా కూడా పసిడి డిమాండ్ మొదటి త్రైమాసికంలో బలహీనంగానే నమోదయ్యింది. 13 శాతం క్షీణతతో ఈ పరిమాణం 1,080.8 టన్నులుగా ఉంది.

రూపాయి ఎఫెక్ట్...



పసిడి ధరలు పెరడానికి అంతర్జాతీయ అంశాలు ప్రధాన కారణంగా కనబడుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడ్ ఫండ్ రేటు పెరుగుదలను ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. డాలర్ బలోపేతం, రూపాయి బలహీనత వంటి కారణాలతో గత ఏడాదితో పోల్చితే పసిడి ధర 19 శాతం పెరిగింది. పసిడి 10 గ్రాముల (స్వచ్ఛత) ధర రూ.60,000 పైన నిలకడగా కొనసాగుతోంది. ధర తీవ్రతతో తప్పనిసరి పసిడి అవసరాలకు వినియోగదారులు తమ పాత ఆభరణాల రీసైక్లింగ్, తద్వారా కొత్త కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెట్టుబడులకు సంబంధించి డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫామ్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ విభాగంలో కొనుగోళ్ల పరిమాణాలు కొంత మెరుగుపడుతున్నాయి. డిమాండ్ వార్షికంగా 750 నుంచి 800 టన్నులు శ్రేణిలో నమోదుకావచ్చు.

– సోమసుందరం, డబ్ల్యూజీసీ భారత్ రీజినల్ సీఈఓ.

లైఫ్@360

వేసవిలో మనకు అధికంగా దొరికే పండు ఖర్బూజ పండు. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. కర్బూజలో దాదాపు తొంబై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటిని తిరిగి అందించడంలో కర్బూజపండు బాగా ఉపయోగపడుతుంది. ఈ పండు ముఖ్యంగా శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.



కర్బూజ పండంటి ఆరోగ్యం

● కర్బూజ పండులో ఎక్కువ శాతంగా ఉండే బీటాకెరోటిన్, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలోని తెల్ల రక్తకణాలను వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్ రాకుండా కాపాడతాయి. ● కర్బూజలో విటమిన్ ఎ ఎక్కువగా ఉండటం వల్ల కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది. ● కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. దీనివలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా పని చేసేలా ఉపయోగపడుతుంది. ● ఈ పండులో అధిక మోతాదులో పొటాషియం ఉండటం వలన గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలెట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి, గుండె జబ్బుల నుండి కాపాడుతుంది. ● తక్కువ క్యాలరీస్, ఎక్కువ పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది. ● ఖర్బూజ జ్యూస్ తాగడం వలన మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. ● ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణ శక్తిని మెరుగుపరుస్తుంది. ● ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది. ● కంటి ఆరోగ్యం, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది. వేసవిలో కర్బూజ పండు ముక్కలతోపాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.

వడదెబ్బ జాగ్రత్త పడదాం ఇలా...

మే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు...



ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది. శరీరంలో నీటిశాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది. అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి. ఇంకా ఎండల్లో ఎక్కువ తిరగకుండా ఉండాలి. అధికంగా ఎండలో తిరగటంతో రక్తకణాలు కుంచించుకుపోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం.

ఎలా గుర్తించాలి?

● చర్మం పొడిబారుతుంది. కళ్లు మంటలు రావడం, గుంజినట్లు అవడం జరుగుతుంది. ● శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపుతప్పతుంది. ● నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది. ● వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు అవుతాయి. ● శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం వస్తుంది. ● దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి ముప్పు ఏర్పడుతుంది.

ఎవరిపై ఎక్కువ ప్రభావం?

60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగేవాళ్లు, అతిగా ఔషధాలు తీసుకొనేవారు జాగ్రత్తగా ఉండాలి. వేసవి లో ఎక్కువ సేపు ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి వారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

ముందుజాగ్రత్తలు ఏమిటి?

● ప్రతిరోజు మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి. ● ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి.● రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. ● సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి. ● ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి. ● వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. ● నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. ● కొబ్బరి బోండాం, మజ్జిగ తాగండి. ● బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి. ● అలాగే నీళ్ల బాటిల్ తీసుకెళ్లండి. ● మధ్యాహ్నం 12 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు. ● కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడంవల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. మలబద్ధక సమస్య కూడా తగ్గుతుంది. ● శరీరంలో నీటిశాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి. ● వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి. ● జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది. ● ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, పండ్ల రసాలు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

● నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ తగలడం వలన కలిగిన బాధలు తగ్గుతాయి. ● వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటిమీద నీళ్లు చల్లుతూ ఉండాలి. నిమ్మరసంలో ఉప్పు కలిపి ఇవ్వాలి. ● కుమ్మున ఉడికించిన మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు. ● శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి. ● గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇస్తే ఉపశమనం కలుగుతుంది. ● తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి. ● లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి. ● నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగలో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి. ● వేడివేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి. ● బయటకు వెళ్లేటప్పుడు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగడం మంచిది. ● వీలయినంత వరకు ఎండవేళలో బయటికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

వ్యాధులనుంచి కాపాడుకుందాం

పోయిందనుకున్న కోవిడ్ ఇప్పుడు మళ్లీ ప్రభావం చూపిస్తోంది. కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే భయ పడాల్సిందేమీ లేదు. ఎందుకంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే ఒక్క కరోనానే కాదు, ఎన్నో అంటువ్యాధులు, ఇతర రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఏం చేయాలో తెలుసుకుందాం.



ఆరోగ్యకరమైన ఆహారం మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. మాంసం, బీన్స్ వంటి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీర పనితీరును మెరుగుపరుస్తాయి. పసుపు, అల్లం, నిమ్మరసం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందువల్ల ఆహారంలో అవి ఉండేలా చూసుకోవడం మంచిది.

వ్యాయామం... క్రమం తప్పకుండా చేసే ఏ తేలికపాటి వ్యాయామం అయినా సరే,రోగనిరోధకతను పెంచుతుంది. అందువల్ల ఏమీ చేయలేకపోయినా, కనీసం నడవడం వల్ల అయినా శరీరమంతటికీ రక్తప్రసరణ పెరుగుతుంది. అన్ని కణాలకూ ఆక్సిజన్ అందుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

ఒత్తిడి లేకుండా చూసుకోవాలి... ఒత్తిడి రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది మన శరీరంలో కార్టిసాల్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది రోగనిరోధక ప్రతిస్పందనను నెమ్మదింపజేస్తుంది. ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు, యోగా వంటివి ఒత్తిడిని తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి.

ద్రవపదార్థాలు... మంచి ఆరోగ్యానికి, బలమైన రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండేందుకు శరీరం హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడానికి సహాయపడుతుంది. రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి నీరు ఎంతో సహాయపడుతుంది.

సరిపడా నిద్ర... ఆరోగ్యం బాగుండాలంటే తగినంత నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గడంతో పాటుగా ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. తక్కువ నిద్రపోయేవారికి తొందరగా జలుబు లేదా ఫ్లూ వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. సామాజిక దూరాన్ని, శుభ్రతనుపాటిస్తూ ఉండటం, జన సమూహంలోకి వెళ్లినప్పుడు మాస్కులు వేసుకోవడం అవసరం. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకుంటే కోవిడ్ ఒక్కటే కాదు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తొందరగా దరిచేరవు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

INTRODUCING
MG COMET EV
THE NO-NONSENSE CAR



INTRODUCTORY PRICE STARTS AT ₹ 7 98 000*

BIG INSIDE, COMPACT OUTSIDE.



- **230 km** on a Single Charge**
- **₹519#/month** Charging Cost
- **Prismatic Cell Battery** with IP67 Rating
- **Automatic**



Floating Twin Display with Wireless Android Auto and Apple CarPlay###



i-SMART~ with 55+ Connected Car Features and Digital Key Sharing###

- ABS+EBD
- DUAL FRONT AIRBAGS
- ISOFIX CHILD SEAT ANCHORS
- TYRE PRESSURE MONITORING SYSTEM

15+ Standard Safety Features

COMET EV e-SHIELD

- 3 YEARS OR 1 LAKH KM WARRANTY^
- 3 YEARS ROAD SIDE ASSISTANCE
- 3 FREE LABOUR SERVICES^^
- 8 YEARS OR 1.2 LAKH KM WARRANTY ON BATTERY PACK

3-60 PLAN##

Assured buy back value of 60% for 3 years at an attractive price.

CHARGING SOLUTIONS

Complementary 3.3 kW home charging box installation

MG will take care of all your charging needs.^^^



VISIT YOUR NEAREST MG SHOWROOM FOR THE MG COMET EV EXPERIENCE. CALL 1800 100 6464 OR VISIT WWW.MGMOTOR.CO.IN

Terms and Conditions Apply. *Ex-Showroom price for base variant. **The range figure is based on internal test at ARAI under standard test conditions. Actual performance figures may differ in conditions other than test conditions. #Running cost calculated over 1000 km per month as applicable in Delhi NCR. ###Top variant features. ~i-Smart services are complementary for 1 year with the purchase of a new MG that hosts the i-smart technology. The services are activated on the date of delivery and validity period of services will commence from such date. 2GB Data/Month free for 1 year from date of delivery. After the consumption of 2GB within a month customer needs to recharge to continue data related services. ^The warranty on 12V battery and tyres is valid for 1 year. ^^For first 3 scheduled services. ##Contact your nearest MG dealer for specific package details. ^^^This includes: the charging box, feasibility of the site, cabling at the location up to 100m, installation and demo of the charging box done through vendors ECB and Allianz. Any kind of civil work is not included (wall construction, underground work etc.).

SOUTH: ANDHRA PRADESH: Guntur: MG Guntur (+919100069569) Nellore: MG Nellore (+919912916666) Rajahmundry: MG Rajahmundry (+917337559869) Tirupati: MG Tirupati (+919912916666) Vijayawada: MG Vijayawada (+919100068969) Vizag: MG Vizag (18001232748) | KARNATAKA: Belgaum: MG Belgaum (+919686689132) Bengaluru: MG Bengaluru Central (+919611600055), MG Bengaluru Chord Road (+919611600055), MG Bengaluru Electronic City (+919611600055), MG Bengaluru JP Nagar (+919611600055), MG Bengaluru Kalyan Nagar (+919611600055), MG Bengaluru ORR (+919611600055) Gulbarga: MG Gulbarga (+919606020518) Hassan: MG Hassan (+917227800880) Hubli: MG Hubli (+919364008122) Mangalore: MG Mangalore (+919770400055) Mysuru: MG Mysuru (+917227800880) Shimoga: MG Shimoga (+918758885454) Udupi: MG Udupi (+919770400055) | KERALA: Alleppey: MG Alleppey (+9189437 11111) Calicut: MG Calicut (+9189437 11111) Kannur: MG Kannur (+917593820351) Kochi: MG Kochi (+9189437 11111) Kollam: MG Kollam (+919567866647) Kottayam: MG Kottayam (+9189437 11111) Malappuram: MG Malappuram (+9189437 11111) Palakkad: MG Palakkad (+918943711111) Thrissur: MG Thrissur (+918943711111) Trivandrum: MG Trivandrum (+918606977039) | TAMIL NADU: Ambattur: MG Ambattur (+918585944994) Chennai: MG Chennai Anna Salai (+918585920900), MG Chennai OMR (+918447130606), MG Chennai Studio Z (Velachery) (+919811994070) Coimbatore: MG Coimbatore (+917995550009) Erode: MG Erode (+917995550009) Hosur: MG Hosur (+918585957080) Madurai: MG Madurai (+917995550009) Puducherry: MG Puducherry (+918447170202) Salem: MG Salem (+917995550009) Thanjavur: MG Thanjavur (+917995550009) Trichy: MG Trichy (+917995550009) Vellore: MG Vellore (+918447277227) TELANGANA: Hyderabad: MG Hyderabad Banjara Hills (+917799935258), MG Hyderabad Gachibowli (+917799935258), MG Hyderabad Kondapur (+917799935258), MG Hyderabad Kukatpally (+917799935258), MG Hyderabad LB Nagar (+918096154444) Karimnagar: MG Karimnagar (+919154843124) Khammam: MG Khammam (+919154843124) Mahbubnagar: MG Mahbubnagar (+919154843124) Nizamabad: MG Nizamabad (+919154843124) Warangal: MG Warangal (+919154843124)